
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ప్రకాశం

జిల్లా వార్తలు

బుధవారం 20, నవంబరు 2024

సైనికుల సేవలు సూపర్..



దేశ భద్రత కోసం పనిచేసిన మాజీ సైనికుల సేవలు మరువలేనివని కలెక్టర్ తమీమ్ అన్సారియా కొనియాడారు. మద్రాస్ ఇంజనీర్ గ్రూపు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మాజీ సైనికులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మోటారు సైకిళ్ల ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న కొందరు మాజీ సైనికులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎం.రజనీకుమారి, మాజీ సైనికుల సంఘ నాయకులు నెప్పల్లి నాగేశ్వరరావు, శ్రీరామమూర్తి, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కలెక్టరేట్

షెడ్ వేసేద్దాం..

గోకులం షెడ్ల నిర్మాణానికి రైతులు, గొర్రెల కాపరులు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారు. కూటమి ప్రభుత్వం పశువుల పాకల పథకాన్ని ప్రకటించిన వెంటనే మంచి స్పందన వచ్చింది. జిల్లాకు కేటాయించిన యూనిట్ల కన్నా ఇంచుమించు రెండున్నర రెట్లు అధికంగా దరఖాస్తులు అధికారులకు అందాయి. మొత్తం యూనిట్ విలువలో 90శాతం రాయితీ రూపంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధుల నుంచి ఇస్తుండటం అందుకు ప్రధాన కారణమైంది. అదేసమయంలో జిల్లాలోని అత్యధిక గ్రామాల్లో నాలుగైదు గేదెలు.. అలాగే 50 నుంచి 100 వరకు గొర్రెలు, మేకలు పెంచుకునే మధ్యతరగతి వారు అధికంగా ఉండటం వల్ల కూడా డిమాండ్ ఏర్పడింది.

కొండపి నియోజకవర్గానికి గోకులం షెడ్లు భారీగా మంజూరయ్యాయి. అయితే అధికారుల పొరపాట్లకు, అవినీతికి ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. కచ్చితంగా కొత్తగా నిర్మించుకునే వారికే అంటూ స్పష్టం చేసింది. దీంతో చాలామంది వెనక్కి తగ్గారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ఇప్పటికే 10 షెడ్ల నిర్మాణం పూర్తయ్యింది. 135 వివిధ దశల్లో ఉన్నాయి.



- కేటాయింపు కన్నా రెండున్నర రెట్లు ఎక్కువగా దరఖాస్తులు
- 90శాతం రాయితీ ప్రకటించడంతో పశుపోషకుల ఆసక్తి
- ఉపాధి నిధుల అనుసంధానం
- వేగంగా నిర్మాణాలు
- ఇప్పటికే కొన్ని పూర్తి
- సంక్రాంతిలోపు అన్నీ పూర్తికి అధికారుల ప్రయత్నం

గోకులం షెడ్‌లకు భారీ డిమాండ్

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు కూటమి ప్రభుత్వం దన్నుగా నిలిచే క్రమంలో భాగంగా చేపట్టిన పశువుల షెడ్ల నిర్మాణ పథకానికి జిల్లాలో భారీ డిమాండ్ ఏర్పడింది. పెద్దసంఖ్యలో అందిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు తొలుత వచ్చిన వాటికి ప్రాధాన్యం ఇస్తూ మంజూరు చేయడంతో జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రస్తుతం పశువుల షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పాడి పరిశ్రమకు ఊతం, గొర్రెలు, మేకల పెంపకం చేసే వారికి ఆసరాగా ఉండేందుకు ఎండలు, వర్షాల నుంచి వాటికి రక్షణ ఇచ్చేలా 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మినీ గోకులాల పేరుతో షెడ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో అలా 2018లో 500 యూనిట్లు మంజూరుచేయగా 300 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అప్పట్లో కూడా వీటిని ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతోనే ఇచ్చారు. అయితే పథకం ప్రవేశపెట్టిన కొద్దికాలానికి ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. ఆ లోపు కొంతమేర మాత్రమే లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడింది. చేసిన నిర్మాణాలకు కూడా బిల్లులు ఇవ్వక లబ్ధిదారులు నష్టపోయారు.

రాయితీ పెంపుతో ఆసక్తి

తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ గోకులాలపై దృష్టి సారించింది. ఈసారి యూనిట్ విలువతోపాటు రాయితీని కూడా పెంచింది. పశువుల పాకలకు యూనిట్ విలువ కనిష్ఠంగా రూ.1,03,500, గరిష్ఠంగా రూ.2,07,000గా నిర్ణయించింది. అందులో కేవలం పది శాతం మాత్రమే లబ్ధిదారుడు తన వాటాగా చెల్లిస్తే మిగిలిన 90శాతం ఉపాధి హామీ పథకం నుంచి ఇస్తారు. అలాగే గొర్రెలు, మేకల షెడ్లకు కనిష్ఠంగా రూ.1.30 లక్షలుగా నిర్ణయించగా అందులో లబ్ధిదారులు 30శాతం తమ వాటాగా చెల్లించాలి. పశుసంవర్ధకశాఖ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేస్తే

మిగతా 6వ పేజీలో

వచ్చే ఏడాది కూడా కొనసాగుతుంది



పశువుల పాకల నిర్మాణాలు ప్రభుత్వ ప్రాధాన్య అంశం. ఈ ఏడాది జిల్లాకు 1,075 టార్గెట్ ఇచ్చారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పశుసంవర్ధకశాఖ అధికారులది. మాకు వచ్చిన ప్రతిపాదనల్లో 584 మంజూరు చేశాం. 380 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మిగతావి కూడా మంజూరు చేసి సంక్రాంతికి అన్నీ పూర్తిచేస్తాం. డిమాండ్ అధికంగా ఉంది. వాటిని వచ్చే ఏడాది తీసుకుంటాం.

- జోసఫ్‌కుమార్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

ఎండ, వానలకు ఇబ్బంది తప్పింది



కూటమి ప్రభుత్వం గోకులాల పేరుతో షెడ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. నాకు షెడ్డు మంజూరైంది. పశువులను రోజూ పొలాల్లో మేపుకుని వచ్చాక ఆరుబయట కట్టేస్తాను. ఇప్పుడు గోకులం షెడ్డు నిర్మాణం పూర్తయ్యాక అవి నీడలో ఉంటాయి ఎండ, వానలకు వాటికి ఇబ్బంది ఉండదు.

- ముప్పరాజు శేషమ్మ, అనకర్లపూడి, కొండపి మండలం

పశువులకు శాశ్వత నిర్మాణాలు



సొంతంగా షెడ్లు నిర్మించుకోలేక పూరికొష్టాలు, ఆరుబయట రోడ్ల వెంబడి పశువులను కట్టేస్తున్నాం. దీనివల్ల ఇబ్బంది పడుతున్నాం. ఆరు పశువులకు గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2.30లక్షలు అవుతుండగా, అందులో పదిశాతం రూ.23వేలు మేము పెట్టుకుంటున్నాం. మిగతాది ప్రభుత్వం ఇస్తోంది. శాశ్వతంగా పశువులకు ఆవాసం ఏర్పడుతుంది.

- కోడూరి పద్మ, ముప్పరాజుపాలెం, కొండపి మండలం

పగ వదిలి.. ప్రగతి వైపు కదిలి

25 ఏళ్ల క్రితం వరకూ ఫ్యాక్షన్‌తో రగిలిపోయిన బొప్పూడివారిపాలెం

- అప్పట్లో కర్రలు, బాంబులతో దద్దరిల్లిన గ్రామం
- రాజకీయ ముఠాలుగా విడిపోయిన ఊరు
- బంధువులకు దూరమై.. ఆర్థికంగా నష్టపోయిన నేల
- క్రమంగా అన్నీ వదిలేసి పిల్లల చదువులపై దృష్టి
- పాడి పంటలు, ప్రశాంతత, అభివృద్ధిపై కేంద్రీకరణ
- నేడు ఏ ఇంట్లో శుభకార్యమైనా ఊరంతా వేడుకలోనే..

7

నగరం.. సుందరం



ఒంగోలు నగర సుందరీకరణ శరవేగంగా జరుగుతోంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో రూ.కోటి వ్యయంతో అధికారులు వివిధ పనులు చేయిస్తున్నారు. ఒకవైపు పారిశుధ్య మెరుగునకు ప్రాధాన్యం ఇస్తూనే మరోవైపు డివైడర్లకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేస్తున్నారు. వాటి మధ్య రకరకాల మొక్కలు నాటిస్తున్నారు.

7

ఒంటెత్తు పోకడలు.. ఆపై వేధింపులు

- రాష్ట్ర నాయకులను కలిసిన అసమ్మతి తెలుగు తమ్ముళ్లు
- ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జిపై ఫిర్యాదు

మార్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'పార్టీలో సీనియర్ నాయకులను పట్టించుకోవడం లేదు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని పోలీసుల ద్వారా వేధిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఉన్న అధికారులను ఇంకా కొనసాగించడంలాంటి ఒంటెత్తు పోకడలకు పోయి పార్టీని మరింత నిర్వీర్యం చేస్తున్నారు..' అంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుపై ఎర్రగొండపాలెం టీడీపీ నాయకులు మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ కేంద్రం నుంచి టీడీపీ అసమ్మతి నాయకులు సుమారు 30 వాహనాల్లో మంగళగిరి తరలివెళ్లారు. అక్కడ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, వర్ల రామయ్య,

మిగతా 6వ పేజీలో

విస్తారంగా పొగాకు సాగు

- దక్షిణాదిలో ఇప్పటికే 40వేల హెక్టార్లలో నాట్లు
- నారు రేటు, కూలి ఖర్చు రెట్టింపు
- అయినా ముమ్మరంగా నాట్లు
- పెరగనున్న విస్తీర్ణం
- రెండేళ్ల ధరలు, వాతావరణ అనుకూలతే కారణం

చేకూరపాడు వద్ద నాట్లు వేస్తున్న కూలీలు



ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో పొగాకు పంట ఈ ఏడాది విస్తారంగా సాగుతోంది. పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. నారు, కూలీల ఖర్చు రెట్టింపు అయినా.. కర్ణాటకలో ప్రస్తుత సీజన్ మార్కెట్ ప్రతికూలంగా సాగుతున్నా ఇక్కడి రైతులు మాత్రం జోరుగానే పంట సాగు చేస్తున్నారు. ఇప్పటికే దక్షిణాదిలో దాదాపు 40వేల హెక్టార్లలో పొగాకు నాట్లు పూర్తికాగా మరో నెలన్నరకు పైగా సాగుకు అవకాశం ఉండటంతో మరో 40 నుంచి 50వేల హెక్టార్లలో నాట్లు వేసే పరిస్థితి కనిపిస్తోంది.

అందరి చూపు పొగాకు వైపే

ఒంగోలు కేంద్రంగా ఉన్న దక్షిణాదిలోని రెండు రీజియన్లలో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గత ఏడాది

మిగతా 6వ పేజీలో

జీజీహెచ్‌లో మదర్ కేర్ సెంటర్

- త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అన్సారియా వెల్లడి
- ఆస్పత్రి సందర్శన
- వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంపై ఆగ్రహం
- హెడ్ నర్సుకు చార్జ్‌మెమో

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు బంగారు బాల్యాన్ని అందించేందుకు ఒంగోలులోని జీజీహెచ్‌లో త్వరలోనే 'కంగారు' మదర్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ఆమె ఆస్పత్రిని సందర్శించారు. పలు వార్డులలో పర్యటించి రోగులతో మాట్లాడారు. అక్కడ అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ న్యూ బార్న్ మదర్ కేర్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కనిగిరి సీహెచ్‌సీలో కేఎంసీ పైలట్ ప్రాజెక్టును చేపట్టేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పలుప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రస్తుతం జీజీహెచ్‌లోని గైనిక్, నవజాత శిశుకేంద్రాలను పరిశీలించామన్నారు. కేఎంసీ అంటే తన బిడ్డకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహజ సిద్ధమైన సంచిలో దాచి ప్రాణాలు కాపాడే కంగారు మాదిరిగా ఉంటుందన్నారు. నెలలు నిండకుండా పుట్టిన, బరువు తక్కువగా జన్మించిన శిశువులకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా చూడాలన్న ఆలోచనతోనే కంగారు మోడల్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ ఉన్నారు.

పారిశుధ్యం అధ్వానంపై సీరియస్

జీజీహెచ్‌లో దాదాపు రెండు గంటలపాటు కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. అన్ని వార్డులను పరిశీలించారు. వార్డుల్లో బాత్‌రూంలు అధ్వానంగా ఉండటంతోపాటు, దుర్వాసన రావడంపై సీరియస్ అయ్యారు. బాధ్యతారాహిత్యంగా ఉన్న హెడ్ నర్సుకు చార్జ్ మెమో ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.



జీజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా


ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో విద్యార్థినులు

జోనల్ క్రీడల్లో గురుకులం విద్యార్థినుల సత్తా

- ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం
- వాలీబాల్ సీనియర్, జూనియర్ విభాగాల్లో విజయం

సింగరాయకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో సింగరాయకొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థినులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. సీనియర్, జూనియర్ వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వల్లాపు జిల్లా ఉప్పలపాడు గురుకుల పాఠశాలలో ఈనెల 14వ తేదీ నుంచి 17 వరకూ మూడో జోనల్ (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల) పోటీలు జరిగాయి. జూనియర్ త్రోబాల్‌లో కూడా సింగరాయకొండ గురుకులం విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. 1,500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 800 మీటర్లలో ప్రథమ, తృతీయ, 4,100 మీటర్లలో ప్రథమ స్థానాన్ని సాధించారు. డిస్కస్ త్రో, లాంగ్‌జంప్‌లో ద్వితీయ, జావలిన్ త్రోలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను మంగళవారం ప్రిన్సిపాల్ కె.రమాదేవి, పీడీ నూకసాని సుధామాధురి, పీఈటీ అరుణకుమారి ప్రత్యేకంగా అభినందించారు.


సాధించిన కప్‌లను చూపుతున్న విద్యార్థినులు

30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు జనవరి-2025కు సంబంధించి (లోయర్, హైయర్‌గ్రేడ్) డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 30వతేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధరుసుంతో వచ్చేనెల 10వతేదీ వరకు, 75శాతం రుసుంతో వచ్చేనెల 13వతేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలి. డ్రాయింగ్‌లోయర్‌గ్రేడ్‌కు రూ. 100, హైయర్ గ్రేడ్‌కు రూ.150, హ్యాండ్‌లూమ్ అండ్ వీవింగ్‌లోయర్ గ్రేడ్‌కు రూ.150, హైయర్ గ్రేడ్‌కు రూ.200, టైలరింగ్ (లోయర్ గ్రేడ్)కు రూ.150, హై యర్‌గ్రేడ్‌కు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉన్నారు. పరీక్షఫీజును డీఈవో ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైట్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు.

14 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం ఎస్ఐ బి.మహేంద్ర అదుపులోకి తీసుకున్నారు. బస్టాండ్ సమీపంలో సాదం కొండయ్య వద్ద 8, పాకలరోడ్డులో బలగాని జాలమ్మ వద్ద 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రైల్వే ఎగ్రోట్ట పడమర వైపు తీసిన కాలువ


రైల్వే ఎగ్రోట్ట తూర్పు వైపున అడ్డంకులు

పొలాలకు వెళ్లే దారేది?

- అండర్ బ్రిడ్జి పనులతో రైల్వే గేటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి
- ఆందోళనలో రైతులు
- పంటల సాగుపై అయోమయం

టంగుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని ఎర్రగేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో రైల్వే అధికారులు పెద్దపెద్ద గుంతలు, కాలువలు తీశారు. మట్టి దిబ్బలుపోశారు. గేటుకు ఇరువైపులా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అవతలివైపునకు వెళ్లే దారిమూసుకుపోయింది. దాదాపు 100 ఎకరాల పొలాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రైతులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జేసీపై ఆశలు వదిలేసుకున్నారు. రైల్వే అధికారులు ఇష్టానుసారం వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే మూడోలైన్ పనులు ప్రారంభమైనప్పటి నుంచి టంగుటూరు వాసులకు ఇక్కట్లు మొదలయ్యాయి. రైల్వే అధికారులు ఇష్టానుసారం వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పొలాలకు ఉన్న ఏకైక మార్గం ఇదే

ఎర్రగేటుకు తూర్పువైపున ఉన్న పొలాలకి వచ్చిపోయేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదే. మరోవైపు నుంచి వెళ్లేందుకు దారి లేదు. అయినా నేరీ రైల్వే అధికారులు ఇష్టానుసారంగా దారికి అడ్డంకులు సృష్టించారు. దీంతో ఇప్పుడు పొలానికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గేటు అవతల ఉన్న భూములు సారవంతమైనవి. పాతేరు నీటి ఆధారంగా వీటిలో పంటలు సాగు చేస్తుంటారు. ఏరులో ఎప్పుడూ సమృద్ధిగా నీరు ఉంటున్నందున ఇక్కడ పంటలకు కొదవలేదు. పంటకాలం అయిపోయిన తర్వాత ఈ పొలాల్లో గేదెలకు మేత పెంచుతుంటారు. ఏడాదంతా వ్యవసాయ కొనసాగుతూనే ఉంటుంది. రైల్వే అధికారుల తీరుతో ఎర్రగేటుకు ఇరువైపులా రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

షెడ్ వేసేద్దాం..

(5వ పేజీ తరువాయి)

ఉపాధి సిబ్బంది పర్యవేక్షణలో వాటిని నిర్మిస్తారు. జిల్లాలో పాడిపరిశ్రమ అధికంగా ఉన్న నేపథ్యంలో పలు ప్రాంతాల పశుపోషకులు ఈ పథకం వైపు మొగ్గుచూపి తమ వాటా నిధులు చెల్లించి దరఖాస్తు చేశారు.

షెడ్లకు నిర్మాణానికి ఆసక్తి

జిల్లాకు 1,075 యూనిట్లు మంజూరు కాగా దాదాపు 231 శాతంతో 2,486 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో అత్యధికంగా దర్శి నియోజకవర్గం నుంచి ఏకంగా 383 శాతం వచ్చాయి. ఆ నియోజకవర్గానికి 125 యూనిట్లు కేటాయించగా 483 దరఖాస్తులు అందాయి. అలాగే వైపాలెం నియోజకవర్గంలో కేటాయించిన యూనిట్లతో పోల్చితే 281శాతం దరఖాస్తులు రాగా సంతనూతలపాడు నియోజకవర్గంలో 257 శాతం, కొండపి నియోజకవర్గంలో 255 శాతం మేర వచ్చాయి. ఇతర నియోజకవర్గాల్లో 200 శాతం లోపుగానే ఉన్నాయి.

నిర్మాణాలు ప్రారంభం

భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ లబ్ధిదారులను ఎంపిక చేసేపనిలో నిమగ్నమయ్యారు. అందులో సొంత స్థలాలలో నిర్మాణాలు చేసుకునే అవకాశం ఉన్న వారికి ముందుగా అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పశువుల పాకల నిర్మాణాలు ప్రారంభమై ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన వారికి వచ్చే ఏడాది కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

పశువుల పాకలకు అందిన దరఖాస్తుల వివరాలు

నియోజకవర్గం	కేటాయించిన యూనిట్లు	అందిన దరఖాస్తులు
గిద్దలూరు	150	181
మార్కాపురం	100	194
ఒంగోలు	100	187
కనిగిరి	150	308
కొండపి	200	512
సంతనూతలపాడు	125	331
వైపాలెం	125	364
దర్శి	125	483

ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసలు

- అసెంబ్లీ వేదికగా అభినందనల వెల్లువ
- సోషల్ మీడియాలో లోకేశ్, మంత్రుల శుభాకాంక్షలు

పర్చూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం అసెంబ్లీ వేదికగా జనసేన పార్టీ ఎమ్మెల్యే కొణతాల రామ కృష్ణ ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో అసెంబ్లీలోని సభ్యులంతా కరతాళధ్వనులతో ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసల జల్లు కురిపించారు. శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేలందరూ ఏలూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అటువంటి అవార్డును అందుకొని సభ గౌరవాన్ని పెంచారన్నారు. ఏలూరికి శాసన సభా వేదిక ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, వంగల పూడి అనిత, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియాలో మంత్రి నారా లోకేశ్ ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు నేతేన నరేంద్ర వర్మ, ఎంఎం కొండయ్య, అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావు, బీఎన్ విజయ్ కుమార్, కందుల ఏలూరికి అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి త్రైక్వాండోకు రాజుబంగారుపాలెం విద్యార్థి ఎంపిక

దిగమర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆట్ల సందీపిక జాతీయ స్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపికైంది. కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగిన 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ త్రైక్వాండో పోటీలలో 41 కేజీల విభాగంలో సత్తాచాటి సందీపిక గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. ఖాలీషావలి తెలిపారు. రాష్ట్ర స్థాయి త్రైక్వాండో పోటీలలో ప్రతిభ చూపడంతో సందీపికను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. హర్యానా రాష్ట్రంలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి త్రైక్వాండో పోటీలలో సందీపిక పాల్గొననున్నట్లు తెలిపారు. సందీపిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందీపికను హెచ్ఎం ఖాలీషావలి, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, ఎస్.అంకయ్య, బి.శ్రీనివాసరావు, పి.శ్రీలక్ష్మి, జి.నాగమణి, త్రైక్వాండో కోచ్‌లు వాటుపల్లి సుబ్రహ్మణ్యం, షేక్ సుల్తాన్‌బాషా, విద్యార్థులు అభినందించారు.

పశుగణన పరిశీలన

కొండపి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బేబీరాణి మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అనకర్లపూడిలో లంపీ వైరస్ బారిన పడిన ఎద్దుకు బూస్టర్ డోస్ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. పశుగణన చేస్తున్న ఎన్యూమరేటర్‌లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వివిధ గ్రామాల్లో రైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్లను చూశారు. ఆమె వెంట పశుసంవర్ధక శాఖ కొండపి ఏడీ రవికుమార్, కె.ఉప్పలపాడు పశువైద్యుడు పేరయ్య, వెటర్నరీ సిబ్బంది ఉన్నారు.

గుండ్లకమ్మను సందర్శించిన నూకసాని

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టును మంగళవారం పర్యాటకశాఖ అభివృద్ధి ఛైర్మన్ నూకసాని బాలాజీ పర్యటించారు. ప్రాజెక్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. 80వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గుండ్లకమ్మ ప్రాజెక్టును పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టుకు మరమ్మతులను పూర్తిస్థాయిలో చేపడతామని చెప్పారు. అన్నంగి కొండలు కిరణ్ వేస్తామన్నారు. కార్యక్రమంలో ఏలూ రామాంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చీరాల సమస్యలపై అసెంబ్లీలో చర్చ

గళం వినిపించిన ఎమ్మెల్యే కొండయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలలో రెండింటిపై మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రస్తావించారు. ప్రధానంగా చేనేతల సమస్యల పరిష్కారంలో భాగంగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చామని, అది ఎప్పటి నుంచి ప్రారంభించింది లామో తెలపాలన్నారు. అత్యధికంగా నేతన్నలు ఉన్న ప్రాంతంలో చీరాల ఒకటన్నారు. ఈ ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని చీరాల నియోజకవర్గంలోనే అధికారికంగా జరిపిన విషయాన్ని మననం చేశారు. వైసీపీ పాలనలో నేతన్న నేస్తం పేరుతో కార్మికులను మోసం చేసిందన్నారు. 2014 నుంచి 2019 మధ్య ఏపీ పథకాలు అమలయ్యాయి. వాటిని పునరుద్ధరించాలని నేతన్నలు కోరుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయపరంగా నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకా లు ఉన్నాయి. అవి సక్రమంగా లేవు. వాటికి మరమ్మతులు అవసరం. యుద్ధప్రాతిపదికన ఆ చర్యలు చేపట్టేందుకు సహకరించాలి. ఏపీఎస్ ఐడీసీకి సంబంధించి రెండు జిల్లాల పరిధిలో కేవలం ఒక డీఈ, ఏఈ మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత ఉంది. ఈ క్రమంలో పని భారంతో డీఈ ఎప్పుడు ఫోన్ చేసినా ఆరోగ్యం సరిలేదని చెప్తున్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలకు సంబంధిత మంత్రి సహకరించాలని సభ ద్వారా ఎమ్మె ల్యే కొండయ్య కోరారు.

టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డికి సన్మానం


నర్సిరెడ్డిని సన్మానిస్తున్న ఏలూరి కార్యాలయ ప్రతినిధులు

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని మంగళవారం సన్మానించారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి ఆయన వచ్చారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరి సాంబశివరావు గెలుపునకు పర్చూరు నియోజకవర్గంలో నర్సిరెడ్డి ప్రచారం చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గ పార్టీ నాయకులతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. టీటీడీ బోర్డుమెంబర్‌గా నియమించిన తర్వాత ఆయన క్యాంపు కార్యాలయానికి రావడంతో కార్యాలయ ప్రతినిధులు నర్సిరెడ్డిని శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వెంకట్, అఖిల్ పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ ఇంట్లో చోరీ

దేవాంగపురి (చీరాలరూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ కార్యాలయం సమీపానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ వృద్ధ్యి నటరాజ్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. పది రోజుల కిందట హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. మంగళవారం చోరీ జరిగినట్లు పనిమనిషి ద్వారా తెలుసుకున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో యూనియన్ అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో టీవీ సుబ్బారావు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో మూడు నెలలుగా కార్మికులకు చెల్లించాల్సిన నైట్ అవుట్ అలవెన్సులు, డేఅవుట్ అలవెన్సులు చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అధికారులకు అలవెన్సులు చెల్లిస్తున్నా కార్మికులకు చెల్లించడం లేదన్నారు. మాదేశ్వరా పెండింగ్‌లో ఉన్న ఎస్‌క్రాప్మెంట్ విదుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎస్‌జె టీజీజాన్, ఎస్‌హెచ్ అంజయ్య, బీఎస్‌హెచ్ శేఖర్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గోవాడ, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, మోదేపల్లి, మణికేశ్వరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వరి పండించిన రైతులు ప్రభుత్వం మద్దతు ధరకు ఇ-ముక్రానలని తెలిపారు. గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2320, 75 కేజీల బస్తా రూ.1740 ధరగా పేర్కొన్నారు. గ్రేడ్ బీ రకం క్వింటా రూ.2300, 75 కేజీల బస్తా రూ.1725కి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గోనె సంచులు ప్రభుత్వం ఉచితంగా అందించడంతో పాటు రవాణ చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. తేమ శాతం 17లోపు ఉండాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలని, వరికి ఎకరాకు రూ.126, మొక్కజొన్నకు రూ.105, శనగకు రూ.84 చెల్లించాలని తెలిపారు. వరి పంటలో సుడిదోమ నివారణకు డినోటెఫ్యూరాన్ 20శాతం ఎస్‌జీ (టోకెన్) 75 గ్రాములు పిచికారీ చేయాలని, లేదా ట్రైఫ్లుమెజోపైరం 10శాతం ఎస్‌సీ (పెక్జాలాన్) 84 ఎంఎల్‌లో నీటిని కలిపి పిచికారీ చేయాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సాయిబాబు, పత్తా సాంబశివరావు, ఏడుకొండలు, దూళిపాళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.


వరిని పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు పంట సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. తూర్పు కొప్పెరపాడు, కొప్పెరపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తక్కెళ్లపాడు గ్రామంలో సాగులో ఉన్న మిరప పంటను పరిశీలించారు. మిరపలో నల్లి ప్రభావం ఉందని దాని నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పిచ్చిరెడ్డి, శింగయ్య, ఎనికపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విస్తారంగా పొగాకు సాగు

(5వ పేజీ తరువాయి)

సుమారు 57,768 హెక్టార్లలో సాగుకు, 89.98 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే రైతులు దాదాపు 72 వేల హెక్టార్లకుపైనే విస్తీర్ణంలో సాగుచేసి సుమారు 150 మిలియన్ కిలోల పంటను ఉత్పత్తి చేశారు. అలా భారీగా సాగు, ఉత్పత్తి పెరిగినా అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలించి ధరలు బాగానే లభించాయి. ఆ ప్రభావం ప్రస్తుత సీజన్‌లో తీవ్రంగా కనిపిస్తోంది. విస్తారంగా పంట సాగుకు రైతులు ఉపక్రమించారు. రైతుల కోరిక మేరకు ఈ ఏడాది (2024-25) పొగాకు బోర్డు కూడా కొంతమేర అదనంగా సాగుకు, పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. దక్షిణాదిలో ప్రస్తుత ఏడాదికి సుమారు 67వేల హెక్టార్లలో పంట సాగుకు, 105 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా భారీగా పెరిగే పరిస్థితి కనిపిస్తోంది.

అనుకూలంగా వాతావరణం

పశ్చిమ ప్రాంతంలోని తేలిక నేలల్లో సెప్టెంబరులోనే పొగాకు నాట్లు చేపట్టగా నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం వేస్తున్నారు. గత ఏడాది భారీగా ధరలు లభించి రాబడి ఉండటంతోపాటు ఈ ఏడాది పొగాకు సాగుకు వాతావరణం బాగా అనుకూలించింది. దీంతో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం చూస్తే పొదిలి వేలం కేంద్రం పరిధిలో 8వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సాగు చేయగా, ఒంగోలు-1 పరిధిలో 4,600, వెల్లంపల్లి కేంద్రం పరిధిలో 4 వేలు, కొండపి కేంద్రం పరిధిలో నాలుగున్నర వేలు, టంగుటూరు వేలం కేంద్రం పరిధిలో 23వేలు, ఒంగోలు-2 కేంద్రం పరిధిలో 1,500 హెక్టార్లలో నాట్లు వేశారు. నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి తదితర కేంద్రాలలో మరో 16వేల హెక్టార్లలో సాగు చేశారు. ఇంకా నెలన్నర నుంచి రెండు నెలల పాటు పొగాకు సాగుకు సమయం ఉంది.

రెండింతలైన ఖర్చులు

నల్లరేగడి ప్రాంతంలో ఇప్పుడిప్పుడే నాట్లు ప్రారంభమయ్యాయి. ఆ రకంగా చూస్తే మరో 40వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో నాట్లు పడే అవకాశం కనిపిస్తోంది. భారీగా సాగు పెరగడంతో ఇదిలాఉండగా సాగు ఆరంభం నుంచే రైతులపై భారం పడుతోంది. గతంలో ఎకరాకు మూటన్నర నారు అవసరం కాగా మూట రూ.1500 నుంచి రూ.2వేలు ధర ఉండేది. ఈ ఏడాది అది రూ.4వేలకు చేరింది. నాణ్యత సరిలేక రెండు మూటలు వేయాల్సి వస్తోంది. అలాగే నాట్లు కూలీ కూడా గతంలో మనిషికి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.500కు చేరింది. ఇక ప్రస్తుతం కర్షకులతో ధరలు తగ్గి గుదరగోలగా ఉంది. అయినా ఇక్కడి రైతులు అనుభవజ్ఞులు, బోర్డు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్షకులు పంట సాగు చేస్తుండటం పట్ల పొగాకు రంగ పంట సాగు నియంత్రించుకోవాలని సూచిస్తున్నారు.

ఒంటెత్తు పోకడలు.. ఆపై వేధింపులు

(5వ పేజీ తరువాయి)

రాజీనామాను కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీలో క్రియాశీలంగా పనిచేసిన పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఎర్రగొండపాలెం మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిలను ఇంకా కొనసాగిస్తున్నారని పిర్యాదు చేశారు. పచ్చి వైసీపీ అభిమానులైన అధికారులను ఇంకా కొనసాగిస్తే ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా ప్రజల్లోకి వెళ్లవన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చెప్పినా ఇన్‌ఛార్జి పెడచెవిన పెడుతున్నారని, దశాబ్దాలపాటు పార్టీ జెండా మోసిన వారిని పక్కన బెడుతున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేసి దాడులను ఉసిగొలుపుతున్నారని తెలిపారు. రాష్ట్ర నాయకులను కలిసిన వారిలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ చేకూరి ఆంజనేయులు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు షేక్ జిలానీ, వద్దమాని లింగయ్య, అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు ఉన్నారు.

గతం ఇలా..

ముండ్లమూరు మండలం లోని మారుమూల గ్రామం బొప్పూడివారి పాలెం. 25 ఏళ్ల క్రితం వరకూ ముఠా కొట్లాటలతో దద్దరిల్లింది. రెండు దశాబ్దాల క్రితం వరకు నిత్యం బాంబుల మోతతో మారుమోగింది. జిల్లాలోనే ఫ్యాక్షన్ గ్రామంగా పోలీసు రికార్డుల్లోకెక్కింది. ఎన్నికలొస్తే ఆ ఊళ్లో బాంబులతో రెండు రాజకీయ గ్రూపులు గొడవలు పడి రక్తం కళ్లజూశారు. మిద్దెలమీద, ఎరువు దిబ్బల్లోనూ బాంబుల బకెట్లు దాచి దారికాచి విసిరి బీభత్సం సృష్టించారు. ఒక ముఠాకు చెందిన కుటుంబాల్లో వేడుక ఉంటే రెండో ముఠా నుంచి ఎవరూ వెళ్లేవారు కాదు. అంతగా పగ ప్రతీకారాలతో రగిలిపోయేవారు.

ప్రస్తుతం ఇలా..

కక్షలు కరిగిపోయాయి. పగప్రతీకారాలు ఆగిపోయాయి. బాంబులు ఎలా ఉంటాయో కూడా ఈ తరానికి తెలీదు. ఫ్యాక్షన్‌ను వీడారు. ప్రశాంతతకు రూపమిచ్చారు. ఎవరి ఇంట్లో శుభకార్యం ఉన్నా ఊరంతా వెళ్లి వేడుకలో పాల్గొంటున్నారు. గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి ఐకమత్యంగా పూనుకుంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ప్రశాంత జీవనానికి అలవాటుపడ్డారు.

కారణం ఇలా..

సృష్టిలో మార్పు సహజం. ప్రతీదీ మారుతూ ఉంటుంది. ఆ మార్పు ఎటువైపు పయనిస్తుందో దాన్ని బట్టి వారి ఉనికి తేలుతుంది. ఈ గ్రామ మార్పు కూడా అలాంటిదే. వినాశనం నుంచి అభివృద్ధి, సామరస్యంవైపు మళ్లింది. ఘర్షణల వల్ల సర్వం కోల్పోయి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకోవడం వల్ల పిల్లల భవిష్యత్తు నాశమవుతుందని భావించారు. ఒక్కొక్కరూ కొట్లాటల నుంచి తప్పుకున్నారు. కొత్త తరం ఎదిగి వచ్చింది. ఈ తరాన్ని ఘర్షణలవైపు వెళ్లకుండా చిన్నతనం నుంచే చదువువైపు మళ్లించారు. అలా పూర్తిగా మారడానికి 25 ఏళ్లు పట్టింది. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకున్నారు. రోడ్లు వేయించుకున్నారు. ఇంటికి ఇంత అని లెక్కగట్టుకుని నగదు పోగు చేసి, దాతల సహకారంతో మరికొంత మంది డబ్బు సేకరించి ఆలయాన్ని నిర్మించుకున్నారు. పాడిపశువులు, పచ్చని పంటలతో ఆనందంగా జీవిస్తున్నారు.

- ఒకప్పుడు కర్రలు, బాంబులతో దద్దరిల్లిన గ్రామం
- రాజకీయ ముఠాలుగా విడిపోయిన ఊరు
- బంధువులకు దూరమై.. ఆర్థికంగా నష్టపోయిన నేల
- క్రమంగా అన్నీ వదిలేసి పిల్లల చదువులపై దృష్టి
- పాడి పంటలు, ప్రశాంతత, అభివృద్ధిపై కేంద్రీకరణ
- ఐకమత్యంతో గుడి నిర్మాణం, ఆలయాలు ఆధునికీకరణ
- నేడు ఏ ఇంట్లో శుభకార్యమైనా ఊరంతా వేడుకలోనే..

'పగ'లు వదిలి.. ప్రగతివైపు కదిలి..

25 ఏళ్ల క్రితం వరకూ ఫ్యాక్షన్‌తో రగిలిపోయిన బొప్పూడివారిపాలెం

ప్రతి ఇంటిలో చదువుకున్న బిడ్డలు

ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించారు. సాఫ్ట్‌వేర్‌తోపాటు ఇతర రంగాల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారు. అప్పటి మార్టూరు శాసన సభ్యులు గొట్టిపాటి నరసయ్య, అద్దంకి ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సహకారంతో సిమెంట్ రోడ్లు నిర్మించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రైతులందరూ వివిధ రకాల పంటలు పండిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

ముండ్లమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బొప్పూడివారిపాలెం గతంలో ఈదర పంచాయతీ పరిధిలో ఉండేది. 1983లో ఈదర నుంచి విడిపోయి ప్రత్యేక పంచాయతీగా ఆవిర్భవించింది. గ్రామంలో మొత్తం 356 గడపలున్నాయి. 850 మంది ఓటర్లున్నారు. 1530 మంది జనాభా ఉన్నారు. 1983 నుంచి 2000 వరకు ఆ గ్రామం ఫ్యాక్షన్‌తోనే ఉండిపోయింది. నిత్యం గొడవలు జరుగుతుండేవి. పదుల సంఖ్యలో కోర్టులు పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరిగేవారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి వయోభారంతో చనిపోతే ఆయనకు ఇద్దరు కుమారులుంటే చెరొకరు వేర్వేరు పార్టీలో ఉండేవారు. కర్మకాండలు సైతం తండ్రికి చెరొకరోజు చేసేవారు. 1983 నుంచి 1988 వరకు సర్పంచ్‌గా ఆళ్ల రామయ్య, 1995 నుంచి 2006 వరకు భీమనేని నాసరయ్య, 2006 నుంచి ముంగమూరి రామాంజమ్మ, 2013 తోటచిన కోటేశ్వరమ్మ, వల్లభనేని వరలక్ష్మి, 2021లో యింజం అంజమ్మ పని చేశారు. ప్రస్తుతం గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా అందరూ కలసిమెలసి పాల్గొంటున్నారు. అందరూ చందాలు వేసుకుని పోలేరమ్మ గుడి కట్టించారు. మరో రెండు ఆలయాలు ఆధునికీకరించారు. ఐక్యంగా ఊరూరా తిరిగి దాతల నుంచి నిధులు సేకరించారు. క్రమంగా గ్రామంపై ఉన్న ఫ్యాక్షన్ ముద్రను చెరిపేశారు.



ఫ్యాక్షన్‌తో వణికి పోయాం



1983 నుంచి 2004 వరకు మా ఊరు కొట్లాటకు మారుపేరుగా ఉండేది. రెండు రాజకీయ ముఠాలుగా విడిపోయి ఉండేది. కొంత మంది వాటిని తట్టుకోలేక గ్రామం విడిచి పట్టణాలకు వెళ్లారు. కాలానికి అనుగుణంగా ఊరు పూర్తిగా మారింది. నేడు ప్రశాంతంగా ఉంది. మా గ్రామంపై ఉన్న కొట్లాట ముద్ర తొలగిపోయింది.

- లాం రామనాథం, గ్రామస్థుడు

కంటి మీద నిద్ర లేకుండా పోయేది



రెండు దశాబ్దాల పాటు గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలు ఉండేవి. శుభకార్యాలు, పండుగలు వచ్చినా ఒకరింటివైపు మరొకరు కన్నెత్తి కూడా చూసేవారు కాదు. రాత్రుళ్లు కర్రలతో కాలపాలు కాసేవారు. అవి గుర్తుకొస్తేనే భయంతో వణికిపోతాం. అప్పట్లో చుట్టుపక్కల ఊళ్లల్లోవారు మీది తన్నుకునే ఊరు అని ఎగతాళి చేసేవారు.

- బొప్పూడి చంద్రమ్మ, గ్రామస్థురాలు

గొడవలతో చాలా నష్టపోయాం



గొడవలు వల్ల ఆర్థికంగా నష్టపోవటమే గాక బంధువులనూ, కుటుంబ సభ్యులనూ, దాయాదులనూ దూరం చేసుకున్నాం. పోలీసుస్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరిగి వేసారిపోయాం. ఎన్నికలు వస్తే చాలు మమ్మల్ని ముందుగానే పోలీసులు తీసుకెళ్లి బైండోవర్ కేసులు పెట్టేవారు. అవన్నీ వదిలేశాం. పాతికేళ్లుగా గ్రామం ప్రశాంతంగా ఉంది.

- భీమనేని నాసరయ్య, మాజీ సర్పంచ్

చాలా సంతోషంగా ఉంది



మా ఊరు.. ఫ్యాక్షన్ గ్రామంగా జిల్లా వ్యాప్తంగా ముద్ర పడింది. నిత్యం గొడవలు పడి మా గ్రామంలో కుటుంబాలు నెలల తరబడి జైలు పాలైన వారు ఉన్నారు. మా పెద్దవాళ్లు అన్నీ వదిలేశారు. మా చదువుపై దృష్టి పెట్టారు. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒకరిద్దరు చొప్పున సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉండటం చాలా సంతోషంగా ఉంది.

- తేలప్రోలు శివ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఆలయాల నిర్మాణంలో ఐక్యంగా..



ఇప్పుడు మా ఊరి పెద్దలంతా కలిసి ఒకమాట మీద ఉన్నారు. ఇటీవల ఐక్యంగా పోలేరమ్మ గుడి కట్టించారు. ఊరి పొలిమేరలో ఉన్న ఆంజేయస్వామి గుడి, ఊరి మధ్యలో ఉన్న రాములవారి ఆలయాన్ని ఆధునికీకరించారు. మా పెద్దవాళ్లతోపాటు, యువతరంలోనూ గ్రామాన్ని అభివృద్ధి చేసే ఆలోచన తప్ప మరొకటి లేదు.

- తేలప్రోలు ఆంజనేయులు, యువ రైతు



ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మరుగుదొడ్లను ఉపయోగించాలి

కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించడంతోపాటు వాటిని శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల మరమ్మత్తులు, రిస్టోర్‌లపై దృష్టిసారించడంతో పాటు మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా పాఠశాలలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మరుగుదొడ్ల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. వాటిలో ఏమైనా మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంటే వెంటనే నివేదికను అందజేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. గ్రామస్థాయిలో వాటి వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మరుగుదొడ్ల లీకేజీలను అరికట్టడంతో పాటు కొత్త మరుగుదొడ్ల మంజూరుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాల శంకరరావు మాట్లాడుతూ 'మా టాయిలెట్ మా గౌరవం' అనే నినాదంతో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరల్డ్ టాయిలెట్-24 ప్రచారాన్ని ప్రారంభించడం, పారిశుధ్య కార్మికులకు సన్మానం చేయడం, లబ్ధిదారులకు ఐహెచ్‌హెచ్‌ఎల్ మంజూరు లేఖలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు.

అనంతరం హరిత అంబాసిడర్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ సీఈవో చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీఈవో కిరణ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డ్రోన్ ద్వారా జాతీయ రహదారిపై పరిశీలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్లో) డ్రోన్

నేరపరిశోధనలో డ్రోన్ కెమెరాలు

● మహిళా కానిస్టేబుళ్లకు శిక్షణ ● డ్రోన్లు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం ● జిల్లాలో డ్రోన్ డ్రివెన్ పోలీసింగ్ : ఎస్పీ

ఒంగోలు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. డ్రోన్ డ్రివెన్ పోలీసింగ్ జిల్లాలో ప్రవేశ పెట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే 300 మంది పోలీసులకు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ ఇచ్చారు. మంగళవారం మహిళా కానిస్టేబుళ్లకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డ్రోన్ కెమెరాల వినియోగం ద్వారా పోలీసుశాఖలో మెరుగైన సేవలు అందిచనున్నారు. నేరపరిశోధనతో పాటుగా నేరాల నియంత్రణ చేసే అవకాశం ఉంది. శాంతి భద్రతలు పరిరక్షణకు డ్రోన్లు వినియోగించనున్నారు. వివిధ బందోబస్తులు, జాతరలు, ఊరేగింపుల సమయంలో డ్రోన్‌ల ద్వారా పరిశీలించి అవాంఛనీయ సంఘటనలు నిలవరించేందుకు వినియోగించనున్నారు. జాతీయ రహదారులపై బైక్ రేస్‌లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఈవ్‌టీజింగ్, అసాంఘిక కార్యక్రమాలను డ్రోన్‌ల ద్వారా పసిగట్టి నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డ్రోన్‌లను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడం వల్ల అక్కడ నుంచే అధికారులు పర్యవేక్షించే అవకాశం ఉంది.

డ్రోన్‌ల ద్వారా నిఘా

డ్రోన్‌లు వినియోగం ద్వారా రాత్రీ పగలు నిఘా ఉంచేందుకు వీలుంటుంది. డ్రోన్‌లు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి అక్కడ నుంచి పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే 300 మందికి డ్రోన్లు ఆపరేట్ చేయడంలో శిక్షణ ఇచ్చాం. మంగళవారం ఒంగోలు తాలుకా పోలసులు కొప్పోలు హైవేపై డ్రోన్‌లు ద్వారా బైక్ రేస్‌లను నియంత్రించారు. ఒక బైక్ రేసర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా సిబ్బంది కొరతను అధిగమించొచ్చు.

- ఏఆర్ దామోదర్, ఎస్పీ

కార్పొరేషన్ సభ్యులుగా

జిల్లా నుంచి ముగ్గురికి స్థానం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాలైన గౌడ, గిరిజన కార్పొరేషన్‌లలో జిల్లాకు చెందిన ముగ్గురిని సభ్యులుగా నియమిస్తూ టీడీపీ అధిష్టానం మంగళవారం ప్రకటించింది. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర సభ్యులుగా ఒంగోలుకు చెందిన జంపని రామచంద్రగౌడ్‌ను నియమించగా, గిరిజన కార్పొరేషన్ కో ఆపరేటివ్ సభ్యులుగా యర్రగొండపాలేనికి చెందిన చెవుల అంజయ్య, కే.శవ్యా నాయక్‌లను నియమించింది. ఈ మేరకు పలువురు పార్టీ శ్రేణులు రామచంద్ర, గౌడ్, అంజయ్యలను అభినందించారు.

సింగరాయకొండలో చోరీ

రూ.లక్ష నగదు, 12 గ్రాముల బంగారం అపహరణ

సింగరాయకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధి మల్లెతోటలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.1.50లక్షల విలువైన సొత్తును దొంగలు అపహరించుకొని వెళ్లారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్లెతోట 4వలైన్‌లో నివాసం ఉంటున్న షేక్ రఫీ జంగారెడ్డి గూడెంలో జ్యూస్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడే పొగాకు బ్యారన్‌లకు గొట్టాలను బిగించే పనులను చేయిస్తున్నారు. రఫీ భార్య సోమవారం జంగారెడ్డిగూడెం వెళ్లారు. రాత్రి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.లక్ష నగదు, 12 గ్రాముల బంగారాన్ని తీసుకొని వెళ్లిపోయారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని మంగళవారం ఉదయం గుర్తించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్సై బి.మహేంద్ర చోరీ జరిగిన గృహం వద్దకు చేరుకొని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను రంగంలోకి దింపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మల్లెతోట 5వ లైన్‌లో కూడా తాళం వేసిన ఒక ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. అక్కడ నగదు, విలువైన వస్తువులు లేకపోవడంతో వెళ్లిపోయారు.



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం

నగరం.. నలుగురు మెచ్చేలా..

ఒంగోలు సుందరీకరణకు కార్పొరేషన్ చర్యలు



నగరాలను అందంగా తీర్చి దిద్దాలని, సుందరీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్న కూటమి ప్రభుత్వం ఆదేశాలతో ఒంగోలు నగరం ముస్తాబవుతోంది. జనరల్ ఫండ్ నుంచి సుమారు రూ.కోటి వ్యయంతో నగరంలో సెంటర్ డివైడర్‌లకు రంగులు అద్ది, అందమైన పువ్వులు, ముగ్గులతో ముస్తాబవుతోంది. డివైడర్‌ల మధ్య పూల మొక్కలు నాటించడంతోపాటు మొక్కలు పశువులు తినివేయకుండా ఉండేందుకు స్టీల్ రెయిలింగ్‌లను ఏర్పాటు పనులు వేవగంతమయ్యాయి. ఇప్పటికే పారిశుధ్యం మెరుగులో భాగంగా కాలువల్లో పూడిక తీత, పిచ్చిమొక్కలు, రోడ్‌సైడ్ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు, మెయిన్ డ్రైయిన్‌లపై కాంక్రీట్ కట్టడాల కూల్చివేత చర్యలు చేపట్టిన కార్పొరేషన్ అధికారులు... నగర సుందరీకరణ కోసం డివైడర్లకు మరింత అందాలు తీసుకురావడం నగర ప్రజలను ఆకర్షిస్తోంది.

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)











తమ దుకాణాలు వదిలి రోడ్డుపై వ్యాపారం చేస్తున్న నిర్వాహకులు

మేం కదలం.. మెదలం..!

కొత్త కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం

ఆరుబయట అమ్మకాలతో అవస్థలు

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్..



మార్కెట్ గేటు వద్ద రోడ్డుపైనే అమ్మకాలు చేస్తున్న వ్యాపారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో రోడ్‌సైడ్ వ్యాపారుల తీరు మరీ ఇష్టారాజ్యమైంది. వ్యాపారులకు దుకాణాలు కేటాయించినా వారు ఆరుబయట అమ్మకాలు చేపట్టడంతో కొనుగోలుదారులకు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. గత వారం రోజులుగా కమిషనర్ వెంకటేశ్వరరావు మార్కెట్‌ను సందర్శించి రోడ్డు ఆక్రమించి అమ్మకాలు జరపకూడదని హెచ్చరించారు. అధికారులు వచ్చినపుడు తొలగించినట్లు ప్రవర్తించి, వారు వెళ్ళిపోయిన వెంటనే యథాస్థితికి చేరుకోవడంతో అధికారుల ఆదేశాలు వారి చెవికెక్కడం లేదు. మార్కింగ్ గీసి దానిని దాటి వస్తే చర్యలు తప్పవని రెండు రోజుల క్రితం కార్పొరేషన్ అధికారులు హెచ్చరించినా మేం కదలం..మెదలం అన్నట్లుగా వ్యవహరించడం పట్ల టౌన్‌ప్లానింగ్ అధికారుల ఉదాసీనతకు తావిస్తోంది. పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. కేటాయించిన దుకాణాల వదిలేసి, రోడ్డును ఆక్రమించడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. మెయిన్ రోడ్డు నుంచి మార్కెట్ లోపల వరకు రోడ్డును ఆక్రమించి కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు అమ్మకాలు చేయడంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. వాస్తవానికి ఎవరికి కేటాయించిన దుకాణాల్లో వారే అమ్ముకోవాలన్నది నిబంధన. అంతేగాకుండా తమ దుకాణంలో వచ్చే పచ్చి కూరగాయల వ్యర్థాలను రోడ్డుపై పడవేకుండా షాపుల ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని వాటిలోనే వేయాలి. కానీ అందుకు విరుద్ధంగా ఇక్కడ పరిస్థితి ఉంది. షాపుల్లో వ్యాపారాలు కనిపించవు. అందరూ రోడ్డును ఆక్రమించి విక్రయాలు చేయడంతో ఆవులు, మేకలు, ఇతర జీవాలు అక్కడే సంచరిస్తూ కొనుగోలుదారులపై తిరగబడిన సందర్భాలు ఉన్నాయి. కానీ వ్యాపారుల తీరు మారకపోవడం చూస్తుంటే జనం విస్తుపోవాల్సి వస్తోంది.

అధికారులు దృష్టి సారించాలి..

కూరగాయల కొనుగోలు, అమ్మకాలు ఆరుబయట చేయడం ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులపై కార్పొరేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. కనీసం కాలుపెట్టలేని పరిస్థితి నెలకొందనీ, అదే ఎవరి దుకాణాల్లో వారు అమ్మకాలు చేపడితే ఎవరికీ ఇబ్బందులు ఉండబోవని, అవసరమైన చోట కొనుగోలు చేసుకునే వీలుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకించి కూరగాలయ వ్యాపారుల తీరు కొనుగోలుదారులపై మరీ తిరుగుబాటుతనంగా ఉంటుందని, కొంటే సంతోషమే.. కొనకుంటే ఇక తిట్ల పురాణమే అందుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. అదే దుకాణాల్లో అయితే తమ ఇష్టమొచ్చిన చోట కొంటామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొక్కుబడి చర్యలు కాకుండా మార్కెట్ బయట అమ్మకాలు తొలగించాలని, కనీసం వాహనాలు నిలుపుకునే అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గుడివాడ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టూ వీలర్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై గుడివాడ శాసనసభ్యులు రాము అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల టూ వీలర్ మెకానిక్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మ మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్నేళ్ళుగా మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించడంతోపాటు, రాష్ట్రంలోని అందరు శాసనసభ్యులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని, కార్మికుల సంఘానికి అండగా నిలబడాలని కోరడం సంతోషంగా ఉందన్నారు. అంతేగాకుండా తాను కూడా ఒక మెకానిక్‌నే అని చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

క్విస్ ఫార్మసీ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు థింక్ హెల్త్-థింక్ ఫార్మసీ అనే నినాదంతో అవగాహన ర్యాలీని కళాశాల ప్రాంగణం నుంచి ప్రభుత్వ జనరల్ హాస్పటల్ వరకు నిర్వహించారు. వారిని కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి అభినందించారు. అనంతరం విద్యార్థులు జీజీహెచ్ ప్రాంగణంలో రోగులకు మందుల వినియోగం వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫార్మాకాలేజీ విభాగాధిపతి చంద్రకళ, విజిలెన్స్ విభాగాధిపతి ఝాన్సీ క్విస్ ఫార్మసీ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, విభాగాధిపతులు వైద్యులు రేవతి, జాలయ్య భార్గవి, కృపారాణి, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంటలను బీమా చేయించుకోవాలి : డీఏవో



వరిపంటను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

ఒంగోలు(రూరల్), నవంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు తప్పకుండా బీమా చేయించుకోవాలని, దీనివల్ల ప్రకృతి విపత్తుల్లో పరిహారం పొందవచ్చని డీఏవో ఎస్.శ్రీనివాసరావు కోరారు. ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వరి, శనగ, మినుప పంటలకు రైతులు తప్పక బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు. ఆకు ముడత పురుగు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసనాయక్, బి.రమేష్ బాబు, జి.కిషోర్‌బాబు, రామకృష్ణారెడ్డి, ఆది మూర్తి, రైతులు పాల్గొన్నారు

26న మహాధర్నా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహాధర్నాకు ప్రజాసంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు జరిగే మహాధర్నా కరపత్రాలను స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న మంచి పుస్తకంకార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రభుత్వాలు పాలన చేస్తున్నాయని ఆరోపించారు. మహాధర్నాకు ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, నాయకులు పేరయ్య, ఎం.జార్జి, దాసరి సుందరం, ఆవుల సుబ్రహ్మణ్యం, లింగా వెంకటేశ్వర్లు, మస్తాన్‌రావు, పిన్నిక శ్రీనివాస్, కరువది సుబ్బారావు, పేరం సత్యం, డాక్టర్ శ్రీనివాసులు, అప్పారావు, పరిటాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● ట్రాఫిక్ సీఐ వై.పాండురంగారావు

ఒంగోలు(క్రైం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ వై.పాండురంగారావు తెలిపారు. మంగళవారం ఒంగోలు నగరం మంగమూరురోడ్డు జంక్షన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా లైసెన్స్ లేని, పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని హితవు పలికారు. కొప్పోలురోడ్డులో జరిగిన ప్రమాదంలో ముగ్గురు పిల్లలు మృతి చెందిన విషయాన్ని ఉదహరించారు. అందువల్ల రహదారి నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనచోదన చేయాలని కోరారు. వాహనానికి సంబంధించిన రికార్డులు దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. ఆటోలు కూడ నంబర్లు లేకుండా నడుపుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ఆదిలక్ష్మి

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల సీపీఎం కార్యదర్శిగా ఉబ్బా ఆదిలక్ష్మిని ఎన్నుకున్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లిలో నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సభ్యులుగా యు.వెంకటేశ్వర్లు, డి.శ్రీను, వై.శ్రీనాథ్, కె.అనంతలక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని హనుమాన్‌సాయి కాంప్లెక్స్‌లో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. బాపట్ల పవన్‌కుమార్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్పలు, శివస్వాములు, భవాని స్వాములు పాల్గొని పూజలు చేశారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

● నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు అరుణ



సదస్సులో మాట్లాడుతున్న అరుణ, వేదికపై పలువురు అధికారులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలికలు చిన్నతనం నుంచే ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగాలని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సభలో అరుణ మాట్లాడుతూ మనకు ఎందరో ధీరవనితలు ఉన్నారని, వారి చరిత్రలను విద్యార్థినులు చదివి స్ఫూర్తి పొందాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయానికి రావటం అలవాటు చేసుకోవాలని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, బీసీ సంక్షేమశాఖ అధికారి ఎం.అంజల మాట్లాడుతూ చిన్నతనం నుంచి సెల్‌ఫోన్‌కు అలవాటు పడకూడదని, పుస్తక పఠనానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీ ప్రసంగిస్తూ పిల్లల భవిష్యత్తు రూపకల్పనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర పోషించాలని పేర్కొన్నారు. మైనారిటీ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు సాగాలని కోరారు. డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ మాట్లాడుతూ బుధవారం ఉదయం జరిగే వారోత్సవాల ముగింపు సభలో పలు పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం జరిగిన మహిళా కవిసమ్మేళనంలో మానేపల్లి సూర్యకుమారి, సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ, సునీత, పుణ్యకీర్తన, సంతోషిణి చదివిన కవితలు, నూకతోటి శరత్ ఆలపించిన గీతం అలరించాయి. ఈ సందర్భంగా అతిథులు, కవయిత్రులను ఘనంగా సత్కరించారు.

హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్స్ అందజేత



కాస్మోటిక్స్‌ను అందిస్తున్న డాక్టర్ హరిణి

సంతనూతలపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో బీసీ హాస్టల్ విద్యార్థులకు స్థానిక వైద్యశాల డాక్టర్ పమిడి హరిణి తన సొంతనిధులను వెచ్చించి కాస్మోటిక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సబ్బులు, పౌడర్, టూత్‌పేస్టు, కొబ్బరినూనె తదితర వస్తువులను ఒక కిట్‌రూపంలో విద్యార్థులకు అందించారు. ఇటీవల హాస్టల్‌లో విద్యార్థులకు వైద్యపరీక్షలను నిర్వహించినప్పుడు వారి ఇబ్బందులు గమనించి ఈమేరకు వాటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డెన్ రాము, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు సహకరించాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు



సైడుకాలువను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు కోరారు. వార్డుకో వారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేర్నమిట్ట, ఇందిరాకాలనీలో ఆయన పర్యటించి అక్కడ వీధుల్లో అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాలువలు, పిచ్చిమొక్కలు తొలగించకపోవడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ళలోని చెత్తను కార్పొరేషన్ చెత్త వాహనాల్లోనే వేయాలని చెప్పారు. ప్రతిరోజు సైడుకాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. సచివాలయ సెక్రటరీలు ప్రతిరోజు డివిజన్లలో పర్యటించి వీధిదీపాలు, పైపులైను లీకులు, మురుగునీరు, గుంతలు సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఆయిల్ స్ప్రేయింగ్, ఫాగింగ్ చేసి దోమలను నివారించాలన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి అందులో పిచ్చిమొక్కలు తొలగించేలా యజమానులకు తెలియజేయాలని, పట్టించుకోని వారికి నోటీసులు జారీ చేయాలని సచివాలయ సెక్రటరీలకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ అనీల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి, ఏఈ చంద్రశేఖర్, కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేస్ ఎన్‌సీసీ విద్యార్థుల ఈ-బైక్ ర్యాలీ

ఒంగోలు విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, మద్రాస్ ఇంజనీర్ గ్రూపు నిర్వహించిన ఈ-బైక్ ర్యాలీని మంగళవారం కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ సైనికుల త్యాగాలు, వారు చేసిన సేవలను ఎప్పటికి మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, ఏఎన్‌వో లెఫ్టినెంట్ డాక్టర్ పృథ్వీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూపు నిర్వహించిన ర్యాలీలో పేస్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం రెడ్‌క్రాస్, ఒంగోలు బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో ఒంగోలులోని కెనరా బ్యాంకు రీజియన్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్యాంకు సిబ్బంది, రూట్‌సెట్ విద్యార్థులు 57మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఏజీఎం శశిధర్ మాట్లాడుతూ రక్తదానం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. రక్తదానం ద్వారా మరో వ్యక్తి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రీనల్ మేనేజర్ ఆర్.రమేష్, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ఎ.రవి, బ్లడ్ బ్యాంకు సీనియర్ కో-ఆర్డినేటర్ నైనాల రామకృష్ణ, టెక్నీషియన్స్ సంతోష్, సింధూర, వీరలంకయ్య, సీనియర్ కో ఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ సుబ్బారావు



చీమకుర్తిలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు



కొండపిలో మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

చీమకుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల పట్ల బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని చీమకుర్తి సీఐ సుబ్బారావు కోరారు. లైంగిక వేధింపుల కేసులు, సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం సీఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి మండలంలోని పలు హైస్కూల్స్, గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. వారికి చట్టాలు, నేరాల పట్ల అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లకు, ఆకర్షణ ప్రభావాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. బాలికలకు రక్షణ కోసం పోలీసులు తమ సంపూర్ణ సహకారం అందిస్తారని చెప్పారు.

కొండపిలో..

కొండపి: విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ జి.సోమశేఖర్ సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, మానసిక హింసకు ఎవరైనా గురిచేస్తుంటే తప్పనిసరిగా తల్లిదండ్రులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై ప్రేమ్‌చంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నలూరు మండలంలో..

మండలంలోని నాగిరెడ్డిపాలెం, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలికా సంరక్షణ చట్టాలపై ఎస్సై అనూక్ మంగళవారం అవగాహన కల్పించారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి వివరించారు. సైబర్ నేరాలు, సెల్‌ఫోన్‌లను ఎంతవరకు వినియోగించుకోవాలన్న విషయాలను వివరించారు.

సంతనూతలపాడులో..


సంతనూతలపాడు: స్థానిక జడ్పీహైస్కూల్లోని విద్యార్థులకు రూరల్ సీఐ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది పలు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సమాజంలో ధైర్యంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు వెంకటలక్ష్మి, వెంకట్రావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హెచ్ఎం ప్రమోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలి



సమావేశంలో పాల్గొన్నా నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఈవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలను చర్చించారు. డీఈవో కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్న కేవీ.సురేష్‌కు నిబంధనల ప్రకారం ఉద్యోగోన్నతి కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి విజయభాను, ప్రతినిధులు రామ్మోహన్‌రావు, రంగారెడ్డి, మోటా శ్రీనివాసులు, ఏసురత్నం, శ్రీనివాసులు, ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆటల పోటీలు

మద్దిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడులోని గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకురాలు రోహిణి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విజేతలకు బుధవారం బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉషారాణి పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గ్రంథాలయం ఆధ్వర్యంలో పలుపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రమోద, గ్రంథపాలకుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఈనెల 23వ తేదీన జరిగే సనాతన ధర్మమా-సామాజిక న్యాయమా అనే అంశంపై జరిగే సదస్సును విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. స్థానిక సీవీఎన్ రీడింగ్‌రూం ఆవరణలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పందిటి మోహన్, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, ఎస్‌కే.అజీజ్, కె.వెంకటేశ్వర్లు, వెలుగొండయ్య, కనమాల రాఘవులు, వెంకటస్వామి, మిడసల మల్లికార్జునరావు, యోబు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రుణాలు

టంగుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సొసైటీల ద్వారా తక్కువ వడ్డీకి అధిక మొత్తంలో రుణాలు ఇస్తున్నట్లు డివిజినల్ కోపరేటివ్ అధికారి రాజశేఖర్ తెలిపారు. టంగుటూరు పీఏసీఎస్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాలకొండయ్య, మేనేజర్ ప్రసాద్, పర్సన్ ఇన్‌చార్జి కుమార్, సీఈవో డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ఒంగోలు(క్రైం), నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, పాలపర్తి విజేష్ రాజ్, కైపు కృష్ణారెడ్డి, రసూల్, బొడ్డు సతీష్, దాసరి రవి పాల్గొన్నారు. అనంతరం కొప్పోలులో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన బాలుర కుటుంబాలను నాయకులు పరామర్శించారు.

మహిళా గ్రంథాలయంలో..

ఒంగోలు(కల్చరల్): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ధైర్య సాహసాలు బాలికలకు ఆదర్శనీయమని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పేర్కొన్నారు. ఒంగోలులోని మహిళా గ్రంథాలయంలో మంగళవారం ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రంథపాలకురాలు టి.గోవిందమ్మ విద్యార్థినులకు మ్యూజికల్ ఛైర్స్, ముగ్గుల పోటీలను నిర్వహించారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలపర్తి రాజేష్‌లు సంతనూతలపాడు బస్టాండ్ వద్ద నున్న ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ వద్ద నున్న పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్స్, పండ్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా షిరిడీ సాయిమందిర రజతోత్సవం


సింగరాయకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలోని షిరిడీ సాయి మందిర రజతోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. భగవన్నామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం దేవీ సీఫుడ్స్ సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మందిర్ ఛైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సీఐ

చీమకుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించి ఆటోలు నడిపితే చర్యలు తప్పవని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. చీమకుర్తిలో మంగళవారం ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

సంతనూతలపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీచేశారు. 15 ఆటోలకు జరివనాఆ విధించగా, ఒక టిప్పర్‌ను సీజ్ చేశారు.

నిస్సహాయులకు ఆర్థిక సహాయం



నగదును అందజేస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిస్సహాయులైన పేదలకు శివం ఫౌండేషన్ తరపున మంగళవారం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని ప్రముఖ పారిశ్రామిక వేత్త మండవ మురళీకృష్ణ చేతులమీదుగా అందజేశారు. స్థానిక సంతపేటలోని ఫౌండేషన్ ప్రాంగణంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి జన్మదినం సందర్భంగా పాశం హనుమాయమ్మ కంటి ఆపరేషన్‌కు, వరుణ్ జెస్సి, షేక్ శృతి, గొల్ల ప్రత్యూషలు పాఠశాల ఫీజులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, దన్నారపు మస్తాన్‌రావు, కొల్లా మధు, నూకతోటి శరత్‌బాబు, తన్నీరు సురేష్, ఒంగోలు మురళీకృష్ణ, చెన్నారెడ్డి రామయ్య చౌదరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం జరిగింది.

26న సెమీక్రిస్మస్ వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మదర్‌థెరిస్సా విగ్రహం ఎదుట ఈనెల 26వ తేదీన సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ యేసుదాసు తెలిపారు. స్థానిక దళిత హక్కుల పోరాట సమితి కార్యాలయంలో మంగళవారం పోస్టర్‌ను అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్, యేసుదాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి.ఇమ్మానుయేలు, పాస్టర్ బాబు, పేముల యోహాను, కె.నారాయణ, కనమాల జయకుమార్ పాల్గొన్నారు.



ముఖాముఖి

ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం

దొనపాటి వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ



ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ డీఈ దొనపాటి వెంకటేశ్వర రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయనతో నిర్వహించిన ముఖాముఖి.. ఆయన మాటల్లో...

ప్రశ్న : గ్రామాల అభివృద్ధి కోసం ప్రస్తుతం ఎలాంటి పనులు చేపట్టారు?

జవాబు : నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వాటితో గ్రామ స్వరూపం మారనుంది.

ప్ర : ఎన్ని పనులకు నిధులు మంజూరయ్యాయి ?

జ : సుమారు రూ.15 కోట్ల నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. ఎర్రగొండ పాలెం మండలంలో 31 వర్క్‌లకు గాను 3.7 కోట్లు నిధులు, దోర్నాల మండలంలో 21 వర్క్‌లకు గాను 2.25 కోట్లు, త్రిపురాంతకం మండలంలో 28 వర్క్‌లకు గాను 3 కోట్లు, పెద్దారవీడు మండలంలో 28 వర్క్‌లకు గాను 3 కోట్లు, పుల్లలచెరువు మండలంలో 28 వర్క్‌లకు గాను 3 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

ప్ర : ఎన్ని వర్క్‌లు మొదలు పెట్టారు, ఎప్పటికి పూర్తి చేస్తారు?

జ : నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం వర్క్‌లు 136. వాటిలో 31 పనులు ప్రారంభమయ్యాయి. 21 పనులు బుధవారం ప్రారంభం కానున్నాయి. మిగిలినవి ఈ నెల చివరికి మొదలు పెడతాం.

ప్ర : ఎప్పటికి పూర్తి చేస్తారు?

జ : 2025 జనవరి నాటికి పూర్తి చేయాలి. పనులు జరుగుతున్న సమయంలోనే ఎంబుక్‌లు సిద్ధం చేసి బిల్లులు పెట్టిన వెంటనే పడిపోతాయి.

విద్యార్థులకు పలు పోటీలు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి : ఎర్రగొండపాలెంలోని గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు ఝాన్సీ ఆధ్వర్యంలో 57వ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం విద్యార్థులకు డిబేట్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొనకనమిట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ప్రసన్నరంగలక్ష్మి, ఏఈవో రవికాంత్, వీపీఏలు భాష, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం



ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ ఆయేషా

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో రాజకీయ చైతన్యానికి నాంది పలికిన మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి వైద్యురాలు డాక్టర్ ఆయేషా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, వివిధ వర్గాల ప్రతినిధులు గంజి వీరయ్య, బి.ఎస్.నారాయణరెడ్డి, ముసలిరెడ్డి పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రంగస్వామి, నాయకులు షేక్ జమాల్, పిక్కిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కాపురంలో...

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 ఆంధ్రజ్యోతి : భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రహేనా భాను ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లి విజయలక్ష్మి, గోళ్ల వరలక్ష్మి, అపర్ణ, ప్రియాంక, లావణ్య, శివజ్యోతి, న్యాయవాది ఆకుల ఉషశ్రీ, గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడులో...

తర్లుపాడు, నవంబరు 19 ఆంధ్రజ్యోతి : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులు క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా కోటి మోహన్, గురువారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్యలు వ్యవహరించారు. విజేతలకు ఈనెల 21న వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు.

కంభం చెరువు ప్రాశస్త్యాన్ని కాపాడాలి

- మౌలిక వసతుల కల్పనకు కృషి
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు సబ్‌కలెక్టర్ సూచన



కంభం చెరువును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

కంభం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆసియాలోనే అతి పెద్ద చెరువుగా ప్రసిద్ధి చెందిన కంభం చెరువును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ చెప్పారు. మంగళవారం ఆయన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అధికారి బేనహర్, ఇరిగేషన్ డీఈ శ్రీనునాయక్, రెవెన్యూ అధికారులతో కలిసి కంభం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ కొండలతో ఆహ్లాదకరంగా 5వేల హెక్టాల విస్తీర్ణంలో ఉన్న కంభం చెరువు ఒక మహా సముద్రాన్ని తలపిస్తోందన్నారు. చెరువు అందాలను తిలకించేందుకు నిత్యం పర్యాటకులతో సందడిగా ఉండే ఈ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రాముఖ్యంగల చెరువు కట్టపై మౌలిక వసతులు కల్పించడంతోపాటు బోటు సౌకర్యం కల్పించాలని చెప్పారు. అలాగే శ్రీకృష్ణదేవరాయులు సతీమణి 500 ఏళ్ల క్రితం నిర్మించిన చెరువు చరిత్రను పర్యాటకులు తెలుసుకునేలా బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కంభం చెరువును చేర్చి నిధులు మంజూరుకు కృషి చేస్తానని సబ్‌కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఉద్యానవనశాఖాధికారి డి.శ్వేత పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య

పొదిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య చెప్పారు. స్థానిక సాయిబాలాజీ కల్యాణ మండపంలో ఆంజనేయులు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే కూటమి ఏర్పడిన తరువాత ప్రతిఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని నరేంద్రమోడీ చెప్పారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు సమరశీల పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 27 నుంచి 30వ తేదీవరకు విజయనగరంలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై సభలను జయప్రదం చేయాలని కోరారు. తొలుత పెద్దబస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కులాయిస్వామి, జిల్లా మాజీ కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మార్కాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే నాసరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 ఆంధ్రజ్యోతి : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తతతో ఉండాలని మార్కాపురం సీఐ సుబ్బారావు చెప్పారు. స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు-నివారణ మార్గాలు అనే అంశంపై మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత ఆధారంగా జరుగుతున్న వివిధ రకాల మోసాలు, నేరాలపై అప్రమత్తంగా ఉండి కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఐలు సైదుబాబు, డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు.

రాచర్లలో...

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలోని స్పందన పాఠశాలకు చెందిన విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, మహిళలపై జరుగుతున్న నేరాల గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ సీఐ జె.రామకోటయ్య మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని, వారి తల్లిదండ్రులపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారపేటలో...

బేస్తవారపేట, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్‌క్రైమ్ పట్ల, ప్రమాదాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎస్సై రవీంద్రారెడ్డి చెప్పారు. స్థానిక యశ్వంత్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు అవగాహన పొందితే వారి కుటుంబంలో ఎటువంటి సైబర్ క్రైమ్ అయినా జరగకుండా నివారించవచ్చన్నారు.

గిద్దలూరులో...

గిద్దలూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. పట్టణంలోని జీవనజ్యోతి కాలేజ్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేలా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఉద్యోగ మోసాలు, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్, బాల్య వివాహాలు, మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలిలో...

పొదిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ వెంకట్ చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఈవ్‌టీజింగ్‌పై సీఐ వెంకట్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ వేమన, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.

మిరపలో ఎండుకొమ్మ తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలి



మిట్టమీదిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

పుల్లలచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మిరపలో విస్తరిస్తున్న ఎండుకొమ్మ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో పి. నిర్మలాదేవి చెప్పారు. పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పుల్లలచెరువు, గంగవరం సాగులో ఉన్న మిరపను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు బ్రహ్మయ్య, క్రిష్ణనాయక్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి : మండలంలోని తమ్మడపల్లి, గుర్రపుశాల గ్రామలలో రైతులు సాగు చేసిన కంది, మినుము, మిరప పంటలను వ్యవసాయాధికారి కె. శేషారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి పి.ఆదిరెడ్డిలు పరిశీలించి రైతులతో మాట్లాడారు.

మార్కాపురం మండలంలో...

మార్కాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టమీదిపల్లి, కొండేపల్లి గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది హైమావతి, రమణి, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడులో...

తర్లుపాడు, నవంబరు 19 ఆంధ్రజ్యోతి : ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని తర్లుపాడు, మంగళకుంటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సంచాలకులు దేవేంద్ర గౌడ్, వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

పూసలపాడులో...

బేస్తవారపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూసలపాడు, ఒందుట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో జక్కం మెర్సీ ఉద్యానవన శాఖ అధికారి డి.శ్వేత, విస్తరణ అధికారి నారా గణేష్ పాల్గొన్నారు.

మోడంపల్లిలో...

గిద్దలూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని మోడంపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్‌రెడ్డి, ఉద్యావన శాఖాధికారిణి విష్ణుప్రియ, విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, సూక్ష్మ నీటి యాజమాన్య శాఖాధికారి మోహన్‌క్రిష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు కళ్యాణి, ప్రసన్న పాల్గొన్నారు.

బాల్యాన్ని మధురానుభూతిగా మిగుల్చుకోవాలి



బహుమతులు అందిస్తున్న డిప్యూటీ ఈవో శ్యామ్యూల్ జాన్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 ఆంధ్రజ్యోతి : బాల్యాన్ని ఒక మధురానుభూతిగా మిగుల్చుకోవాలని డిప్యూటీ ఈవో శ్యామ్యూల్‌జాన్ చెప్పారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి బంగారు బాలోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. వ్యాస రచనలో మార్కాపురం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన చంద్రిక ప్రథమ, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీనివాసులు ద్వితీయ, పెద్దారవీడు పాఠశాలకు చెందిన జోషిత తృతీయ స్థానం సాధించారు. వ్యాస రచనలో ఎస్‌కేవీ మోహన్ ప్రథమ, షేక్ సుల్తానా తురిమెళ్ల ద్వితీయ, కె.రామ్ చరణ్‌తేజ రాచర్ల తృతీయ బహుమతి అందుకున్నారు. చిత్రకళలో కె.జాన్ డేవిడ్ సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రథమ, బి.శృతి కేజీబీవీ పుల్లలచెరువు ద్వితీయ, జి.ప్రవీణ్ కుమార్ జెడ్పీహెచ్ఎస్ అమ్మవరం తృతీయ బహుమతి అందుకున్నారు. డ్రాయింగ్‌లో ఓబులమ్మ కంభం ప్రథమ, ఎ.సులోచన పొదిలి ద్వితీయ, ఎస్.పల్లవి యర్రగొండపాలెం తృతీయ బహుమతులు అందుకున్నారు. ఖోఖో పోటీలలో అంకిత రాచర్ల ప్రథమ, బి.నాగమణి, పుల్లలచెరువు ద్వితీయ, జె.మధురిమ మార్కాపురం తృతీయ బహుమతి గెలుపొందారు. నినాదాల పోటీలో ఆయేషా జెడ్పీహెచ్ఎస్ బాలికలు కనిగిరి ప్రథమ, ఎం.మమత జెడ్పీహెచ్ఎస్ బొమ్మలాపురం ద్వితీయ, నందిని జెడ్పీహెచ్ఎస్ ఉప్పలపాడు తృతీయ బహుమతి పొందారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రామ్‌దాస్ నాయక్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్యాంసుధాకర్, గౌతమ్ బాబు, మీర్ బాషా, వొద్దుల వీరారెడ్డి, రవిశేఖర్ రెడ్డి, మునీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌స్థాయి పోటీలో ఆల్ఫా విద్యార్థి ప్రతిభ

పొదిలి, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి): డివిజన్‌స్థాయి డ్రాయింగ్ బంగారుబాల్యం పోటీలలో పొదిలి ఆల్ఫా పాఠశాల విద్యార్థిని కల్లం సులోచన ద్వితీయ స్థానంలో నిలిచిందని ఎంఈవో శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ద్వితీయ స్థానం సాధించిన సులోచనకు జిల్లా విద్యాశాఖ అధికారి బహుమతి ప్రదానం చేశారన్నారు.

దారికి అడ్డంగా బైక్‌లు

రైల్వే ప్రయాణికులకు ఇక్కట్లు

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారానికి ఎదురుగా నిత్యం మోటార్‌సైకిళ్లను నిలుపుతున్నారు. రైల్వేస్టేషన్‌కు వచ్చిన వారు పార్కింగ్ స్థలంలో కాకుండా ప్రధానద్వారం ఎదురుగా మోటార్ సైకిళ్లను నిలుపుతున్నారు. స్టేషన్‌లోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ప్రయాణికులు నానాఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంది. హెచ్చరిక బోర్డులు పెట్టినా మోటార్ సైక్లిస్టులు పట్టించుకోకపోవడంతో మంగళవారం రైల్వేపోలీసులు అన్ని మోటార్ సైకిళ్లకు కలిపి ఒక చైన్‌బిగించి తాళాలు వేశారు. దాంతో మోటార్ సైక్లిస్టులు చైన్ తీయాలని పోలీసుల వద్దకు వెళ్లి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానగేటుకు ఎదురు వాహనాలు నిలిపివద్దని, జరిమానాలు విధిస్తామని, కేసులు పెడతామని హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేత



ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు

మార్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఉద్యోగభద్రత కల్పించాలని వారు కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏవో రవీంద్రారెడ్డికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ ఏ ప్రభుత్వ విద్యాసంస్థలోనూ ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేయడం లేదన్నారు. కేవలం గిరిజన సంక్షేమ గురుకులాల్లో మాత్రమే ఔట్‌సోర్సింగ్ విధానంలో కొనసాగిస్తున్నారని తెలిపారు. 2021, 22 సంవత్సరాల్లో కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో పనిచేసే వారిని కాంట్రాక్ట్ విధానంలోకి మార్చారన్నారు. తమను కూడా కాంట్రాక్ట్ రెసిడెన్సియల్ టీచర్స్‌గా మార్చుచేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీటర్‌పాల్, బ్రహ్మనాయక్, లక్ష్మి, భవాని, ఫాతిమాలు ఉన్నారు.

అవీఇవీ

నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సేవాసమితి ప్రతినిధులు

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలలో భాగంగా మంగళవారం శ్రీసత్యసాయి సేవాసమితి ప్రతినిధులు పట్టణంలోని సంజీవిని అనాథాశ్రమానికి నిత్యవసర వస్తువులు అందజేశారు. ప్రేమసుధా మందిరం ఆవరణలో సామూహిక వేదపఠనం, నామసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం జరిగిన పల్లకి సేవలో మహిళలు పాల్గొన్నారు. సామూహిక రుద్రపఠన కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సమితి ప్రతినిధులు వాడకట్టు రంగసత్యనారాయణ, క్రిష్ణమూర్తి, రాముడు, గోపాల్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అన్నం వడ్డించేటప్పుడు వచ్చిన వారిని గౌరవించాలని సిబ్బందికి సూచించారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

గిద్దలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీడే సందర్భంగా పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాపులవీడు పుణ్యక్షేత్రం వరకు సైకిల్ ర్యాలీగా వెళ్లి ఎన్‌సీసీ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.

మార్కండేశ్వరునికి అన్నాభిషేకం



చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అన్నాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 19 ఆంధ్రజ్యోతి : కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి, గంగాపార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలలో స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం ఆరుద్రనక్షత్రం సందర్భంగా మార్కండేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వేలూరి ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ శర్మలు స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రంగనాథ్‌శర్మ అన్నాభిషేకం నిర్వహించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం



మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

గిద్దలూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తి వద్ద నుంచి 11 క్వార్టర్ సీసాలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని దంతెరపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్నారని సమాచారం అందడంతో మంగళవారం ఎక్సైజ్ సీఐ ఎన్.జయరావు ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు.

సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా



పత్రాలను పరిశీలిస్తున్న ఆర్టీవో రవికుమార్, డీఎం సుందరరావు

పొదిలి, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సరైన పత్రాలు లేని వాహనాలను దర్శి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పొదిలి ఆర్టీసీ డీఎం సుందరరావులు సంయుక్తంగా మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సరైన పత్రాలు లేని 10 వాహనాలకు 70వేల రూపాయలు జరిమాన విధించారు.

ఘనంగా నాసరయ్య ఉరుసు మహోత్సవాలు ప్రారంభం



నాసరయ్య సమాధి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకంలోని నాసరయ్య పెద్ద మఠంలో ఉరుసు మహోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాలకు మండలంలోని భక్తులతోపాటు మాచర్ల, వెల్దుర్తి, మార్కాపురం, గుంటూరు, దర్శి ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు నాసరయ్య సమాధిని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. రాత్రికి పలు పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శివబసవరాజు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దర్శి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లపాలెం గ్రామానికి చెందిన గంధం యోహాన్(33) మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోటారుసైకిల్‌పై ఆయన దర్శి నుంచి బొట్లపాలెం వైపు వస్తున్నాడు. ఈక్రమంలో తూర్పువీరాయపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై ఎం. మురళీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతోన్మాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దర్శి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులు, మతోన్మాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కంకణాల ఆంజనేయులు సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లబ్ధిచేకూర్చుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. యువత ఉద్యోగావకాశాలు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేఖ విధానాలపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి టి.రంగారావు, ఎం.రమేష్, వి.ఆంజనేయులు, సీహెచ్ అంజయ్య, యు.నారాయణ, సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడాదుస్తులు అందజేత

ముండ్లమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినులకు మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. దాతలు చెక్కెర రవీంద్రారెడ్డి, బచ్చు కోటిరెడ్డి, బేతా వెంకటేశ్వర్లు, చెక్కెర వెంకటరెడ్డి వీటిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీ కృష్ణారావు, ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, ఎం.శ్రీను నాయక్, జె.వాణి, వెంకటశేషమ్మ, సీహెచ్ సుభాషిణి పాల్గొన్నారు.

ప్రపంచశాంతి కోసం రథయాత్ర

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, విశ్వమానవ కల్యాణం కోసం పత్రీజి చైతన్య జ్యోతి రథయాత్ర కార్యక్రమాలు చేపడుతున్నట్లు జేజీ నారాయణ తెలిపారు. స్థానిక పత్రీజి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో సత్యదేవుని దేవస్థానం వద్ద నుంచి ధ్యాన కేంద్రం వరకు చైతన్య జ్యోతి రథయాత్ర మంగళవారం నిర్వహించారు. డిసెంబరు 21 నుంచి 31 తేది వరకు పత్రీజీ ధ్యాన మహాయాగం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పందిటి అల్లూరయ్య, ఎం.తిరుపతిరెడ్డి, యేల్చూరి రాధయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత తొలగింపు

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, పూడికతీత పనులను పంచాయతి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ద్వారా మంగళవారం చేపట్టారు. పట్టణంలోని పాత స్టేట్ బ్యాంక్ రోడ్డు, తూర్పు వీధి, తదితర వీధుల్లో జరుగుతున్న పూడిక తీత పనులను పంచాయతీ కార్యదర్శి అరవింద పరిశీలించారు. చెత్త చెదారాన్ని తొలగించడం ద్వారా మురుగు నీరు నిలబదన్నారు. , దాంతో దోమల బెడద తగ్గుతుందన్నారు. కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. చెత్త బండ్లలోనే చెత్తను వేసి వీధులను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఉప్పలపాటి హరిబాబు, షేక్ మస్తాన్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే బాలబాలికలు లక్ష్యం ఎంచుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి సూచించారు. మండలంలోని మార్కండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా మా కళలు - మా స్వప్నాలు అనే అంశంపై హెచ్ఎం సీహెచ్ శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీ భాస్కరరెడ్డి, ఎం.విజయ, ఎస్.నీలవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ. మంజుల, సీహెచ్ కల్యాణి పాల్గొన్నారు.

రోడ్లకిరువైపులా చిల్లచెట్ల తొలగింపు

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చిల్లచెట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో టీడీపీ గ్రామ నాయకుడు అల్లు వెంకటేశ్వర్లు సొంత ఖర్చులతో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో వీటిని తొలగిస్తుండటంతో ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

నేడు విద్యుత్ అదాలత్

పీసీపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కనిగిరి విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీసీపల్లి ఏఈ లక్ష్మీరాజేష్ తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ పాల్గొంటారని తెలిపారు.

ప్రగతిబాటలో పల్లెలు

- మారుతున్న రూపురేఖలు
- కూటమి ప్రభుత్వం చొరవతో సీసీ రోడ్ల నిర్మాణాలు
- తీరనున్న ప్రజల ఇబ్బందులు



వీరవెంకటాపురం ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

దొనకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులను దారి మళ్లించింది. గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. దీంతో పంచాయతీల అభివృద్ధికి నిధులు రాకపోవటంలో అప్పట్లో సర్పంచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లోని రహదారులకు పట్టిన గ్రహణం వీడింది. అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. పల్లెపండుగ పేరుతో ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. దొనకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 39 సిమెంట్ రోడ్ల పనులకు గాను రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి.

అన్నిగ్రామాల్లో ఐదేళ్ళ తర్వాత ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేస్తుండటంతో గ్రామాల్లో ప్రజలు కూటమి ప్రభుత్వం పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు చివరి నాటికి సిమెంట్ రోడ్ల నిర్మాణాలు నూరుశాతం పూర్తయ్యేలా పంచాయతీరాజ్ ఏఈ పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పనులు జరుగుతున్నాయి.

హామీలను నెరవేరుస్తున్నారు



- మోడి పెద్దఅంజనేయులు, ఎర్రబాలెం

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని టీడీపీ నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో జరగని అభివృద్ధి ప్రస్తుత ప్రభుత్వంలో అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతుండటం హర్షనీయం.

గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు హర్షనీయం



షేక్ రసూల్, దొనకొండ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం హర్షనీయం. దొనకొండ పంచాయతీలో రూ.50 లక్షలతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపడుతున్నారు. దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి వెళ్లే మట్టిరోడ్డుపై వర్షం కురిస్తే రాకపోకలు జరుపుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం చొరవతో నేడు సిమెంట్‌రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి'



బల్లిపల్లి గ్రామంలో రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ, ఉద్యాన అధికారులు

కనిగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ, హార్టికల్చర్ ఏవోలు జ్యోష్నా దేవి, అంజలీబాయి అన్నారు. మండలంలోని చీర్లదిన్నె, బల్లిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏవో జ్యోష్నాదేవి మాట్లాడుతూ కంది, వరి, మినుము పంటలో పురుగులు, తెగుళ్ల నివారణ గురించి సూచనలు చేశారు. వరి పొట్ట దశలో ఉన్నప్పుడు ఆకుముడత తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు పిలక దశలో చేసుకు అడ్డంగా తాడును రెండు మూడు సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయని సూచించారు. అలాగే, క్లోరిపైరిఫాస్ 2.5మి.లీటరు లేదా ఎసిఫేట్ 1.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పొట్ట దశలో క్లోరాంట్రానిలిప్రోల్ 20ఎస్.సీ 0.4 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ఉద్యాన ఏవో అంజలీబాయి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ రైతులకు 50శాతం రాయితీతో మినీ ట్రాక్టర్, తైవాన్ పంపులు, పవర్ ట్రిల్లర్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువైద్యాధికారి కృష్ణ మాట్లాడుతూ గడ్డి పెంచుకునే రైతులలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మాత్రమే పూర్తి రాయితీ ఉందని తెలిపారు. ఈ గడ్డి పెంపకాన్ని ఉపాధి పథకం కింద అమలు చేస్తారని తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో సిబ్బంది కరిముల్లా, వెంకటసుబ్బయ్య, హబీబ్ జిలాని, షఫీ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్ల పనులు

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో పట్టణంలో సీసీ రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా అన్నారు. రూ.5 కోట్ల ఉపాధి నిధులతో పామూరు పట్టణంలో 23 రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గోపాలపురం, విరాట్‌నగర్ కాలనీ, డీవీ పాలెంతో పాటు పట్టణంలోని పలు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు మరో పది రోజుల్లో పూర్తి కావస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ మస్తాన్‌వలి తెలిపారు.

పాత స్టేట్ బ్యాంక్ ఏరియాలో జరుగుతున్న రోడ్డు పనులను మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా పరిశీలించారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికావద్దు

ముండ్లమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు గురై తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సభకు ఇన్‌చార్జ్ హెచ్ఎం హజరత్ ఆలీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు విద్యార్థులు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రధానంగా సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ల జోలికి వెళ్ళవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దొనకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని మల్లంపేట, రుద్ర సముద్రం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కందిలో మచ్చల పురుగు, పచ్చ పురుగులు కనిపిస్తున్నాయన్నారు. వీటిని నివారించకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుదన్నారు. గత వారం రోజులుగా వాతావరణం మార్పులతో మిరపలో కొమ్మతెగుళ్లు ఆశించిందని చెప్పారు. వీటి నివారణకు మందులు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నాసర్‌వలి, మురళీ, విన్నీబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్ల మార్జిన్‌లు

- పట్టించుకోని అధికారులు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లలో నిలిచిఉన్న వర్షపు నీరు

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్అండ్‌బీ రోడ్ల మార్జిన్‌లు గుంతలమయంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలబడి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈక్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని పామూరు - కందుకూరు ఆర్అండ్‌బీ రోడ్డు, పామూరు నుంచి నుచ్చుపొద గ్రామం వరకు రోడ్డు ఇరువైపులా మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మార్జిన్‌ల్లో నాణ్యత లేని బరమ్సు మట్టి వాడటంతో గుంతలు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఆర్అండ్‌బీ రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో రోడ్లు దారుణంగా ఉన్నాయి. పలుచోట్ల అడుగడుగుకు గుంతలు పడ్డాయి. వర్షం నీరు గుంతల్లో నిలబడటంతో రాత్రుళ్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు కనబడక అందులో వాహనాలు పడి గాయపడుతున్నారు.

పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో మార్జిన్‌లలో పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఎదురెదురూ రెండు వాహనాలు వచ్చినప్పుడు సైడ్ ఇవ్వడానికి మార్జిన్ దిగే సమయంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్‌లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ అక్రమ వాడకాన్ని నిరోధించాలి

- ఈఈ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ దర్శి ఈఈ శ్రీనివాసులు

దర్శి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అక్రమ వాడకాన్ని నిరోధించాలని దర్శి ఈఈ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ అక్రమ విద్యుత్ వాడుతున్నారని చెప్పారు. దాడులలో ప్రతిసారీ అక్రమార్కులు పట్టుబడుతున్నారని తెలిపారు. స్థానిక అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ విద్యుత్ వాడకాన్ని నివారించాలని కోరారు. నిర్లక్ష్యవైఖరి అవలంబించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీపీఈ ఈఈ హైమవతి మాట్లాడుతూ అక్రమ విద్యుత్ వాడకాన్ని నివారించేందుకు నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అక్రమ విద్యుత్ వాడకందారులపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. భవిష్యత్తులో అక్రమార్కులపై మరింత పటిష్ట చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం దర్శి పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. డీపీఈ ఈఈ హైమవతి ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి పట్టణంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 43మంది వినియోగదారులు అక్రమ విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. రెండు లక్షలు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో దర్శి ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు కె.పిచ్చయ్య, ఆర్.మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సాయంత్రం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో అనేకవిధాలుగా ఆశలు చూపి ప్రలోభపెట్టి మోసం చేస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోతున్నారని చెప్పారు. యువత కూడా ఆన్‌లైన్‌లో ప్రయోగాలు చేస్తూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారన్నారు. కొంతమంది దురవ్యసనాలకు పాలై తీవ్రంగా నష్టపోవటమే కాక జీవితాలను చెడగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత చదువుపైనే దృష్టిసారించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళీ పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు!

కనిగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.శ్రీరాం అన్నారు. మంగళవారం కనిగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా సైబర్ నేరాలకు ఫోన్‌లే కేంద్ర బిందువుగా మారాయన్నారు. టెలికం రెగ్యులేటరీ అథారిటీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ మీ సేవలు నిలిపి వేస్తున్నామంటూ ఫోన్ చేయటం, పోలీస్ అధికారులమంటూ, సీబీఐ, ఏసీబీ అంటూ ఫోన్‌లు చేస్తుంటే ఆందోళన పడకుండా సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఫోన్‌లు చేసే వారి మాటలను నమ్మి వారి వలలో చిక్కుకోవద్దన్నారు. బైక్ నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. సైబర్ నేరాల్లో బాధితులయితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసి తగిన వివరాలు తెలపడం ద్వారా కొంతమేర నష్టపోయిన డబ్బును తిరిగి పొందవచ్చునని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో మల్లాలమ్మ జాతర

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మేదర (మహేంద్ర) కులదైవం మల్లాలమ్మతల్లి జాతర వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముందుగా పట్టణంలోని కందుకూరు రోడ్డు నుంచి కరెంటు ఆఫీసు కాలనీలో గల మల్లాలమ్మ తల్లి దేవస్థానం వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం గణపతి పూజ, అమ్మవారికి పాలభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలతోపాటు శాంతి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మేదర కులవృత్తికి సంబంధించిన పనిముట్లను దేవస్థానంలో ఉంచి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్ఐ టి.కిశోర్‌బాబు సూచించారు. విద్యపై దృష్టిసారించి రాణించాలన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు సోషల్ మీడియాపై అవగాహన కలిగించారు. ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల పట్ల ఆకర్షణ పెంచుకొని మోసపోవద్దన్నారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

పీసీపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అవగాహన కలిగించారు. విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న మంచి చెడుల గురించి తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా మనకు తెలియని వ్యక్తులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని చెప్పారు. ఏదైనా సమస్య వచ్చినా, ఆపదలో ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బంగారు బాల్యాన్ని సంరక్షించాలి



బంగారు బాల్యం ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పీసీపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మన దేశ భవిష్యత్తుకు బంగారు బాల్యం విలువైనదని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. అది బాలల ఉజ్వల భవిష్యత్తుకు నాంది కావాలన్నారు. మండలంలోని పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు షేక్ సుభాన్ అధ్యక్షతన స్వయంకృషి సేవా సంస్థ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం బంగారు బాల్యం వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బంగారు బాల్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదని పేర్కొన్నారు. ఇద్దరినీ సమానంగా చూడాలన్నారు. బాలకార్మికులు లేని సమాజాన్ని తీర్చిదిద్దాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలం లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని, ఎంఈవోలు సంజీవిని, ఆర్.శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దర్శి డివిజన్ ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలవరం, ముండ్లమూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను వివరించారు. ప్రధానమంత్రి పసల బీమా యోజన ద్వారా ఇన్సూరెన్స్‌కు సంబంధించి పంటల వారీగా ప్రీమియం చెల్లించాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా పంట నమోదు ప్రక్రియ మొదలైందన్నారు. ప్రస్తుతం మినుము, శనగ విత్తనాలను సబ్సిడీ ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, ప్రదీప్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణ

తాళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో రీసర్వేలో జరిగిన తప్పులను దిద్దుబాటు చేశారు. స్థానిక గ్రామసచివాలయం వద్ద ఇటీవల రీసర్వే గ్రామసభల్లో పలువురు అర్జీలు ఇచ్చారు. ఈక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు ఆదేశంతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జాయింట్ పొలాల హక్కుల్లో తప్పులు ఉన్న రైతులను పిలిపించారు. క్షేత్రస్థాయిలో భూమి అనుభవాన్ని, రికార్డులను పరిశీలించి ఆరుగురు రైతుల సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో వీఆర్వో నాగూర్‌బీ, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో సుబ్బయ్య

తాళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలు పాటిస్తూ చదువులు సాగించాలని ఎంఈవో జి.సుబ్బయ్య విద్యార్థులకు సూచించారు. స్థానిక వీకే జూనియర్ కళాశాలలో బంగారు బాల్యం వారోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో-2 సుధాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంకోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్య పరిశుభ్రతపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే, తాళ్లూరు దళితవాడ ఎంపీపీ స్కూల్‌లోనూ బంగారు బాల్యం వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి,హెచ్ఎం కె.పెద్దిరెడ్డి, డీటీఆర్‌సీ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ డేవిడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ల్యాప్‌ట్యాబ్ బహూకరణ

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, నార్త్ తెలుగు సొసైటీ అధ్యక్షుడు పి.మదన్‌మోహన్ ల్యాప్‌ట్యాబ్ బహూకరించారు. తనతండ్రి ఉప సర్పంచ్ నరసయ్య చేతుల మీదుగా పాఠశాల అవసరాల కోసం హెచ్ఎం షేక్ ఖాదరున్నీసాబేగంకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు జె.ప్రసాదరావు, ఆర్.కొండారెడ్డి, షేక్ పాదుషా, వి.సతీష్, జి.వేమనారాయణ, పి.తిరుపతయ్య, నారాయణ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ప్రతిభ చాటిన ప్రవీణ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డివిజన్ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చాటారు. మార్కాపురం ఉన్నత పాఠశాలలో జరిగిన డివిజన్‌స్థాయి బంగారు బాల్యం పోటీల్లో 9వ తరగతి చదువుతున్న అంబవరం విద్యార్థి ప్రవీణ్‌కుమార్ చిత్రలేఖనంలో రాణించారు. మార్కాపురం, కనిగిరి డివిజన్ స్థాయిలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా పలువురు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

మిరపలో తెగుళ్ల నివారణకు చేపట్టాలి

పామూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పంటలకు తెగుళ్లు ఆశించాయని ఏవో కె.రాధ అన్నారు. మిరపలో తెగుళ్ల నివారణకు మందులను పిచికారి చేయాలని సూచించారు. మంగళవారం మండలంలోని వగ్గంపల్లి, రావిగుంటపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బుధవారం 20 నవంబరు 2024

విజ్ఞానాలయాలు.. వెలవెల

విజ్ఞానాలయాలుగా విలసిల్లుతున్న గ్రంథాలయాలు.. నిధులు రాక, నిర్వహణ లేక విలవిలలాడుతున్నాయి. వివిధ రకాల గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు లేక, పాఠకుల ఆదరణ కోల్పోయి వెలవెలపోతున్నాయి. వందలాది మంది పాఠకులతో కళకళలాడే గ్రంథాలయాలు నేడు కునారిల్లిపోతున్నాయి. నిధుల కొరతతో.. మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరణకు నోచుకోలేక గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న లైబ్రరీలు గత వైభవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగార్థులకు కావాల్సిన పుస్తకాలను అందించడంతో పాటు జ్ఞాన సముపార్జనకు వచ్చే పలువురికి అరకొర సౌకర్యాలే స్వాగతం పలుకుతుండడంతో గ్రంథాలయాలకు వచ్చేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. గడచిన ఐదేళ్లలో ఒక్క పుస్తకం కొనుగోలుకు కానీ, భవనాల మరమ్మతులకు కానీ ఒక్క రూపాయి వెచ్చించలేదంటే గ్రంథాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఏరీతిన ఉందో తెలుసుకోవచ్చు. స్థానిక సంస్థల నుంచి హక్కుగా రావాల్సిన సెస్సు కూడా ఏళ్ల తరబడి జమ కాకపోవడంతో కోట్ల రూపాయలు బకాయిలు వెక్కిరిస్తున్నాయి. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాఠకుల కోసం గ్రంథాలయాల సమస్యలపై ప్రత్యేక కథనం.

ఆధునికతకు.. ఆపసోపాలు

అవే పత్రికలు, పుస్తకాలు తప్ప డిజిటలైజేషన్ వైపు పకడ్బందీగా అడుగులు వేయలేక గ్రంథాలయాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇంటర్నెట్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఇందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. గ్రేడ్-1, 12 గ్రేడ్-2 శాఖా గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని గతంలో అధికారులు సంకల్పించగా ఆ ప్రయత్నం ముందుకు సాగడంలేదు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 20 కంప్యూటర్లతో ఎయిర్ కండీషనింగ్ చేయించినా పాఠకులకు ఉచిత సేవలు అరకొరగానే లభిస్తున్నాయి.


రేపల్లె: పాఠకులు లేక వెలవెలబోతున్న గ్రంథాలయం

ఆదర్శంగా వినుకొండ

2007వ సంవత్సరం నుంచి మొదలుకొని పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ మున్సిపాలిటీ క్రమం తప్పకుండా సెస్సు చెల్లిస్తున్నది. రూ.1.63 కోట్ల గ్రంథాలయ సెస్సుకు మొత్తం డిమాండ్ చెల్లించింది. వినుకొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకుని సెస్సు బకాయిలు లేకుండా అన్ని పురపాలక సంఘాలు, పంచాయతీలు, ఏపీఐఐసీ చెల్లిస్తే పాఠకులకు అధునాతన సౌకర్యాలను గ్రంథాలయాల్లో కల్పించొచ్చు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో గ్రంథాలయాలు కునారిల్లిపోయాయి.



ఆంధ్రజ్యోతి ఫోకస్

(ఆంధ్రజ్యోతి - బాపట్ల, న్యూస్‌నెట్‌వర్క్)


పలు దినపత్రికలు, గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు.. వాటిని చదువుకునేందుకు వచ్చే పాఠకులతో గ్రంథాలయాలు కళకళలాడుతుండేవి. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో గ్రంథాలయాలకు పెద్ద ఆదరణ ఉండేది. ప్రభుత్వంతో పాటు గ్రంథకర్తలు, సాహితా సంస్థల ప్రోత్సాహంతో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లేవి. ఎందరికో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు రావడానికి కారణమయ్యాయి. అలానే సాహితీవేత్తలను తయారు చేశాయి. అలాంటి గ్రంథాలయాలు గత కొంతకాలంగా నిధులు లేక, పలు రకాల సమస్యలను పరిష్కరించే దిక్కు లేక, ఎవరికీ పట్టనట్లుగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు గ్రంథాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోగా ప్రజల నుంచి వసూలు చేస్తున్న సెస్సులను స్థానిక సంస్థలు దారి మళ్లిస్తున్నా పట్టించుకోవడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ గ్రంథాలయాలకు జమ చేయకుండా జాప్యం చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానం కారణంగా కనీసం స్టేషనరీ సామాగ్రిని కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 97 శాఖా గ్రంథాయాలు, 32 గ్రామీణ, 103 పుస్తక పంపిణీ కేంద్రాలున్నాయి. ఆయా గ్రంథాలయాల్లో 10,52,370 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు ఉండగా వాటిలో చాలావరకు కాలం చెల్లినవే. అప్‌డేట్ అయినవి చాలా తక్కువగా ఉన్నాయి. వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అవసరం మేరకు అందుబాటులో లేవు. రీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలను తెప్పించడంలో జాప్యం జరుగుతున్నది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కటంటే ఒక్క పుస్తకం కొత్తగా కొని పాఠకులకు అందుబాటులో ఉంచలేదు. డీఎస్సీ, టెట్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు కావాల్సిన ఏ ఒక్క మెటీరియల్ కూడా గ్రంథాలయాల్లో అందుబాటులో లేదు. గ్రంథాలయాల్లో భర్తీ కావాల్సిన పోస్టులు అయితే పదుల సంఖ్యలోనే ఉన్నాయి. చాలా చోట్ల అవుట్ సోర్సింగ్ విధానంతోనే నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా గ్రంథాలయాలను గాడిన పెట్టే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు బకాయిల వసూలుపై దృష్టి పెట్టి ఆ నిధులను వాటి అభివృద్ధిపై ఖర్చు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతుండడంతో ఆర్భాటపు ప్రకటనలకే పరిమితం కాకుండా అమలు జరిగే పనులకు హామీ ఇచ్చి వాటిని ఆచరణలోకి తేవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



- ఆదరణ లేక గ్రంథాలయాలు వెలవెల
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- అరకొర పుస్తకాలతోనే పరిమితంగా సేవలు
- లైబ్రరీలకు సెస్సులు చెల్లించని స్థానిక సంస్థలు
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం రావాలని ఆశ

సెస్సుల జమలో నిర్లక్ష్యం

ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో 8 శాతం సెస్సు కింద ఎక్కడికక్కడ ఉండే గ్రంథాలయాల ఖాతాల్లో జమ చేయాలి. ఈ నిధుల్ని గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని నిబంధనలున్నాయి. గడచిన ఐదేళ్లలో సెస్సు మొత్తాలను లైబ్రరీ ఖాతాలకు జమ చేయకపోగా ఆ నిధులను దారి మళ్లించేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పురపాలకసంఘాలు, పంచాయతీలు, కార్పొరేషన్‌లు, ఏపీఐఐసీ నుంచి గ్రంథాలయాలకు సెస్సు బకాయిలు రావాలి. 2007-08 నుంచి రూ.42 కోట్ల పైచిలుకు సెస్సు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్పొరేషన్ల నుంచి రూ.8.08 కోట్లు, మున్సిపాలిటీల నుంచి రూ.3.97 కోట్లు, పంచాయతీల ద్వారా రూ.3.16 కోట్లు, ఏపీఐఐసీ నుంచి రూ.75,90,733 కలిపి మొత్తంగా రూ.15 కోట్ల 99 కోట్ల సెస్సు రావాలి. అయితే ఇప్పటివరకు రూ.9.02 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.6.96 కోట్లు వసూలు కావాల్సి ఉన్నది. బాపట్ల పురపాలక సంఘం నుంచి రూ.30.44 లక్షల బకాయి రావాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. చిలకలూరిపేట నుంచి రూ.37.63 లక్షలు, మాచర్ల నుంచి రూ.19.11 లక్షలు, పిడుగురాళ్ల నుంచి రూ.29.18 లక్షలు, గురజాల నుంచి రూ.4.43 లక్షలు, దాచేపల్లి నుంచి రూ.8.48 లక్షల్లో రూపాయి కూడా వసూలు జరగలేదు. 1017 పంచాయతీల్లో రూ.3.16 కోట్లు డిమాండ్ ఉంటే అందులో సగం మాత్రమే జమైంది. ఏపీఐఐసీ నుంచి రూ.75.90 లక్షలు రావాల్సి ఉండగా ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఇలా సెస్సు బకాయిలు పేరుకుపోతుండటంతో గ్రంథాలయాల నిర్వహణపై భారం పడుతున్నది.



శంకుస్థాపనతో సరి..

బాపట్ల: బాపట్ల జిల్లా ఏర్పడి రెండేళ్లు దాటినా బాపట్లకు శాఖా గ్రంథాలయమే దిక్కయింది. అది కూడా శిథిలావస్థలో ఉన్న భవనంలో సాగుతుంది. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించిన తొలినాళ్లలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపనతో సరిపెట్టారు. ఆరుదశాబ్దాల ఘనచరిత్ర కలిగిన బాపట్లశాఖా గ్రంథాలయం నేటికి అద్దెభవనంలోనే కునారిల్లుతున్నది. 26వేల పుస్తకాలు ఉన్నా అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. గ్రంథాలయ విశిష్టత, అవసరత తెలిసిన వారుకూడా సొంతభవన నిర్మాణానికి కృషి చేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గాదె వెంకటరెడ్డి కృషితో ఆంజనేయ అగ్రహారం స్కూల్ ప్రాంగణంలో 8 సెంట్లు కేటాయించి శంకుస్థాపన చేశారు. కాని నిధుల కొరతతో భవన నిర్మాణం జరగలేదు. బాపట్ల శాఖా గ్రంథాలయం సెస్సు బకాయి సుమారు రూ.1.50 కోట్లు ఉంది. జిల్లాలోని రేపల్లె, బాపట్ల, చీరాల మున్సిపాలిటీల పరిధిలో రూ.1.66 కోట్లు సెస్సు బకాయిలు ఉండగా, పంచాయతీల పరిధిలో రూ.3.12 కోట్ల బకాయిలు ఉన్నాయి. జిల్లాలో 35 ఖాళీలను అధికారులు గుర్తించారు.



స్థలం ఉన్నా నిర్మాణంలో జాప్యం

రేపల్లె: పట్టణంలోని చంద్రమౌళిపార్కులో 1960లో ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనం శిథిలమై కూలిపోగా ఇప్పటికీ నూతన భవన నిర్మానం జరగలేదు. ఎంతో ఘన చరిత్ర కలిగిన గ్రంథాలయ భవనం కనుమరుగైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు దాసరి కృష్ణకుమారి కాంప్లెక్స్ భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. నూతన భవన నిర్మాణానికి పరుచూరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పరుచూరి శ్రీనాథ్ రూ.20 లక్షలు సమకూరుస్తామని హామీ ఇచ్చినా దానిని సద్వినియోగం చేసుకోలేదు. గ్రంథాలయంలో కొత్తపుస్తకాలు వచ్చిన దాఖలాలులేవు. పక్కాభవనం లేకపోవడంతో సరైన సంరక్షణ లేకపోవడంతో పుస్తకాలు పాడైపోయాయి. సెస్ బకాయిలు రూ.30 లక్షల వరకు ఉంది.



వసతులు అంతంత మాత్రమే

నరసరావుపేట: నరసరావుపేటలోని శాఖా గ్రంథాలయంలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల వసతి లేదు. ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించలేదు. పాత పల్నాడు బస్టాండ్‌లోని గ్రంథాలయ భవనానికి అద్దెల ఆదాయం సమకూరుతుంది. అయితే సౌకర్యాలు సక్రమంగా లేవు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

- 'తేమ' పరీక్షలో చిత్తవుతున్న పత్తి రైతు
- అమ్మకాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- తిరస్కరించిన లోడ్‌ను తిరిగి తీసుకెళ్లడం అదనపు భారం


పత్తిలో తేమ శాతం చూస్తున్న అధికారులు



గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు.. సీసీఐ నిబంధనలు.. పత్తిని అమ్ముకునే రైతులకు అగ్నిపరీక్షలుగా మారుతున్నాయి. మద్దతు ధర దక్కుతుందనుకున్న సీసీఐ కేంద్రాల్లో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఎండ వేడి ఎక్కువగా ఉన్న ఉదయం వేళ తీసుకువస్తున్న పత్తి లాట్‌లు సీసీఐ తేమ పరీక్షలో నెగ్గుతున్నాయి. సాయంత్రం తీసుకువస్తున్న పత్తి లాట్లలో తేమ శాతం నిబంధనలకు మించి ఉండటంతో తిరస్కరిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో పత్తి కొనుగోలు కోసం రైతులు ఒకటి, రెండు రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంటోంది. అప్పటికీ కూడా తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొనుగోలు చేయకపోతుండటంతో ఉసూరుమంటూ వెళ్లిపోతున్నారు.

యంత్రాల్లో తేడా...

ప్రస్తుతం సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం చూసేందుకు బయ్యర్లు రెండు రకాల యంత్రాలు వినియోగిస్తున్నారు. వాటిలో ఒక్కో దానిలో ఒక్కో తేమ శాతం కనిపిస్తుంది. చిన్న ముళ్ళు ఉన్న యంత్రంలో 12 శాతం తేమ ఉన్నట్లు చూపిస్తుంటే, పెద్ద ముళ్ల ఉన్న యంత్రంలో 15 శాతం ఉన్నట్లు

(మిగతా 6లో)

గిరిపుత్రులకు కలెక్టర్ వరాలు

యుద్ధప్రాతిపదికన సంక్షేమాలు అందిస్తాం

సత్వరం విద్యుత్ దీపాలు, కుళాయిలు

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గతంలో పనిచేసిన ప్రాంతాల్లో గిరిజనుల సాధకబాధలు దగ్గరగా చూశానని, వారి అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తానని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. మంగళవారం చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ శేఖర్‌స్వామి పుట్ట వద్ద కట్టపై నివాసం ఉంటున్న ఎస్టీ వాసులకు కలెక్టర్ మంగళవారం దుప్పట్లను పంపిణీ చేశారు. గిరిజన సంఘం నాయకుడు దేవరకొండ రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గిరిపుత్రుల పరిస్థితులను చూసి చలించిపోయారు. గిరిపుత్రులకు ఆధార్, రేషన్ కార్డులను వెంటనే అందిస్తామన్నారు. స్థానికంగానే ఉపాధి పనులు కల్పించి ఆదుకుంటామన్నారు. విద్యుత్ దీపాలు, సురక్షితమైన తాగునీటి కోసం కుళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రీ స్కూల్‌ను ఏర్పాటు చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరేళ్లు దాటిన చిన్నారులకు స్కూల్‌కు వెళ్లేందుకు వాహన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. గిరిపుత్రులకు ప్రత్యేక గ్రీవెన్సును ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి విజయమ్మ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎస్టీ సంఘ నాయకులు ఉన్నారు.


ఎస్టీ కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటమురళి



రథం లాగుతున్న గొట్టిపాటి హర్షవర్ధన్

ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుకు చేరిన మహాపాదయాత్ర

» పూజలు నిర్వహించిన హర్షవర్ధన్

అద్దంకి, సంతమాగులూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం కుందుర్రు కు చెందిన అయ్యప్ప దీక్షాధారులు చేపట్టిన మహాపాదయాత్ర మంగళవారం కు ఆం ధ్ర,తమిళనాడు సరిహద్దులోని గుమ్మడిపూండి కి చే రింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు అయ్యప్ప మండల దీక్షలో ఉన్న హర్షవర్ధన్ మంగళవారం మహాపాదయాత్ర రథం వద్ద పూజలు నిర్వహించారు. దీక్షాధారులతో కలిసి మహాపాదయాత్రలో నడిచారు. పలువురు సంతమాగులూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు మంగళవారం తెలిపారు. డివిజన్ పరిధిలో 139 రెగ్యులర్ డీలర్ల ఖాళీలు ఏర్పడ్డాయి. కొత్తగా 4 షాపులు ఏర్పడ్డాయి. దీంతో మొత్తం 143 మంది డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుదారులకు రాత, మౌళిక పరీక్షల ద్వారా ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తారు. అభ్యర్థులు నిబంధనల మేరకు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 28వ తేదీ లోపు చీరాల ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో సూచించారు.

పంట పొలాల్లో ఆడ శిశువు

సంతమాగులూరు, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : మానవత్వం మంటగలచిపోతోంది. నవమోసాలు మోసి పుట్టబోయే బిడ్డ కోసం ఎన్నో కలలు గంటారు. ఆడబిడ్డ పుట్టిందని రోడ్డు పక్కన పొలాల్లో వదిలి వెళ్లిన ఘటన మండలంలోని పత్తేపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆడ బిడ్డకు జన్మనిచ్చి పంట పొలాల్లో వదిలి వెళ్లారు. పొలాల్లో పనులు కోసం వెళ్తున్న రైతులు చూసి పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సీడీపీవో సుధ చేరుకొని ఆడశిశువును ఒంగోలు శిశు సంరక్షణా కేంద్రానికి 108లో తరలించారు. సంతమాగులూరు మండలంలో ఇటీవల ఏల్చూరు గ్రామంలో ఆడశిశువును రోడ్డు వెంబడి వదిలి వెళ్లిన సంఘటన జరిగిన కొద్దిరోజులకే ఈ ఘటన చోటుచేసుకుంది.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

మేదరమెట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, జొన్న , మొక్కజొన్న పంటలను సాగు చేసుకోవాలని అద్దంకి డివిజన్ ఏడీఏ కె.ధనరాజ్ సూచించారు. మంగళవారం మండలంలోని అనమనమూరు గ్రామంలో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ ధనరాజ్ రైతులతో మాట్లాడుతూ గత సంవత్సరం మంచి దిగుబడి మంచి ధరలు ఉన్నాయని ఈ సంవత్సరం ఎక్కువ మంది రైతులు మొగ్గు చేపుతున్నారు అని దాని వలన రైతులు ఇబ్బంది పడే అవకాశముందన్నారు. అధికంగా పొగాకు పండిస్తే మద్దతు ధర లేనప్పుడు ఎవరినీ అడగలేం, బతిమలాడలేం, నిలదీయలేమని కనుక పొగాకు తగ్గించి అపరాలు, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలని ధనరాజ్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు, ఏటీఎం రామిరెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు ఆఫ్రిన, రైతులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న వాహనం

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వైపు వెళుతున్న వాహనం రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ పోల్‌ను ఢీకొని అదేవేగంతో పక్కనున్న డివైడర్‌ను ఢీకొన్న సంఘటన మంగళవారం వేకువజామున జొన్నతాళి సెంటరు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఇద్దరు పురుషులు, ఐదుగురు మహిళలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అందిన సమాచారం మేరకు కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని బెల్లంకొండ వారిపాలెంకు చెందిన జూపూడి జయకుమారి కుటుంబానికి చెందిన వారు చెన్నై వెళ్లి తిరిగి నందిగామ వెళుతుండగా, నిద్రమత్తులో వాహనడ్రైవరు విద్యుత్ పోల్‌ను ఢీకొనగా, వేగం అదుపుకాకపోవడంతో రోడ్డు దాటి ఒంగోలు వైపు డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా దెబ్బతినగా, అందులోని వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారు. వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స చేసివారిని పంపించారు.

ప్రైవేటు బస్సు కింద పడి క్లీనర్‌కు గాయాలు

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కింద క్లీనర్ పడడంతో అతని కాలు విరిగిన సంఘటన సోమవారం అర్ధరాత్రి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఒంగోలు వైపు జరిగింది. ఈ ప్రమాదంలో రాజమండ్రికి చెందిన క్లీనర్ సీశాల ప్రసాద్‌కు కాలు విరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు టోల్ ప్లాజా గేట్ గుండా వెళుతూ ఫాస్టాగ్ లేని కారణంగా మరో గేట్ గుండా వెళ్లేందుకు బస్సు వెనుకకు వస్తున్న సమయంలో బస్సులో గేట్ వద్ద నిలబడిన క్లీనరు బస్సు ముందు టైరు కింద పడిపోయాడు. దాంతో అతని కాలు విరిగింది. సమీపంలోని హైవే అంబులెన్సువారు అతనిని చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

షెడ్ వేసేద్దాం!

» పశువుల పాకలకు భారీ డిమాండ్
» కేటాయింపు కన్నా రెండున్నర రేట్లు అధికంగా దరఖాస్తులు
» 90శాతం రాయితీతో ఆసక్తిచూపుతున్న పశుపోషకులు
» జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన నిర్మాణాలు
» ఉపాధి హామీ నిధులు అనుసంధానం
» వేగంగా సాగుతున్న నిర్మాణాలు
» సంక్రాంతిలోగా పూర్తికి అధికారుల యత్నాలు

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులకు కూటమి ప్రభుత్వం దన్నుగా నిలిచే క్రమంలో చేపట్టిన పశువుల పాకల నిర్మాణాల పథకానికి జిల్లాలో భారీ డిమాండ్ ఏర్పడింది. పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు తొలుత వచ్చిన వాటికి ప్రాధాన్యత ఇస్తూ మంజూరుచేయడంతో జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రస్తుతం పశువుల పాకల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పాడి పరిశ్రమకు ఊతం, గొర్రెలు, మేకల పెంపకం చేసే వారికి ఆసరాగా ఉండేందుకు ఎండలు, వర్షాల నుంచి వాటికి రక్షణ ఇచ్చేలా 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మినీ గోకులాలు పేరుతో షెడ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో అలా 2018లో 500 యూనిట్లు మంజూరుచేయగా 300 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అప్పట్లో కూడా వీటిని ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతోనే ఇచ్చారు. అయితే పథకం ప్రవేశపెట్టిన కొద్దికాలానికి ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారగా ఆ లోపు కొంతమేర మాత్రమే లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడటమే కాక చేసిన నిర్మాణాలకు కూడా బిల్లులు ఇవ్వక లబ్ధిదారులు నష్టపోయారు.

రాయితీ పెంపుతో ఆసక్తి

కాగా తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకంపై దృష్టిసారించింది. ఈసారి యూనిట్ కాస్ట్‌ను పెంచడంతోపాటు రాయితీని కూడా పెంచింది. పశువుల పాకలకు యూనిట్ విలువ కనిష్ఠంగా రూ.1,03,500, గరిష్ఠంగా రూ.2,07,000లుగా నిర్ణయించింది. అందులో కేవలం పది శాతం మాత్రమే లబ్ధిదారుడు తన వాటాగా చెల్లిస్తే మిగిలిన 90శాతం ఉపాధి హామీ పథకం నుంచి ఇస్తారు. అలాగే గొర్రెలు, మేకల షెడ్లకు కనిష్ఠంగా రూ.1.30 లక్షలుగా నిర్ణయించగా అందులో లబ్ధిదారులు 30శాతం తమ వాటాగా చెల్లించాలి. పశుసంవర్ధకశాఖ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేస్తే ఉపాధి సిబ్బంది పర్యవేక్షణలో వాటిని నిర్మిస్తారు. జిల్లాలో పాడిపరిశ్రమ అధికంగా ఉన్న నేపథ్యంలో పలు ప్రాంతాల పశుపోషకులు ఈ పథకం వైపు మొగ్గుచూపి తమ వాటా నిధులు చెల్లించి దరఖాస్తు చేశారు.

షెడ్లకు నిర్మాణానికి ఆసక్తి

జిల్లాకు 1,075 యూనిట్లు మంజూరు కాగా దాదాపు 231 శాతంతో 2,486 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో అత్యధికంగా దర్శి నియోజకవర్గం నుంచి ఏకంగా 383 శాతం వచ్చాయి. ఆ నియోజకవర్గానికి 125 యూనిట్లు కేటాయించగా 483 దరఖాస్తులు అందాయి. అలాగే వైపాలెం నియోజకవర్గంలో కేటాయించిన యూనిట్లతో పోల్చితే 281శాతం దరఖాస్తులు రాగా సంతనూతలపాడు నియోజకవర్గంలో 257 శాతం, కొండపి నియోజకవర్గంలో 255 శాతం మేర వచ్చాయి. ఇతర నియోజకవర్గాల్లో 200 శాతం లోపుగానే ఉన్నాయి.

నిర్మాణాలు ప్రారంభం

కాగా భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు సమాచారం. అందులో సొంత స్థలాలలో నిర్మాణాలు చేసుకునే అవకాశం ఉన్న వారికి ముందుగా అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తుండగా ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పశువుల పాకల నిర్మాణాలు ప్రారంభమై ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన వారికి వచ్చే ఏడాది కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎండ, వానలకు ఇబ్బంది తప్పింది

కూటమి ప్రభుత్వం పశువులకు గోకులాల పేరుతో షెడ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. పశువుల సంరక్షణకు నాకు షెడ్డు మంజూరైంది. పశువులకు గతంలో పూరికొస్టం ఉండేది. పశువులను రోజూ పొలాల్లో మేపుకుని వచ్చాక ఆరుబయట కట్టేస్తాను. ఇపుడు గోకులం షెడ్డు నిర్మాణం పూర్తయ్యాక అవి నీడలో ఉంటాయి. ఎండ, వానలకు వాటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

- ఎం.శేషమ్మ, గోకులం లబ్ధిదారు, అనకర్లపూడి

వచ్చే ఏడాది కొనసాగుతుంది

పశువుల పాకల నిర్మాణాలు ప్రభుత్వ ప్రాధాన్య అంశం. ఈ ఏడాది జిల్లాకు 1,075 టార్గెట్ ఇచ్చారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పశుసంవర్ధకశాఖ అధికారులది. మాకు వచ్చిన ప్రతిపాదనల్లో 584 మంజూరు చేశాం. 380 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మిగతావి కూడా మంజూరు చేసి సంక్రాంతికి అన్నీ పూర్తిచేస్తాం. డిమాండ్ అధికంగా ఉంది. వాటిని వచ్చే ఏడాది తీసుకుంటాం.

- జోసఫ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా



పశువులకు శాశ్వత నిర్మాణాలు

సొంతంగా అంత డబ్బులు పెట్టి షెడ్లు రైతులు వేసుకోలేరు. పూరికొస్టాలు, ఆరుబయట రోడ్ల వెంబడి కట్టేస్తాం. దీనివల్ల ఇబ్బందిపడుతున్నాం. ఆరు పశువులకు గోకులం షెడ్ నిర్మాణానికి రూ.2.30లక్షలు అవుతుండగా, అందులో పదిశాతం రూ.23వేలు మేము పెట్టుకుంటున్నాం. మిగతాది ప్రభుత్వం ఇస్తోంది. శాశ్వతంగా పశువులకు ఆవాసం ఏర్పడుతోంది. ఎండాకాలం, వర్షాకాలం పశువులు ఎండకు, నీడకు ఇబ్బందులు పడకుండా ఉంటాయి.

- కే.పద్మ, గోకులం లబ్ధిదారు, ముప్పరాజుపాలెం

- కొండపి నియోజకవర్గంలో భారీగా షెడ్లు మంజూరు చేయించుకున్నారు. అయితే ప్రభుత్వం, అధికారులు పొరపాట్లు, అవినీతికి అవకాశం ఇవ్వలేదు. కచ్చితంగా కొత్తగా నిర్మించుకునే వారికే అంటూ తేల్చిచెప్పింది. దీంతో చాలామంది వెనక్కి తగ్గారు. కొత్తవారికి, కచ్చితంగా నిర్మించుకునే వారికి ప్రభుత్వం షెడ్లను మంజూరు చేస్తోంది. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో కలిపి 135 వివిధ దశల్లో ఉన్నాయి. పది షెడ్లు నిర్మాణం పూర్తిచేసుకున్నాయి.

- క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి రైతులు, కాపరులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. కూటమి ప్రభుత్వం పశువుల పాకల పథకాన్ని ప్రకటించిన వెంటనే మంచి స్పందన వచ్చింది. జిల్లాకు కేటాయించిన యూనిట్ల కన్నా ఇంచుమించు రెండున్నర రేట్లు మేర దరఖాస్తులు అధికారులకు అందాయి. మొత్తం యూనిట్ విలువలో 90శాతం ప్రభుత్వం రాయితీ రూపంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధుల నుంచి ఇస్తుండటం అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అదేసమయంలో జిల్లాలోని అత్యధిక గ్రామాల్లో నాలుగైదు గేదెలు అలాగే 50 నుంచి 100 వరకు గొర్రెలు, మేకలు పెంపకం చేసుకునే మధ్యతరగతి వారు అధికంగా ఉండటం కూడా మరో కారణంగా కనిపిస్తోంది.

ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసలు

» అసెంబ్లీ వేదికగా అభినందనల వెల్లువ
» సోషల్ మీడియాలో లోకేష్, మంత్రుల శుభాకాంక్షలు

పర్చూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం అసెంబ్లీ వేదికగా జనసేన పార్టీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో అసెంబ్లీలోని సభ్యులంతా కరతాళధ్వనులతో ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసల జల్లు కురిపించారు. ఈసందర్భంగా ఉపసభాపతి రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేలందరూ ఏలూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అటువంటి అవార్డును అందుకొని సభ గౌరవాన్ని పెంచారన్నారు. ఏలూరికి శాసనసభా పక్షం తరుపున శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియాలో మంత్రి నారా లోకేష్ ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, ఎంఎం కొండయ్య, అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావు, బీఎన్ విజయ్ కుమార్, కందుల ఏలూరికి అభినందనలు తెలిపారు.



చెక్కును ఈవోకు అందజేస్తున్న సాంబశివరావు

శింగరకొండకు రూ.లక్ష విరాళం

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి మార్టూరు మండలం చిమ్మిరిబండకు చెందిన తాళ్లూరి సాంబశివరావు మంగళవారం రూ.1,01,116 చెక్కును ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పావులూరి బాపయ్య, బాచిన స్వాములు, గు ర్రం శ్రీనివాసరావు,మలాది శ్రీనివాసరావు, గుళ్ళాపల్లి సు బ్రహ్మణ్యేశ్వరరావు, మాదాల సాంబశివరావు, గోనుగుంట్ల రవికుమార్ పాల్గొన్నారు.

బధిరులకు అన్నదానం

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అన్నదానం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది వజ్రాల అంజిరెడ్డి మనవరాలు సాయి ఇషిత పుట్టిన రోజు సందర్భంగా అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మురళి సుధాకరరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, చిన్నిమురళీకృష్ణ, నరసింహరావు పాల్గొన్నారు.



సందీపికను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి తైక్వాండోకు ఎంపికైన రాజుబంగారుపాలెం విద్యార్థి

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజుబంగారుపాలెం జల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆట్ల సందీపిక జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగిన 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలలో 41 కేజీల విభాగంలో సత్తాచాటి సందీపిక గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఖాలీషావలి తెలిపారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ చూపడంతో సందీపికను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. హర్యానా రాష్ట్రంలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో సందీపిక పాల్గొనన్నుట్లు తెలిపారు. సందీపిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందీపికను హెచ్ఎం ఖాలీషావలి, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, ఎస్.అంకయ్య, బి.శ్రీనివాసరావు, పీ.శ్రీలక్ష్మీ, జి.నాగమణి, తైక్వాండో కోచ్‌లు వాటుపల్లి సుబ్రహ్మణ్యం, షేక్ సుల్తాన్‌బాషా, విద్యార్థులు అభినందించారు.

జీజీహెచ్‌లో త్వరలో మదర్‌కేర్ సెంటర్

» ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ అన్సారియా
» వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంపై హెడ్ నర్సుకు చార్జ్‌మెమో

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు బంగారు బాల్యాన్ని అందించేందుకు ఒంగోలులోని జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ గైనిక్, చిన్నపిల్లల వార్డులతో పాటు పలు వార్డులలో పర్యటించి రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలు, పారిశుధ్యం, తాగునీరు తదితర సమస్యలను గుర్తించిన కలెక్టర్ వాటిని వెంటనే పరిష్కరించాలని జీజీహెచ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ న్యూ బార్న్ మదర్ కేర్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కనిగిరి సీహెచ్‌సీలో కేఎంసీ పైలట్ ప్రాజెక్టును చేపట్టేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తరించే ప్రణాళికలో భాగంగా ప్రస్తుతం జీజీహెచ్‌లోని గైనిక్, నవజాతి శిశు కేంద్రాలను పరిశీలించామన్నారు. కేఎంసీ అంటే తన బిడ్డకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహజ సిద్ధమైన సంచిలో దాచి ప్రాణాలు కాపాడే కంగారు మాదిరిగా ఉంటుందన్నారు. నెలలు నిండకుండా పుట్టిన, బరువు తక్కువగా పుట్టిన శిశువులకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా చూడాలన్న ఆలోచనతోనే కంగారు మోడల్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా అప్పటి వరకు కడుపులో ఉండి ఈ లోకంలోకి వచ్చిన బిడ్డకు, తల్లికీ ఎప్పుడు కూడా పరస్పరం స్పర్శ ఉండేలాగా చూస్తారన్నారు. బిడ్డను తల్లి ఛాతీపైన సాధ్యమైనంత ఎక్కువ సమయం పడుకోపెట్టడం ద్వారా వెచ్చదనాన్ని, ప్రేమను పంచవచ్చన్నారు. సరైన విధానంలో పాలు పట్టడం, పోషణ, శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించడమే ఈ విధానం లక్ష్యమని కలెక్టర్ తెలిపారు., కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ పాల్గొన్నారు. వార్డుల్లో బాత్‌రూములు అధ్వానంగా ఉండటంతోపాటు, దుర్వాసన రావడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. బాధ్యతారాహిత్యంగా ఉన్న హెడ్ నర్సుకి చార్జ్ మెమో ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

(5వ పేజీ తరువాయి)

చూపిస్తుంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు వినియోగిస్తున్న యంత్రాలకు, సీసీఐ బయ్యర్లు వినియోగిస్తున్న యంత్రాలకు తేడా కనిపిస్తుంది. సీసీఐ కేంద్రాల్లో ప్లాస్టిక్ గోతాల్లో పత్తి తీసుకువస్తే కొనుగోలు చేయడంలేదు. దీంతో రైతులు విడిగానే పత్తిని లోడ్ చేసి తీసుకువస్తున్నారు. మినీ ఆటోల్లో పత్తిని ఎక్కువ మొత్తంలో తొక్కడం వల్ల లోపల వేడి పెరిగి తేమ శాతం పెరిగిపోతుందని రైతులు చెబుతున్నారు. ఒకే లాట్‌లో ఐదు రకాలుగా తేమ శాతం నమోదవుతుంది.

రవాణా భారం తడిసి మోపెడు..

మద్దతు ధర వస్తుందన్న ఆశతో సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తిని తరలిస్తున్నారు. అందుకు రవాణా భారం తడిసి మోపెడవుతోంది. అయితే అంత భారం భరించి తీసుకువచ్చిన తర్వాత తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొన్ని లాట్లు కొనుగోలుకు బయ్యర్లు సుముఖత చూపటం లేదు. దీంతో దానిని వెనక్కి తీసుకెళ్లడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ఉదాహరణకు గుంటూరు మండలం చౌడవరం నుంచి జూటూరి వెంకయ్య అనే రైతు ఐదో మైలు వద్ద ఉన్న జగ్గయ్యపేట కేంద్రానికి 15 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చేందుకు రూ.2500 వ్యయమైంది. పత్తి లోడ్‌కు క్వింటాల్‌కు రూ.150 కింద ఖర్చు అయ్యింది. తెచ్చిన మొదటి రోజు కొనుగోలు చేయకపోవడంతో ఆటో వెయిటింగ్ చార్జి కింద రూ.1000 వరకు చెల్లించారు. అంత వ్యయం చెల్లించి ఒకరోజు అంతా నిరీక్షించినా తేమ శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదు. ఆ పత్తిని తిరిగి తీసుకువెళ్లడం రైతుకు తలకు మించిన భారమైంది. సీసీఐకి తీసుకువచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందంటున్న రైతులు ఎంతో కొంత తగ్గించి అయినా కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నారు.

తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలి



ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురిశాయి.ఇప్పుడు చలి కాలం వచ్చేసింది. గాలిలో తేమ శాతం పెరిగిపోయింది. ఇటువంటి పరిస్థితి లో పత్తి ఆరాటం చాలా కష్టం. సీసీఐ అధికారులు తేమ శాతం పెంచి పత్తి ని కొనుగోలు చేయాలి. లేకపోతే పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

- మలిపెద్ది లక్ష్మీ నారాయణ, కొర్రపాడు, మేడికొండూరు మండలం

ధర తగ్గించైనా కొనుగోలు చేయాలి



సీసీఐ కేంద్రానికి తెచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లడం తలకు మించిన భారం. ఒక వేళ తేమ శాతం ఎక్కువగా ఉంటే ధరలో ఎంతో కొంత కోత విధించి పత్తి కొనుగోలు చెయ్యాలి. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

- జుటూరి వెంకయ్య, చౌడవరం, గుంటూరు మండలం

విస్తారంగా పొగాకు సాగు

» దక్షిణాదిలో ఇప్పటికే 40వేల హెక్టార్లలో నాట్లు
» భారీగా పెరగనున్న విస్తీర్ణం
» పెరిగిన నారు ధర, కూలీల వేతన ఖర్చు
» అయినా ముమ్మరంగా సాగు
» గత రెండేళ్ల ధరల ప్రభావం, వాతావరణ అనుకూలతలే కారణం

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో పొగాకు పంట సాగు ఈ ఏడాది విస్తారంగా సాగుతోంది. పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. పొగాకు సాగు చేసే ప్రాంతాల్లో ఏ గ్రామంలో చూసినా ఎదుగుదలలో ఉన్న పొగ మొక్కలు అలాగే కొత్తగా నాట్లు వేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి పొగాకు నారు ధర రెట్టింపునకు పైగా పెరిగినా, కూలీల ఖర్చు రెట్టింపు అయినా, అంతకు మించి కర్ణాటకలో ప్రస్తుత సీజన్ మార్కెట్ ప్రతికూలంగా సాగుతున్న ఇక్కడి రైతులు మాత్రం ముమ్మరంగానే పంట సాగు చేస్తున్నారు. ఇప్పటికే దక్షిణాదిలో దాదాపు 40వేల హెక్టార్లలో పొగాకు నాట్లు పూర్తికాగా మరో నెలన్నరకు పైగా సాగుకు అవకాశం ఉండటంతో మరో 40 నుంచి 50వేల హెక్టార్లలో నాట్లు వేసే పరిస్థితి కనిపిస్తున్నది.

అందరి చూపు పొగాకు వైపే

ఒంగోలు కేంద్రంగా ఉన్న దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ఈ పరిధిలో గత ఏడాది సుమారు 57,768 హెక్టార్లలో సాగుకు 89.98 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే రైతులు దాదాపు 72 వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో సాగుచేసి సుమారు 150 మిలియన్ల ఉత్పత్తి చేశారు. అలా భారీగా సాగు, ఉత్పత్తి పెరిగినా అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలించి ధరలు బాగానే లభించాయి. ఆ ప్రభావం ప్రస్తుత సీజన్‌పై తీవ్రంగా పడింది. విస్తారంగా పంట సాగుకు రైతులు ఉపక్రమించారు. రైతుల కోరిక మేరకు ఈ ఏడాది (2024-25) పొగాకు బోర్డు కూడా కొంతమేర అదనంగా సాగుకు, పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. దక్షిణాదిలో ప్రస్తుత ఏడాదికి సుమారు 67వేల హెక్టార్లలో పంట సాగుకు, 105 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా భారీగా పెరిగే పరిస్థితి కనిపిస్తోంది.



చెరుకూరపాడులో పొగ నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

అనుకూలంగా వాతావరణం

పశ్చిమ ప్రాంతంలోని తేలిక నేలల్లో సెప్టెంబరులోనే పొగాకు నాట్లు చేపట్టగా నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం వేస్తున్నారు. గత ఏడాది భారీగా ధరలు లభించి రాబడి ఉండటంతో పాటు ఈ ఏడాది పొగాకు సాగుకు వాతావరణం బాగా అనుకూలించింది. దీంతో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం చూస్తే పొదిలి వేలం కేంద్రం పరిధిలో 8వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సాగు చేయగా, ఒంగోలు-1 పరిధిలో 4,600, వెల్లంపల్లి కేంద్రం పరిధిలో 4 వేలు, కొండపి కేంద్రం పరిధిలో నాలుగున్నర వేలు, టంగుటూరు వేలం కేంద్రం పరిధిలో 2వేలు, ఒంగోలు-2 కేంద్రం పరిధిలో 1,500 హెక్టార్లలో సాగు చేయగా, నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి తదితర కేంద్రాలలో మరో 16వేల హెక్టార్లలో సాగు చేశారు. ఇంకా నెలన్నర నుంచి రెండు నెలల పాటు పొగాకు సాగుకు సమయం ఉంది.

రెండింతలైన ఖర్చులు

నల్లరేగడి ప్రాంతంలో ఇప్పుడిప్పుడే నాట్లు ప్రారంభమయ్యాయి. ఆ రకంగా చూస్తే మరో 40వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో నాట్లు పడే అవకాశం కనిపిస్తోంది. ఆ రకంగా భారీగా సాగు పెరగనుంది. ఇదిలాఉండగా సాగు ఆరంభం నుంచే రైతులపై భారం పడుతోంది. గతంలో ఎకరాకు మూటన్నర నారు అవసరం కాగా మూట రూ.1500 నుంచి రూ.2వేల ధర ఉండేది. ఈ ఏడాది మూట నారు ధర రూ.4వేలకు చేరగా నాణ్యత సరిలేక రెండు మూటలు వేయాల్సి వస్తోంది. అలాగే నాట్లు కూలీ కూడా గతంలో మనిషికి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.500కు చేరింది. ఇక ప్రస్తుతం కర్ణాటకలో ధరలు తగ్గి గందరగోళంగా ఉంది. అయినా ఇక్కడి రైతులు విస్తారంగా పంట సాగు చేస్తుండటం పట్ల పొగాకు రంగ అనుభవజ్ఞులు, బోర్డు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు నియంత్రించుకోవాలని సూచిస్తున్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డికి సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న ఏలూరి కార్యాలయ ప్రతినిధులు

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి ఆయన వచ్చారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరి సాంబశివరావు గెలుపునకు పర్చూరు నియోజకవర్గంలో నర్సిరెడ్డి ప్రచారం చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గ పార్టీ నాయకులతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. టీటీడీ బోర్డుమెంబర్‌గా నియమించిన తర్వాత ఆయన క్యాంపు కార్యాలయానికి రావడంతో కార్యాలయ ప్రతినిధులు నర్సిరెడ్డిని శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వెంకట్, అఖిల్ పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో గోతులు

- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



చందలూరు నుంచి ఇంకొల్లు వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంతలు

పంగులూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు నుంచి ఇంకొల్లు వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా మార్జిన్‌లు గోతులమయంగా మారాయి. రోడ్డు మార్జిన్లలో అడుగడుగునా ఏర్పడిన గుంతలతో వాహనచోదకులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొల్లు నుంచి అద్దంకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పాటు 16వ నెంబరు జాతీయ రహదారికి చేరుకునే రోడ్డు కావడంతో నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లలో భారీ గోతులు ఏర్పడడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. రాత్రివేళ ఎదురుగా వచ్చిన భారీ వాహనాల వెలుతురో మార్జిన్‌లలో గోతులను గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షం పడిన సమయంలో మార్జిన్ల వద్ద ఉన్న గుంతల్లో నీరు నిండిపోవడంతో వాటిని గుర్తించలేక వాహనదారులు పడిపోతున్నారు. రైతులు తమ పంటపొలాలకు ఎరువులు తరలించాలన్నా, కూలీలను ట్రాక్టర్లు, ఆటోలలో తరలించాలన్నా ఈ గోతులతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇటుక, ఇసుకతో పాటు ఎరువులు ఇతర సరుకులు చేర్చే ట్రాక్టర్లు, లారీలు, ఆటోలతో పాటు ప్రయాణికులను, విద్యార్థులను తిప్పే ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో ప్రయాణం నరకమని ప్రజలు వాపోతున్నారు. అలవలపాడు అడ్డరోడ్డు నుంచి కొణికి వరకు బీటీ రోడ్డుకు ఇరు వైపులా మార్జిన్లలో ఏర్పడిన భారీ గోతులను తక్షణమే మరమ్మతులు చేసి, రోడ్డుకు సమాంతరంగా బరమ్ నింపి వాహన చోదకులకు తగిన రక్షణ కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



విద్యార్థులకు బహుమతిని అందజేస్తున్న గ్రంథపాలకుడు

విద్యార్థులకు బహుమతుల అందజేత

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ గ్రంథపాలకుడు అవార్డు అందుకున్న సుగుణరావును సన్మానించారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, తాళ్ళూరు బాబురావు,రమేష్, జోషఫ్, గడ్డం సుబ్బారావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

తాగునీటికి తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు రోడ్డులోని వాటర్ ట్యాంక్ మరమ్మతుల నేపథ్యంలో ప్రజలకు తాత్కాలిక అంతరాయం ఉన్నట్లు మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు 28 నుంచి 32 వార్డుల పరిధిలోని ఉజిలీపేట, హరిప్రసాద్ నగర్, జవహర్‌నగర్, మరియమ్మపేట, జయంతిపేట ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని చెప్పారు. మరమ్మతుల అనంతరం సేవలు యథావిధిగా కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చీమలమందు తిని కాంట్రాక్టర్‌కు అస్వస్థత

- వంట రుచిగా లేదని రెండు సార్లు మెమోలు
- వేధిస్తున్నారంటూ బాధిత మహిళ ఆరోపణ

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకురాలితో అధికారులకు ఏర్పడిన వివాదం కారణంగా మంగళవారం ఉదయం స్కూల్ వంట గదిలో మహిళా కాంట్రాక్టర్ చీమలమందు తిని అస్వస్థకు గురైంది. సహచరులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాల్లో వెళితే.. సురేష్ మహల్ సమీపానికి చెందిన పుష్పలత 14 ఏళ్లుగా స్థానిక కేజీఎం హైస్కూల్లో ఎండీఎం ఏజెన్సీ తీసుకుని వంట చేస్తుం ది. కొంత కాలంగా వంట రుచికరంగా లేదంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌కు పుష్పలతకు మధ్య వివాదం నడుస్తుంది. ఈక్రమంలోనే ఎమ్ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆదేశాల మేరకు రెండు సార్లు ఆమెకు నోటీసులు ఇచ్చినట్లు హెచ్ఎం చెప్పారు. తనను తొలగించాలనే దురుద్దేశంతోనే ఎంఈవో, హెచ్ఎం, మరో ఉపాధ్యాయుడు వేధిస్తున్నారని పుష్పలత ఆరోపిస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం వంట గది వద్ద చీమల మందు తిన్నారు. ఆమెను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేయగా, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కమలాకర్ విషయంపై విచారణ చేస్తున్నారు.

బెల్టు షాపును నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు

బల్లికురవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో బెల్టు షాపును నిర్వహిస్తున్న ధర్మవరపు శ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. మంగళవారం గ్రామ దర్శిని కార్యక్రమంలో భాగంగా ఉప్పుమాగులూరుకు ఎస్ఐ వెళ్లగా అక్కడ ధర్మవరపు శ్రీను బెల్టు షాపులో మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. శ్రీనును ఎక్సైజ్ పోలీసులకు అప్పగిస్తామని తెలిపారు.

పొలం వివాదంలో మహిళపై వ్యక్తి దాడి

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన మహాలక్ష్మికి సమీప బంధువులతో పొలం వివాదం ఉంది. ఈక్రమంలో ఆమెపై పెర్ల వెంకటరావు దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో యూనియన్ అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో డీవీవీ సుబ్బారావు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో మూడు నెలలుగా కార్మికులకు చెల్లించాల్సిన నైట్ అవుట్ అలవెన్స్‌లు, డేఅవుట్ అలవెన్సులు చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అధికారులకు అలవెన్సులు చెల్లిస్తున్నా కార్మికులకు చెల్లించడం లేదన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలన్నారు.కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎస్‌కె బీబీజాన్, ఏసీహెచ్ అంజయ్య, బీసీహెచ్ శేఖర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అద్దంకి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు బుధవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు 9959225697 సెల్ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మోదేపల్లి,కొటికలపూడి ఫీడర్‌లలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి త్రీఫేజ్ సప్లై పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, అత్యవసర సమయం లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ ఇంట్లో చోరీ

దేవాంగపురి (చీరాలటౌన్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ కార్యాలయం సమీపానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ పృథ్వీ నటరాజ్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. పది రోజుల కిందట హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. మంగళవారం చోరీ జరిగినట్లు పనిమనిషి ద్వారా తెలుసుకున్నారు.



రైతులకు మినుములను పంపిణీ చేస్తున్న అధికారులు

ఉచితంగా మినుము విత్తనాల పంపిణీ

వేటపాలెం(చీరాల), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో చల్లారెడ్డిపాలెం, అక్కాయిపాలెం గ్రామాల పరిధిలో సామూహిక ప్రదర్శనా క్షేత్రాలలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు మినుము విత్తనాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. చల్లారెడ్డిపాలెంలో 50 ఎకరాలకు ఎకరానికి 10కేజీల చొప్పున 50 మంది రైతులకు, అక్కాయిపాలెంలో 25 మంది రైతులకు మొత్తం 7.50 క్వింటాళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. సాగు మెళకువలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేట్ జి.రమేష్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు కె. రత్నకుమారి, ఏవో ఐ. కాశీ విశ్వనాథ్, ఏఈవోలు గోపికృష్ణ, జశ్వంత్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ చౌదరి

బల్లికురవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తుంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ జీవీ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని చౌదరి అన్నారు. ప్రభుత్వ విద్య ఒత్తిడి లేని విద్య అని తెలిపారు. విద్యార్థులకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీపీతో విష వాయువులు విడుదల



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల దండుబాట రోడ్డులో నిర్మించనున్న ఎస్టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం)తో విషవాయువు విడుదలై ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుందని సీపీఎం నాయకులు ఎన్.బాబూరావు అన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రాంతానికి సమీపంలో స్కూల్‌లో 5 వేల మంది చిన్నారులు చదువుతున్నారన్నారు. ప్లాంట్ చుట్టూ సుమారు 15వేల మంది దళితులు జీవిస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.జయరాజు, కాలనీ పెద్దలు కోండ్రు కిరణ్, పులిపాటి బాబూరావు, చంద్రబాబు, కృపావర్ధన్, శ్యాంప్రసాద్, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి నివాళి

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు మోహనలక్ష్మి నరసింహాచార్యలు, వాసవీ వనితా క్లబ్ మహిళల, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు, విద్యార్థినులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. బీసీ బాలికల వసతి గృహంలోని బాలికలకు వాసవి సభ్యులు రాత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంకు మేనేజర్ పర్వతరెడ్డి కాంతరావు, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, వాసవీ మండల అధ్యక్షురాలు కోట సుచిత్ర పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు

చీరాల సమస్యలపై అసెంబ్లీలో చర్చ

వాణి వినిపించిన ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలలో రెండింటిపై మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రస్తావించారు. ప్రధానంగా చేనేతల సమస్యల పరిష్కారంలో భాగంగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చామని, అది ఎప్పటి నుంచి ప్రారంభించగలమో తెలపాలన్నారు. అత్యధికంగా నేతన్నలు ఉన్న ప్రాంతాల్లో చీరాల ఒకటన్నారు. ఈ ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని చీరాల నియోజకవర్గంలోనే అధికారికంగా జరిపిన విషయాన్ని మననం చేశారు. వైసీపీ పాలనలో నేతన్న నేస్తం పేరుతో కార్మికులను మోసం చేసిందన్నారు. 2014 నుంచి 2019 మధ్య ఏపీ పథకాలు అమలయ్యాయో వాటిని పునరుద్ధరించాలని నేతన్నలు కోరుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయపరంగా నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. అవి సక్రమంగా లేవు. వాటికి మరమ్మతులు అవసరం. యుద్ధప్రాతిపదికన ఆ చర్యలు చేపట్టేందుకు సహకరించాలి. ఏపీఎస్ ఐడీసీకి సంబంధించి రెండు జిల్లాల పరిధిలో కేవలం ఒక డీఈ, ఏఈ మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత ఉంది. ఈ క్రమంలో పని భారంతో డీఈ ఎప్పుడు ఫోన్ చేసినా ఆరోగ్యం సరిలేదని చెప్తున్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలకు సంబంధిత మంత్రి సహకరించాలని సభ ద్వారా ఎమ్మెల్యే కొండయ్య కోరారు.

దివ్యాంగులు, ఎస్టీలకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు, ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జీ ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శుక్రవారం దివ్యాంగుల సమస్యలు, ప్రతి నెలా 4వ శుక్రవారం ఎస్టీల సమస్యల గురించి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రత్యేక ప్రజా సమస్యల కార్యక్రమానికి హాజరై సమస్యలపై తగు ఆధారాలతో అర్జీలు ఇవ్వాలని కోరారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు సమస్యలను ముందుగా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని, పరిష్కారం కాని వాటిని ఎండార్స్‌మెంట్ ఇస్తామని తహసీల్దార్ తెలిపారు.

అద్దంకిటౌన్ : కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ప్రతి మూడవ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక మీకోసం జరుగుతుందని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. దివ్యాంగులు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందాలని సూచించారు. ప్రతి నాల్గవ శుక్రవారం షెడ్యూల్ తెగల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకుని వారి సమస్యలను సకాలంలో పరిష్కారించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

వ్యాసరచనలో మూడోస్థానం

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేసిన ఎస్పీ

మార్టూరు, నవంబరు 19 : పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ మంగళవారం మండల పోలీసుస్టేషన్‌లో సైబర్ క్రైమ్ అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పిసాయికీర్తి మూడవబహుమతి సాధించింది. మార్టూరులోని శ్రీశ్రీనివాస హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థిని సాయికీర్తి మూడవ బహుమతిని సాధించడంతో ఉపాధ్యాయులు అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుషార్‌డూడీ ప్రశంసాపత్రం, నగదును సాయికీర్తికి అందజేశారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ



సోపిరాలలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏలూరికి అవార్డుపై హర్షం

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు విజనరీ లీడర్ అవార్డు ప్రకటించడంతో టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోపిరాల గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపెంట జయరావు స్వగృహంలో మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన కేకు కట్ చేశారు. ప్రతి నిత్యం నియోజకవర్గ ప్రజల శ్రేయస్సును కాంక్షించే ఎమ్మెల్యే ఏలూరికి అంతర్జాతీయ పురస్కారం లభించడం అభినందనీయమని జయరావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామపుబ్బారావు, కోట శివరామకృష్ణ, శిఖరం సూరిబాబు, షేక్ బాజీ, భయ్యా సతీష్, తుమ్మలపెంట శ్రీనివాసరావు, షేక్ నబీషా, మీర్జాన్, షేక్.సుభాని, గంటా నరసింహారావు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గోవాడ, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, మోదేపల్లి, మణికేశ్వరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వరి పండించిన రైతులు ప్రభుత్వం మద్దతు ధరకు అమ్ముకోవాలని తెలిపారు. గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2320, 75 కేజీల బస్తా రూ.1740 ధరగా పేర్కొన్నారు. గ్రేడ్ బీ రకం క్వింటా రూ.2300, 75 కేజీల బస్తా రూ.1725కి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గోనె సంచులు ప్రభుత్వం ఉచితంగా అందించడంతో పాటు రవాణ చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. తేమ శాతం 17లోపు కచ్చితంగా ఉండాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీ మా చేయించుకోవాలని, వరికి ఎకరాకు రూ.126, మొక్కజొన్నకు రూ.105, శనగకు రూ.84 చెల్లించాలని తెలిపారు. వరి పంటలో సుడి దోమ నివారణకు డినోటిఫ్యూరాన్ 20శాతం ఎస్‌జీ (టోకెన్) 75 గ్రాములు పిచికారీ చేయాలని, లేదా ట్రిఫ్లుమేజోపైరం 10శాతం ఎస్‌సీ (ఫెగ్జాలాన్) 84 ఎంఎల్‌లో వేప నూనె కలిసి పిచికారీ చేయాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో వీప ఏ సాయిబాబు, పుట్టా సాంబశివరావు, మా కినేని ఏడుకొండలు, ధూళిపాళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు పంట సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. తక్కెళ్లపాడు గ్రామం లో సాగులో ఉన్న మిరపను రైతులతో కలసి పరిశీలించారు. మిరపలో నల్లి ప్రభావం ఉందని దాని నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పిచ్చిరెడ్డి, శింగరు, ఎనికపాటి శ్రీనివాసరావు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి పారుదలలో లస్కర్ల పాత్ర చాలా కీలకం. కాలువలపై వీరు లేకపోతే నీటి యాజమాన్యం చాలా కష్టం. చివరి ఆయకట్టు వరకు నీరు పారక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోగా లస్కర్లను తొలగించింది. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. వెంటనే లస్కర్లకు జీతాలు చెల్లించడంతోపాటు ఈ సీజన్‌కు లస్కర్ల నియామకం చేపట్టాలి.

- ఇటీవల జరిగిన డీఆర్సీలో ఎమ్మెల్యేల గళం

లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపండి. ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద మంజూరైన అత్యవసర పనుల్లోనే లస్కర్ల నియామకానికి అనుమతులు తీసుకోండి. ఈ సీజన్‌లో అవసరం మేర లస్కర్ల నియామకం జరగాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి.

- కూటమి ప్రభుత్వ ఆదేశాలివి

వచ్చిన అవకాశాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ఇరిగేషన్ అధికారులు వినియోగించుకున్నారు. అత్యవసర పనుల కిందనే లస్కర్ల నియామకానికి కూడా అనుమతులు పొందారు. కానీ నెల్లూరు జిల్లాలో మాత్రం అధికారుల్లో అంతులేని నిర్లక్ష్యం ఆవహించింది. ఇంతవరకూ అసలు లస్కర్ల నియామానికి ప్రతిపాదనలు పంపలేదు. అత్యవసర పనులకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఇక లస్కర్ల నియామకానికి ఏ పద్దు కింద అనుమతులు లభిస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- జిల్లాలో ఇరిగేషన్ శాఖ పనితీరు ఇది

- సెంట్రల్ డివిజన్ అధికారుల్లో అంతులేని నిర్లక్ష్యం
- ఇంతవరకూ లస్కర్ల నియమకానికి పంపని ప్రతిపాదనలు
- ఓఅండ్‌ఎం కిందనే పెట్టుకోమన్నా పట్టించుకోని వైనం
- నెల్లూరు తప్ప అన్ని జిల్లాలకూ ప్రభుత్వం అనుమతి
- మొదలైన సాగు.. రైతాంగానికి తప్పని అవస్థలు



వారంతే.. మారరంతే!

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్టుగా తయారైంది జిల్లాలోని లస్కర్లు, రైతాంగం పరిస్థితి. రెండేళ్లుగా లస్కర్ల నియామకానికి అనుమతులు ఇవ్వకపోవడంతో అనధికారికంగా లస్కర్ల చేత పనిచేయించుకుంటూ వచ్చారు. ఇందుకు ఇప్పటికీ జీతాలు కూడా ఇవ్వలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగ అవసరాలను దృష్టిలో పెట్టుకొని లస్కర్ల నియామానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నీటి పన్ను తీరువా వసూళ్లు జిల్లాలో జరగకపోవడంతో ఆ పద్దు కింద లస్కర్ల నియామకానికి నిబంధనలు ఒప్పుకోవు. ఈ క్రమంలో ఇటీవల అనుమతులు ఇచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ అత్యవసర పనుల కిందనే లస్కర్లను కూడా నియమించుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఇందుకు ప్రతిపాదనలు పంపి అవసరం మేర అనుమతులు పొందాలని ఆదేశించింది. ఈ అవకాశాన్ని అన్ని జిల్లాలు సద్వినియోగం చేసుకున్నాయి. వేగంగా ప్రతిపాదనలు పంపి లస్కర్ల నియామకానికి అనుమతులు పొందాయి. అక్కడ లస్కర్ల నియామకం కూడా పూర్తయింది. కానీ నెల్లూరు జిల్లాలో సెంట్రల్ డివిజన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ ఏడాది కూడా లస్కర్ల నియామకం కష్టంగా మారింది. ప్రభుత్వం అవకాశమిచ్చినా ఇంత వరకూ ప్రతిపాదనలే పంపకపోవడం గమనార్హం. అత్యవసర పనులకు టెక్నికల్ అనుమతులు ఇవ్వడం, వాటికి టెండర్లు పిలవడం అన్నీ జరిగిపోయాయి. ఆ అనుమతుల్లో లస్కర్ల నియామకం లేదు. దీంతో లస్కర్లను నియమించుకోవడం వీలు కాదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

● ఎమ్మెల్యేలనూ పట్టించుకోని అధికారులు

లస్కర్లు లేకపోతే నీటి యాజమాన్యం చాలా కష్టమవుతుంది. అవసరం మేర కాలువలకు నీటి విడుదల చేస్తూ నీటి దుబారాను అరికట్టడంతో పాటు చివరి ఆయకట్టు వరకూ నీరందేలా చేయడంలో లస్కర్లు కీలకంగా వ్యవహరిస్తారు. ఏడాదికి పది నెలలు మాత్రమే వీరు పనిచేస్తారు. జిల్లాలో సుమారు 230 మంది అవసరం కాగా నెలకు రూ.10,500 మాత్రమే వీరికి వేతనంగా చెల్లిస్తుంటారు. గతేడాది లస్కర్లు లేకపోవడంతో సుమారు 20 టీఎంసీల వరకు నీరు దుర్వినియోగం జరిగింది. ఆ నీరు జాగ్రత్త చేసుకొని ఉంటే గతేడాది రబీ సాగు పూర్తి ఆయకట్టులో జరిగి ఉండేది. ఈ ప్రభావంతో కొన్ని రూ.వందల కోట్ల విలువైన ఉత్పత్తి ఆగిపోయింది. ఈ నేపథ్యంలో లస్కర్ల నియామకం, జీతాల గురించి కూటమి ఎమ్మెల్యేలు పదే పదే ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన డీఆర్సీ

- మిగతా 6లో

'సోమశిల'కు 6,131 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 6,131 ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.460 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రూ.8.92 లక్షలకు 10 శాతం ఇవ్వాల్సిందే!

- ఉదయగిరి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీవో డిమాండ్
- అరియర్స్ బిల్లు మంజూరు కోసం పట్టు
- వారం రోజులపాటు తిరిగిన ఉపాధ్యాయుడు
- చివరకు రూ.46 వేలకు ఒప్పందం
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ బృందం
- నగదు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



ఏసీబీ స్వాధీనం చేసుకొన్న నగదు



అధికారుల అదుపులో ఎస్టీవో మమత

ఉదయగిరి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎస్టీవో సీహెచ్ మమత సూచించిన వ్యక్తి పవన్‌కు ఓ వ్యక్తి రూ.40 వేలు లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. వివరాల్లోకి వెళితే.. వరికుంటపాడు మండలం బోయమడుగుల ప్రాథమికోన్నత పాఠశాలలో వింజమూరుకు చెందిన లోకసాని వెంగయ్య ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈయన అందవలసిన అరియర్స్ రూ.8,92,717లకు సంబంధించి బిల్లును ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపారు. అయితే, బిల్లు మంజూరు చేయాలంటే పది శాతం నగదు ఇవ్వాలని ఎస్టీవో సీహెచ్ మమత డిమాండ్ చేసినట్లు బాధితుడు వెంగయ్య అన్నారు. అంత నగదు ఇచ్చుకోలేనని ప్రాధేయపడుతూ వారం రోజులు ఆ అధికారి చుట్టూ తిరిగినట్టు వాపోయాడు. చివరకు 5 శాతానికి కుదించి రూ.46 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. అయితే, లంచం ఇచ్చేందుకు ఇష్టంలేని వెంగయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు మంగళవారం సాయంత్రం రూ.40 వేలు నగదు తీసుకొని ఎస్టీవోను కలవగా కార్యాలయంలో ఉండే పవన్ అనే వ్యక్తికి ఇవ్వమని సూచించారు. కార్యాలయం వద్ద అతనికి నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు ఆంజనేయరెడ్డి, విజయకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● లంచం అడిగితే ఫోన్ చేయండి : డీఎస్పీ

ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీష విలేకరులతో మాట్లాడుతూ ట్రెజరీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించడంతోపాటు ఎస్టీవో మమతను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 9440440057తోపాటు తన నెంబర్ 9440446184కు ఫోన్ చేయాలని సూచించారు. ఫిర్యాదుదారు పేరు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

లంచం ఇవ్వడం ఇష్టంలేకే



ట్రెజరీ అధికారులకు లంచం ఇవ్వడం ఇష్టంలేకే ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు బాధితుడు లోకసాని వెంగయ్య తెలిపారు. అరియర్స్ బిల్లు మంజూరు కోసం వారం రోజులు తిప్పుకున్నట్లు తెలిపారు. మొత్తం బిల్లులో పది శాతం ఇస్తేగాని బిల్లు మంజూరు చేయమని తేల్చిచెప్పారనీ, చివరకు ఐదు శాతం ఇస్తామనడంతో ఫైలు కదిలించినట్లు ఆవేదన చెందారు. అయితే, వారికి లంచం ఇవ్వడం ఇష్టంలేక ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

● ప్రభుత్వ కార్యాలయాల్లో వణుకు

ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంపై ఏసీబీ దాడులు చేస్తున్నారని గంటల వ్యవధిలో పట్టణమంతా దావాలనంలా వ్యాపించింది. దీంతో ఆ కార్యాలయ సమీపంలో ఉన్న తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల్లో వణికిపోయారు. తమ కార్యాలయాల్లో కూడా దాడులు జరుగుతాయోమోనని భీతిల్లిపోయారు. కొందరు ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయాల నుంచి బయటకు వెళ్లిపోయారు.



లింగసముద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువులు, పురుగు మందుల నిల్వలో తేడా!

- రూ.5.68 లక్షల విలువైనవిగా గుర్తించిన విజిలెన్స్
- లింగసముద్రంలోని రెండు షాపుల్లో తనిఖీలు

లింగసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు, జిల్లా వాణిజ్య పన్నుల అధికారి విష్ణురావు సంయుక్తంగా లింగసముద్రంలోని శ్రీఅమృత ఏజెన్సీస్ ఎరువుల షాపు, శ్రీ వీరబ్రహ్మేంద్ర విత్తనాల షాపును తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్లను, నిల్వ రిజిస్టర్లను వారు తనిఖీ చేశారు. ఆ తర్వాత గోదాముల్లోని ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను పరిశీలించగా, తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీవీరబ్రహ్మేంద్ర షాపులో రూ.4.70 లక్షలు, శ్రీ అమృత ఏజెన్సీస్‌లో రూ.98 వేలు మొత్తం రూ.5.68 లక్షల ఎరువులు, విత్తనాల వివరాలు రికార్డుల్లో లేవని తెలిపారు. దీంతో అమ్మకాలను తాత్కాలికంగా ఆపివేయించినట్లు తెలిపారు. అలాగే ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకే అమ్మాలని వారు డీలర్లను హెచ్చరించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాం లింకన్ తెలిపారు.

ఊపిరి తీస్తోంది!

» జిల్లాలో తీవ్రమవుతున్న శ్వాసకోశ వ్యాధి

- వివరాలు 6లో

భవిత కేంద్రాల బకాయిలు వచ్చేశాయ్!

- ఐదేళ్లుగా మొండిచేయి చూపిన వైసీపీ
- బాధితులకు తీపి కబురందించిన కూటమి ప్రభుత్వం
- పది నెలల బిల్లులు రూ.65.29 లక్షలు విడుదల

దివ్యాంగ చిన్నారులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చూపడం, రవాణా భత్యం, సహాయకులకు నగదు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పది నెలలకు రావాల్సిన అన్ని రకాల భత్యాలను విడుదల చేసింది.

నెల్లూరు (విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 38 భవిత కేంద్రాలు ఉండగా 16 సొంత భవనాల్లోను, మిగిలినవి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 3 వేల మంది పిల్లలు ఉండగా 66 మంది రీసోర్స్ పర్సన్లు, 14 మంది ఫిజియోథెరపిస్టులు, 46 మంది ఆయాలు పని చేస్తున్నారు. సిబ్బంది పర్యవేక్షణలో భవిత కేంద్రాల్లో విద్య, వృత్తి నైపుణ్యం, దినచర్యలు, శారీరక దృఢత్వం శిక్షణతోపాటు ఫిజియోథెరపీ అందిస్తారు. గడిచిన ఐదేళ్లలో ఈ కేంద్రాల నిర్లక్ష్యానికి గురికాగా తాజాగా కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది. 2023-24 సంవత్సరానికి పదినెలలకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను విడుదల చేసింది. వాటిని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసేలా సమగ్రశిక్ష కార్యాచరణ సిద్ధం చేసింది. జిల్లాలోని అన్ని కేంద్రాల్లోని 2,624 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రూ.65.29 లక్షలు విడుదలయ్యాయి. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి మాట్లాడుతూ విడుదలైన నిధులను ఆయా విభాగాలకు చెందిన లబ్ధిదారుల ఖాతాలకు త్వరలో జమ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు విడుదలైన వివిధ రకాల భత్యాలు

ప్రోత్సాహకాలు	విద్యార్థులు	విడుదల (రూ.లలో)
హోమ్‌బేస్డ్ అలవెన్స్	380	11,40,000
ఎస్కార్ట్ అలవెన్స్ (1 నుంచి 8వరకు)	270	8,10,000
ఎస్కార్ట్ అలవెన్స్ (9 నుంచి ఇంటర్‌వరకు)	179	4,47,000
ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ (1 నుంచి 8వరకు)	303	9,09,000
ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ (9నుంచి ఇంటర్‌వరకు)	179	5,37,000
బాలికల అలవెన్స్ (1 నుంచి 8వరకు)	1013	20,26,000
బాలికల అలవెన్స్ (9నుంచి ఇంటర్‌వరకు)	330	6,60,000

సంగంలోని సంగమేశ్వరాలయంలో కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం రాత్రి కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు సహస్ర లింగార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా మట్టితో తయారు చేసిన చిన్న సహస్ర లింగాలను శివలింగాకారంలో అమర్చి, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

-సంగం, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా సహస్ర లింగార్చన



రాళ్లపాడు సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావన

కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వ్యవసాయానికి జీవనాడిగా ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఈ ప్రాజెక్టుకు సోమశిల నుంచి ప్రతిఏటా 1.5 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా కనీసం ఒక్క టీఎంసీ కూడా రావటం లేదని, ఈ సమస్యతో పదేళ్లుగా రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో వరిసాగుకు రైతులు దూరంగా ఉంటున్నారని తెలిపారు. రాళ్లపాడుకు సోమశిల జలాలు వచ్చే గొట్టిపాటి కొండప నాయుడు ఉత్తర కాలువ విస్తరణ పనులను గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. అలాగే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు ఎన్నో ఏళ్లుగా మోక్షం కలగడం లేదన్నారు. 15కి. మీటర్ల పొడవున ఈ కాలువను పొడిగిస్తే 6వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు నిర్వహణలో కూడా సమస్యలు ఉన్నాయని, ప్రాజెక్టు అంతా పూడికతో నిండిపోయి ఉన్నందున డ్రిప్ కార్యక్రమంలో ఈ ప్రాజెక్టును చేర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వైభవంగా పెన్నా హారతి



కలువాయి మండలం రాజుపాళెంలో ఉన్న పరమానంద ఆశ్రమం సమీపంలోని పెన్నానదిలో మంగళవారం సాయంత్రం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామివారి పర్యవేక్షణలో నదీహారతి నిర్వహించారు. పెన్నాలో ప్రత్యేక పూజలు నిర్వహించి చినజీయర్ స్వామి నదికి హారతి ఇచ్చారు. అనంతరం ఆశ్రమంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆశ్రమంలో వసతి సముదాయాలను చినజీయర్‌స్వామి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఈదూరు రామాచార్యులు, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-కలువాయి (ఆంధ్రజ్యోతి)

కోలుకున్న విద్యార్థులు

- ప్రిన్సిపాల్ సరెండర్

కొడవలూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య గిరిజన పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులు కోలుకున్నారు. వారిని మంగళవారం టీడీపీ మండల నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, జొన్న శివ, ప్రసాద్‌రెడ్డి, జనసేన నేత గునుకుల కిషోర్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కేసీ పెంచలయ్య పరామర్శించారు. అనంతరం విద్యార్థుల భోజనం పరిశీలించారు. కాగా కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని భావించిన ఉన్నతాధికారులు ఆయనను విధుల నుంచి జిల్లా కేంద్రానికి సరెండర్ చేశారు. దీంతో హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కేసీ పెంచలయ్య ఆధ్వర్యంలో గిరిజన నాయకులు, కళాశాల విద్యార్థులు కళాశాల ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వీపీఆర్ సంస్థ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ను పాఠశాలకు అందజేశారు.



పంది దాడితో బాలుడికి తీవ్ర గాయాలు

గుడ్లూరు, నవంబరు 19: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బెల్లంకొండ శ్రీనాథ్‌పై (7) మంగళవారం పంది దాడిచేయడంతో బాలుడుకి తీవ్ర గాయమైంది. కాలనీవాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం కాలనీకి సమీపంలో బహిర్భూమికి బాలుడు వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ పంది అతని మీద పడి దాడి చేయడంతో బాలుడు ఒక్కసారిగా కేకలు వేశాడు. గమనించిన అటుగా వెలుతున్న కొందరు కర్రలు తీసుకొని ఆ పందిని తరిమేశారు. గాయపడిన బాలుడిని మొదట స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విచ్చల విడిగా గ్రామంలో సంచరిస్తున్న నాటు పందులను అరికట్టాలని బాలుని బంధువులు పందుల పెంపకందారులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపడతామని ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.



గాయపడిన బాలుడు శ్రీనాథ్

మత్స్యకారుల మణిపూస 'భక్తాని'

చిన్నతనం నుంచి సేవాకార్యక్రమాలు

విద్యార్థులు, క్రీడాకారులకు ప్రోత్సాహం

కరోనా సమయంలో జాలర్లకు చేయూత



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న భక్తాని శ్రీనివాసులు

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నది ఆయన నైజం. నిరుపేద మత్స్యకార కుటుంబంలో పుట్టినా, పట్టుదలతో చదువుకుని అంచలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. తాను పుట్టిన ఊరికి, తోటివారికి చేతనైనంత సాయం చేస్తూ పలువురి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. చిన్నతనం నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. అటు విద్యార్థులకు, ఇటు క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నారు విడవలూరు మండలం పొన్నపూడి లక్ష్మీపురం గ్రామానికి చెందిన భక్తాని శ్రీనివాసులు.

పొన్నపూడి లక్ష్మీపురం గ్రామానికి చెందిన భక్తాని జయ రామయ్య, మంగమ్మల పెద్ద కుమారుడు భక్తాని శ్రీనివాసులు ప్రాథమిక విద్య అంతా స్వగ్రామంలో సాగిన, అలహాబాద్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశా రు. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మహేంద్ర కంపెనీలో పనిచేసి, అనంతరం ఆక్వారంగంలో అడుగుపెట్టారు. తొలుత చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ మార్కెట్‌లో మంచిపేరు సంపాదించుకున్నారు. ఆ తరువాత కుటుంబ సభ్యులు, మత్స్యకారుల ప్రోత్సాహంతో శ్రీ లక్ష్మీగణ పతి సీఫుడ్స్ కంపెనీ ప్రారంభించి ఉన్నతస్థితికి చేరుకున్నారు.

కుటుంబ సభ్యుల సహకారం

చిన్నతనంలో తాను పడిన కష్టాలు ఎవరూ పడకూడదనే ఆలోచనతో మత్స్యకార గ్రామాల్లోని పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నా. పిల్లల చదువునకు, క్రీడాకారుల ఉన్నతికి తన వంతు సాయం చేస్తున్నా. భార్య మాధవి, ఇద్దరు తమ్ముళ్ల సహకారంతోనే ఇవన్నీ చేస్తున్నా.

- భక్తాని శ్రీనివాసులు

మత్స్యకారులకు చేయూత

చిన్నతనం నుంచి సేవాభావం కలిగిన శ్రీనివాసులు మత్స్యకార పిల్లలకు తన సొంత ఖర్చులతో విద్యాబోధన, క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారికి ప్రోత్సాహం అందచేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర సామాజిక సేవలు చేస్తున్నారు.

- టీచర్ల కొరత ఉన్న లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో సొంత నిధులతో విద్యావలంటీరును నియమించారు. అంతేగాక పాఠశాలకు అవసరమైన కుర్చీలు, బల్లలు, వాటర్ ఫిల్లర్లు, పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్లలు, ఊయళ్లు సమకూర్చారు.
- విడవలూరు డిగ్రీ కళాశాలకు రూ.15 వేలతో కుర్చీలు అందజేశారు. విడవలూరు, చౌకిచర్ల, పెద్దపాళెం, ఇస్కపల్లి, పొన్నపూడి లక్ష్మీపురం, రామచంద్రాపురం, కంచరపాళెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సొంత నిధులతో సరస్వతి విగ్రహాలను ఏర్పాటు చేశారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న భక్తాని శ్రీనివాసులు

- కరోనా సమయంలో మత్స్యకార గ్రామాల్లో సుమారు రూ.20 లక్షలతో కూరగాయలు, నిత్యావసర వస్తువులను ఉచితంగా అందచేశారు.
- మత్స్యకార గ్రామాల్లో విద్యను ప్రోత్సహించేందుకు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు.
- ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పునరావాస కేంద్రాల్లోని పేదలకు దుప్పట్లు, భోజన వసతి కల్పిస్తున్నారు.
- తీరప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేస్తున్నారు.

- విడవలూరు, (ఆంధ్రజ్యోతి)



మహిళకు మొబైల్ అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

బిల్లులు లేని మొబైళ్లను కొనద్దు!

- ప్రజలకు ఎస్పీ కృష్ణకాంత్ విజ్ఞప్తి
- రికవరీ చేసిన ఫోన్లు బాధితులకు అందజేత

నెల్లూరు (క్రైం) నవంబరు 19, ఆంధ్ర జ్యోతి): తక్కువ ధరకు వస్తున్నాయి కదా అని బిల్లులు లేని మొబైళ్లను కొనుగోలు చేయొద్దని ఎస్పీ కృష్ణకాంత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొబైల్ హంట్ ద్వారా చోరీ అయిన 700 మొబైళ్ల ను పోలీసులు స్వాధీ నం చేస్తున్నారు. మంగళ వారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో బాధితులకు ఎస్పీ సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసు కున్న బాధితులకు రూ.1.5 కోట్ల విలువ చేసే 700 ఫోన్లను అందచేశామ న్నారు. ఇప్పటివరకు ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువ చేసే 3వేల ఫోన్లను, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రూ.8 లక్షల విలువ చేసే 40 మొబైళ్లను బాధితులకు అందచేశామన్నారు. పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తూ పోగొట్టుకున్న మొబైల్స్ తిరిగి అందచేయడమే మొబైల్ హంట్ సేవలప్రధాన ధ్యేయమన్నారు. సరైన బిల్లులు లేని, కొత్త, సెకండ్ హ్యాండ్ మొబైల్స్‌ను కొనుగోలు చేయవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో శ్రమించిన సైబర్ క్రైం అనాలసిస్ బృందాన్ని, పోలీసుస్టేషన్ల పరిధిలో సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మిగిలిన ఫోన్లను కూడా రికవరీ చేసి బాధితులకు అందచేస్తామని, మొబైల్ హంట్ వాట్సప్‌ను (9154305600) ఎవరైనా తప్పుగా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సూక్ష్మ సేద్యం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఏవో సత్యవాణి, అధికారులు

ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలి

- పారిశుధ్య మిషన్ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని, ఆ మేరకు ప్రజలందరూ ప్రతిజ్ఞ చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో తాగునీరు-పారిశుధ్య మిషన్ జిల్లా స్థాయి సభ్యుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్లను వినియోగించుకోవటం గ్రామీణ ప్రజల గౌరవాన్ని, ముఖ్యంగా మహిళల గౌరవాన్ని కాపాడుకోవటమే అవుతుందన్నారు. ఆరోగ్య పరంగా వారి జీవితాల్లో పెనుమార్పులకు కారణమవుతుందని తెలిపారు. డిసెంబరు 10వ తేదీ వరకు మరుగుదొడ్ల వినియోగంపై విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకట రమణ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం పథకాలపై అవగాహన కల్పించండి

నెల్లూరు(వ్యవసాయం,ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సేద్యం పథకాలు, రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం సూక్ష్మ సేద్య పథకం విధి విధానాలు, రాయితీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బిందు, తుంపర్ల నీటితో సాగు పథకాలవైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, పట్టుపరిశ్రమల శాఖ అధికారి సత్యనారాయణ, ఆత్మ పీడీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



ఫిబ్రవరిలో 'డీకేడబ్ల్యూ' వజ్రోత్సవాలు

- పూర్వ విద్యార్థినుల సంఘం సన్నాహాలు

నెల్లూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ (డీకే) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025 ఫిబ్రవరి నెల రెండోవారంలో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల పూర్వ విద్యార్థినుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాల ప్రారంభమై 60 ఏళ్లు గడిచిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించిన సావనీర్‌ను ప్రచురిస్తున్నామని తెలిపారు. పూర్వవిద్యార్థులంతా సహకరించి వారి అనుభవాలను dkalumni1964@gmail.comకు మెయిల్ ద్వారా పంపించాలని కోరారు. వజ్రోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే వారంతా ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, కార్యక్రమ నిర్వహణకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. వజ్రోత్సవాల వివరాలు తెలుసుకునేందుకు 9398772966, 9949405595 నెంబర్లను సంప్రదించాలన్నారు. అనంతరం వజ్రోత్సవ బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు వీ జ్యోతిరెడ్డి, కార్యదర్శి కే కుసుమ కుమారి, సంయుక్త కార్యదర్శి ఎన్ జయలక్ష్మి, కోఆర్డినేటర్ కే కరుణశ్రీ, సభ్యులు డాక్టర్ టీ రంజని, డాక్టర్ మమత, బీ రాజరాజేశ్వరి, డాక్టర్ సీహెచ్ లలిత, ఎస్ రుక్మిణి, హెచ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వారంతే.. మారరంతే!

(5వ పేజీ తరువాయి)

సమావేశంలోనూ ఈ అంశాన్ని చర్చించారు. ఆఖరుకు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కూడా పలువురు ఎమ్మెల్యేలు లస్కర్ల ప్రాముఖ్యతను ప్రస్తావించారు. ఓ పక్క ఇలా ఎమ్మెల్యేలంతా రైతుల ప్రయోజనాల కోసం గళం విప్పుతుంటే అధికారులు మాత్రం విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డెల్టా ప్రాంతామైన సెంట్రల్ డివిజన్ పరిధిలోనే ఎక్కువగా లస్కర్లు అవసరమవుతారు. కానీ అక్కడి నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లలేదు. అత్యవసర విషయాల్లో కూడా అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం మారినా సెంట్రల్ డివిజన్‌లోని అధికారులు, ఉద్యోగుల పనితీరులో మాత్రం మార్పు రాలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశా నాయక్‌ను వివరణ కోరగా లస్కర్ల నియామకానికి సెంట్రల్ డివిజన్ నుంచి ఇంకా ప్రతిపాదనలు అందలేద అన్నారు. ఇదివరకే తాను ఆదేశించినట్లు తెలిపారు. కాగా సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.

ఊపిరి తీస్తోంది!




- ఉదయగిరి మండలానికి చెందిన వెంకట సుబ్బయ్య తీవ్రమైన ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షలు నిర్వహించి సీవోపీడీకి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. వారం రోజులు ఆసుపత్రిలోనే ఉంచుకుని చికిత్స చేసి రూ.1.20 లక్షలు వసూలు చేశారు. సామాన్య మధ్యతగతికి చెందిన సుబ్బయ్య ఈ వైద్యానికి అప్పు చేయాల్సి వచ్చింది.
- ఆత్మకూరు మండలం బట్టేపాడుకు చెందిన గిరిజన యువకుడు చెంచురామయ్య అతిగా ధూమపానం చేయడంతో సీవోపీడీ వ్యాధికి గురయ్యాడు. నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు రోజులుండి వైద్యం చేయించుకున్నాడు. కానీ అక్కడ అన్నీ మందులు లేకపోవడంతో కొన్ని బయట కొనుగోలు చేయాల్సి వచ్చింది. ధూమపానం మానేసి కొంత కాలం క్రమం తప్పకుండా మందులు వాడాలని వైద్యులు సూచించారు.

ఇలా జిల్లాలో సీవోపీడీతో వేల మంది బాధపడుతున్నారు. వ్యాధి మూడవ, నాల్గవ దశకు చేరుకుని మృత్యువాత పడుతున్నారు. కేవలం ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఒక్క నెల వ్యవధిలోనే 100 మందికిపైగా సీవోపీడీ తో మరణించడం ఆందోళన కలిగించే అంశం. అంతేకాదు మూడు నెలల్లోనే జిల్లాలో 5 వేల మందికిపైగా ఈ వ్యాధికి గురైనట్లు వైద్యులు చెబుతున్నారు.

- జిల్లాలో తీవ్రమవుతున్న శ్వాసకోశ వ్యాధి
- ఒక్క నెలలో 100 మంది మృత్యువాత
- 3 నెలల్లో 5వేల కేసులు
- 80వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- 5 మండలాల్లో అధికం
- ధూమపానం, ఆపై కాలుష్యమే కారణం
- నేడు ప్రపంచ సీవోపీడీ నివారణ దినం

నెల్లూరు (వైద్యం), నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : ఊపిరితిత్తులకు సంబంధించి అత్యంత ప్రమాదకరమైన వ్యాధి క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ). ఇదీ తీవ్రమైన ప్రాణాలు కోల్పోక తప్పని పరిస్థితి. ఈ రోగానికి 80 శాతం ధూమపానం కారణం కాగా, 20 శాతం వాతావరణ కాలుష్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ తర్వాత అత్యధికంగా మరణాలు సీవోపీడీ వల్ల సంభవిస్తున్నాయని గణాంకాలు సూచిస్తు న్నాయి. ఏడేళ్ల క్రితం జిల్లాలో సీవోపీడీ వ్యాధిగ్రస్తులు 30 వేల మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 80 వేలకు చేరింది. ఏటా 1200 మందికిపైగా ఈ వ్యాధితో మరణిస్తున్నారు. తొలిదశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, వ్యాధి ముదిరితే ఊపిరి తిత్తుల మార్పిడి తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించా లని నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే అపాయమని సూచిస్తున్నారు.



5 మండలాల్లో కేసులు తీవ్రం

జిల్లాలో ధూమపాన ప్రియులకుతోడు పరిశ్రమలు పెరగడం, వాహనాల సంఖ్య రెట్టింపు కావడం, పచ్చదనం తగ్గిపోవడం వంటి కారణాలతో కాలు ష్యం పెరిగి సీవోపీడీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో ఇప్పటికీ ఎక్కువ మంది కట్టెల పొయ్యి వాడుతుండటంతో వాటి నుంచి వెలువడే పొగను పీల్చడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఎక్కువ మంది సీవోపీడీకి గురవుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలు


నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి అన్ని రకాల వైద్య చికిత్సలు, ఆధునిక పరికరాలు అందుబాటు లో ఉన్నాయి. రోజుకు 80 మందికిపైగా వ్యాధిగ్రస్తులు ఈ విభాగానికి వస్తుంటారు. ఇక్కడ నలుగురు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రుల్లోనూ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఆయా ఆసుపత్రుల్లో సీవోపీడీకి చికిత్సలు అందిస్తున్నారు.



నిర్లక్ష్యం తగదు

సీవోపీడీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుంది. దీనికి ప్రధాన కారణం ధూమపానం. వ్యాధి ముదిరితే నయం చేయడం కష్టం. ఈ వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన అవసరం. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల కనీసం 6 నెలలకు ఒకసారైనా ఊపిరితిత్తుల పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ ఉమామహేష్, పల్మనాలజిస్ట్, అపోలో ఆసుపత్రి



తక్షణ వైద్యం అవసరం

సీవోపీడీ వ్యాధిగ్రస్తులకు వెంటనే వైద్య చికిత్సలు అందించాలి. లేదంటే వ్యాధి తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. జిల్లాలో సీవోపీడీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి కట్టెల పొయ్యి వాడే వారున్నారు. ఆ పొగకు తోడు వాతావరణ కాలుష్యం, ధూమపానం వల్ల వ్యాధి ప్రబలుతోంది.

- డాక్టర్ శశి భరత్‌కుమార్‌రెడ్డి, పల్మనాలజిస్ట్, కిమ్స్ ఆసుపత్రి

రామలింగేశ్వరా.. వేణుగోపాలా..!

- వందలాది ఎకరాల మాన్యం భూములు
- కౌలు రూపంలో లక్షల ఆదాయం
- శిథిలావస్థలో ఆలయాలు
- ధూపదీప నైవేద్యాలకు నోచుకోని వైనం
- లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో దుస్థితి

వలేటివారిపాలెం, లింగసముద్రం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఆలయం శ్లాబు పగుళ్లు రావడంతో వర్షం వస్తే నీరు ఒడుస్తుంది. గర్భగుడిలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో పూజచేసే సమయాలలో అర్చకులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రీ.శ15వ శతాబ్ధంలో నిర్మించిన ఆలయంలో ఏడు తలలతో కూడిన సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహం ఉంది. ఇలాంటి విగ్రహం శ్రీశైలంలో కూడా లేదని అర్చకులు చెబుతున్నారు. ఆలయానికి చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రతిసోమవారం వేలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తులు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు లేవు. భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయలేదు. ఆలయం చుట్టూ ప్రహరీ లేక పోవడంతో ఆకతాయిలు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. స్నానాలు చేసేందుకు కోనేరులోకి దిగేందుకు మెట్లు సక్రమంగా లేవు. కోనేరు అపరిశుభ్రంగా ఉంటుంది. ఆలయానికి 227ఎకరాల మాన్యం భూములున్నాయి. వాటినుంచి కౌలురూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

● లింగసముద్రం: పెదపవని వేణు గోపాల స్వామి ఆలయానికి 100ఎకరాల మాన్యం భూమి ఉన్నా దూపదీప నైవేద్యాలు కరువయ్యాయి. ఇంత చారిత్రకమైన ఆలయ పునర్మిణానికి దేవా దాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ మన్యం భూములకు ఈ ఏడాది నిర్వహించిన కౌలు వేలంలో రూ.2.80లక్షలు వస్తున్నాయి.

ప్రధాన సమస్యలివే..

గోపురంపైన, గర్భగుడి శిథిలావస్థకు చేరి మొక్కలు మొలిచాయి. గుడి లోపల స్లాబు పెచ్చులూడి పోవడంతో వర్షం కురిసినపుడు దేవతా మూర్తుల విగ్రహాలు తడుస్తున్నాయి. లోపల వర్షం నీరు పడకుండా గుడిపైన ప్లాస్టిక్ పట్టాలు కప్పుతున్నారు. పండుగల సమయంలో దేవతా మూర్తుల ఊరేగింపు, ఇతర కార్యక్రమాలను దాతల సాయంతో నిర్వహిస్తున్నారు. దేవాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయాల పునర్నిర్మా ణానికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


లింగసముద్రం: శిథిలావస్థలో వేణుగోపాలస్వామి ఆలయ గోపురం

వరద ప్రమాద స్థలాల పరిశీలన

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెన్నానది, బీరాపేరుల్లో వరదలు వచ్చినప్పుడు రక్షణ చర్యలు చేపట్టేందుకు అవగాహన నిమిత్తం ముందుగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం అధికారులతో కలిసి పెన్నా, బీరాపేరు వాగు ప్రమాద ప్రదేశాలను పరిశీలించారు.



న్యూస్ బాక్స్

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ఉలవపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నేటికోట అడ్డరోడ్డు మలుపు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న కందుకూరు మండలం కంద్రావారి పాలెంకు చెందిన దామచర్ల తిరుపతయ్య, జ్యోతి దంపతులను లారీ ఢీకొంది. గాయపడిన వారిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వింజమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మంగళ వారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అదే పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం. మాల కొండయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే నిర్వహించాలి

బిట్రగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేపై నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో సుబ్రమణ్యం గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం, ఏనుగులబావి, ముంగమూరు పంచాయతీ కార్యాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఇంటింటికి వెళ్లి గృహ నిర్మాణాల కొలతలు, కుటుంబ సభ్యుల వివరాల సర్వే, 18ఏళ్లు నిండిన ఆధార్ లింకప్, పోస్టాఫీస్‌లో అకౌంట్ చేయించడంపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరుపల్లిలో వైద్య శిబిరం

బిట్రగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి ఆరోగ్యకేంద్ర ఆవరణలో నెల్లూరు నారాయణ హాస్పిటల్ వైద్యులతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యనిపుణులు గోపీనాథ్, భరత్ కుమార్, అహ్మద్‌అలీ, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాఘవేంద్రరావు పాల్గొన్ని 126మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాటకరాణి భాస్కర్, ఇందుపూరు రామ్మోహన్‌రెడ్డి, ఎస్.శీనయ్య, రంగయ్య, కోటేశ్వరావు, తిరుపతి ఉన్నారు.

22న జాబ్‌మేళా

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన యువకులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి అంకమ్మ తిరునాళ్ల

అనంతసాగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులో వెలసిన గ్రామదేవత అంకమ్మ తిరునాళ్ల బుధవారం నుంచి ఐదు రోజులపాటు నిర్వహించ నున్నట్లు ఆలయ ధర్మకర్త బల్రెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి

ఏఎస్ పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని ఎంఈవో సాయిప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఠాగూర్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.

బాలికల రక్షణ చట్టాలపై అవగాహన

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల రక్షణ చట్టాలు, హక్కులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా లైంగిక వేధింపులు, బాల్య వివాహనాలను అరికట్టడం, బాలల హక్కులు, చట్టాలపై బాలికలను వివరించారు. కార్యక్రమంలో సఖి వన్ స్టాఫ్ సెంటరు ప్రతినిధులు, ప్రిన్సిపాల్ సుమతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.



సంగం : మాట్లాడుతున్న హేనాసుజన

● **చిన్న వయసులో పెళ్లిల్లు వద్దు**

ఏఎస్‌పేట, నవంబరు 19: బాలికలు చిన్న వయసులో వివాహాలు చేసుకోరాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళ వారం ఆమె స్థానిక జడ్పీ హైస్కూల్‌లో కిషోర్ వికాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్య వివాహలతో కలిగే నష్టలు వాటి నివారణకు తీసుకోవలసిన అంశాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరికృష్ణ,ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై అవగాహన సదస్సుతోపాటు మెప్మా ఆధ్వర్యంలో కిషోర బాలికల వికాసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ హేమసుజన్, మెప్మా టీఎంసీ మాధవి, సఖి వన్‌స్టాఫ్ సెంటర్ అడ్మిన్ షేక్ షహనాజ్ మా ట్లాడారు. కార్యక్రమంలో సీపీపీవో సునీలత, సూపర్‌వైజర్ రత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్ర కళ పాల్గొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

లింగసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాసయోజన పథకం కింద మంజూరైన పక్కాగృహాల నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు గృహ నిర్మాణ శాఖ డీఈఈ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన లింగసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలోని గృహనిర్మాణశాఖ కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతంలో ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ.1.80లక్షలు, పట్టణప్రాంతాల్లో రూ.2.50లక్షలు మం జూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులు హౌసింగ్ ఏఈ ఇంజనీరింగ్ అసిస్టెంటుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మంజూరైన వారు సొంత స్థలంలో లేదా పాత లేఅవుట్లలో నిర్మించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 281గృహాల నిర్మాణాలు వివిధ దశలలో నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. 570గృహాల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. ఆయన వెంట వీవీ పాలెం ఏఈ నాగరాజు, మండల ఇన్‌చార్జి ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్మల, నేతలు బి కొండపనాయుడు, చినకొండయ్య, ప్రసాద్ ఉన్నారు.


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి

అపార్ నమోదును వేగవంతం చేయండి

కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ రామలింగం తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలో అపార్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తిచేసేందుకు నిర్లక్ష్యం చేయరాదన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ విద్యాబోధన అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపార్ నమోదు తక్కువగా ఉన్న ప్రైవేటు పాఠశాలల ప్రతిని ధులతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకీరామ్, ఎంఈవోలు సుబ్బారెడ్డి, అజయ్‌బాబు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


చర్చిస్తున్న ఆర్జేడీ రామలింగం

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెం నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ శతజయంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్‌డీ రసూల్, ఎస్‌డీ అమతర్, టీ పెంచలయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● సంగం, నవంబరు 19: స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక బాలికల కళాశాల అధ్యాపకులు నారాయణరెడ్డి, విశ్రాంతి వీఆర్‌వో ఆదిశేషయ్య, ఉపాధ్యాయురాలు మమత, లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

● **రక్తదాన శిబిరం**

అనంతసాగరం, నవంబరు 19: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేము హరిబాబు, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.

● **ఇందిరాగాంధీకి నివాళి**

కావలి, నవంబరు 19: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళ వారం కావలి ఇన్‌చార్జి పొదలకూరి కల్యాణ్ ఆధ్వర్యంలో నేతలు నిర్వ హించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్.సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, పట్టణ అధ్య క్షుడు పఠాన్ ఖాదర్‌బాష, ప్రధాన కా ర్యదర్శి రియాజ్, గురవయ్య, కంచి వెం కటేశ్వర్లు, రవీంద్ర,టీ బాలు తదితరులు పాల్గొన్నారు.


కావలి: నివాళులర్పిస్తున్న నాయకులు

డిప్యూటీ డీఈవో పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓగురువాండ్లపల్లి, సీతారామపురం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆత్మకూరు డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న సముదాయ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌వలి, ప్రాధానోపాధ్యాయులు ఎస్.కొండయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

● **ఎంఈవో కార్యాలయం తనిఖీ**

ఉదయగిరి రూరల్, నవంబరు 19: స్థానిక ఎంఈవో కార్యాలయాన్ని మంగళవారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, పలు రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

● **పాఠశాల సముదాయ సమావేశం**

మండలంలోని అప్పసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 6-10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ ఏపీజీబీ మేనేజర్‌తో చర్చించి బ్యాంకు ఖాతాలు తెరిపించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

● కే సురేష్‌బాబు, కలిగిరి పశువైద్యశాల సంచాలకులు



కలిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పాడి రైతులకు అందే రాయితీలను, పాడి పశువులకు వేసే ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాల సంచాలకులు, మండల పశువైద్యాధికారి సురేష్‌బాబు తెలిపారు.

? ఎన్ని గోకులం షెడ్లు మంజూరైయ్యాయి.

! ప్రభుత్వం ఇచ్చే రాయితీ కింద 25గోకులం షెడ్లు మంజూరవగా, ప్రారంభ దశలో ఎనిమిది ఉన్నాయి. మిగిలినవి నిర్మాణాలు చేపట్టలేదు.

? పశుగ్రాసంపై ప్రభుత్వం రాయితీలు ఇస్తుందా.

! బహువార్షిక పశుగ్రాసాల సాగునకు, సన్న, చిన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం కింద 0.50ట్లు భూమిలో పశుగ్రాసం పెంచేందుకు ఉచితంగా విత్తనాలు అందజేస్తుంది. అలాగే సాగు చేసేందుకు పెట్టుబడిని కూడి అందజేస్తాం.

? పశుగణనతో ఉపయోగమేమి.

! ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే పశుగణనతో పశువుల సంఖ్యను బట్టి ప్రభుత్వం మందుల పంపిణీ, రాయితీలను అందించేందుకు వీలుకలుగుతుంది.

? పశువులకు వచ్చే వ్యాధులపై ఏ చర్యలు చేపడుతున్నారు.

! తెల్లజాతిపశువుల్లో ముద్దచర్మ, నల్లజాతి పశువుల్లో పచ్చికదొమ్మ వ్యాధులకు టీకాలను ఇంటి దగ్గరకు వెళ్లి వేస్తాం.

చుండిలో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నేతలు

వలేటివారిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చుండిలో మంగళవారం మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చెరువుపల్లి మాల్యాద్రి మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డీలర్ చెరువుపల్లి సాంబశివరావు, నాయకులు ఇరపని లక్ష్మయ్య, బొమ్మినేని మాదవరావు, నరసింహరావు, చొప్పర వెంకట్రావు, ముతకని తిరుపతయ్య, చెరువుపల్లి అశోక్ పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

కొండాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భీమవరప్పాడుని కృష్ణ మందిరంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శ్రీకృష్ణుని మందిరాన్ని ఏర్పాటు చేసి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వాహకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విడవలపాటి వెంకయ్య, విడవలపాటి బాబూరావులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆడిట్‌లో నిధుల రికవరీకి ఆదేశం

మర్రిపాడు, 19 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.86,322ల అవినీతి జరిగిందని, ఆ నిధుల రికవరీకి డ్వామా పీడీ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయ ఆవరణంలో జరిగిన సామాజిక తనిఖీలో డ్వామా పీడీ గంగాభవాని పాల్గొన్నారు. మండలంలో రూ.11.15కోట్లతో పలు పనులు నిర్వహించగా, కొలతల్లో తేడా, రిజిస్టరు నిర్వహణ సక్రమంగా లేనందున నిధులు దు ర్వినియోగం అయ్యాయని ఆమె ఆగ్ర హం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవీవో విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్‌బాబు, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, ఏపీవోలు నారాయణ పాల్గొన్నారు.


డ్వామా పీడీ రికార్డుల పరిశీలన

రైతులకు శిక్షణ

సీతారామపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లిలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి మంగళవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. వివిధ పంటల్లో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలు, మేలైన విత్తనాల ఎంపిక గురించి రైతులకు సూచనలిచ్చారు.ఈ కార్యక్రమములో మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి, వీఏఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరికుంటపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మారుతీదేవి, లక్ష్మీమాధవి, శైలజకుమారి పేర్కొన్నారు. కొండారెడ్డిపల్లి, యర్రంరెడ్డిపల్లిలో కేవీకే శాస్త్రవేత్త సురేఖదేవి, వ్యవసా యాధికారి రవికు మార్‌లతో మినుము పైర్లను పరిశీలించారు.

ఆక్రమణల్లో పాతూరు చెరువు

వింజమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూ రు చెరువు అక్రమణలకు గురైంది. పట్టణం రోజురోజుకు విస్తరిస్తున్న తరుణంలో పల్లెవాసులు పట్టణానికి చేరుకుంటున్నారు. దీంతో ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరుగుతున్నందున ఖాళీగా ఉన్న చెరువును ఆక్రమిస్తున్నారు. ఈ చెరువు పక్కనే ఇరిగేషన్ శాఖ కార్యాలయం ఉన్నా కూడా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ చెరువుకు ఆయకట్టు లేనందున నీటి పారుదల కాలువలన్నీ అక్రమణలకు గురయ్యాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చెరువును సమ్మ ర్ స్టోరేజీ కింద ఏర్పాటు చేసేందుకు శిలాఫలకాన్ని వేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవపోవడంతో పనులు ఆగాయి. ఎండాకాలం పట్టణంలో నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా ఆగిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెరువును ఆక్రమణల చెర నుంచి విడిపించాలని కోరుతున్నారు.


అక్రమణలకు గురైన పాతూరు చెరువు

అమ్మవారి ఆభరణాలకు గ్రామోత్సవం

సంగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరాలయంలోని కామాక్షిదేవికి భక్తులు చేయించిన బంగారు ఆభరణాలను ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు అలంకరించి, భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ ఆభరణాలను ఆలయ ఇన్‌స్పెక్టర్ చైతన్యకు అప్పగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇటీవల భక్తులు అమ్మవారికి 395.565 గ్రాముల బంగారుతో ఆభరణాలు చేయించారు.

● ఉలవపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న అయ్యప్పస్వామి విగ్రహ గ్రామోత్సవాన్ని మంగళవారం భక్తులు వైభవంగా నిర్వహించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

● సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

వలేటివారిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం ఆమె నవాబ్‌పాలెం ఆక్రమణలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. గతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆన్‌లైన్, రికార్డుల్లోనూ నమోదు చేసినట్లు కందుకూరు సబ్ కలెక్టర్‌కు హుస్సేన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో తొలగించి రికార్డుల్లో ఎందుకు తొలగించలేదని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. రెవెన్యూ రికార్డులతో భూముల్లోకి వెళ్లి పరిశీలించి, ఆక్రమణదారుల పేరుమీద ఉన్న ప్రభుత్వ భూములను ఆన్‌లైన్, రికార్డుల్లో తొలగించి ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ అబ్దుల్‌అమీర్, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో అంజని పాల్గొన్నారు.

● ఆక్రమణ స్థలాలు స్వాధీనంపై ఆర్డీవో సమీక్ష

కావలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వాటిపై సర్వే చేసి వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆర్డీవో వంశీక్రిష్ణ అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై మంగళవారం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో పట్టణ, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, కావలి తహసీల్దార్ శ్రావన్‌కుమార్, ఎమ్పీడీవో సీహెచ్ శ్రీదేవి, పట్టణ ప్రణాళికాధికారి వివేక్, మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కావలిలో అక్రమ లేఅవుట్‌లతో పాటు పలు ప్రాం తాలలో ఆక్రమణలు జరిగినా అధికారులు పట్టించుకోవటం లేదని ఒక వ్యక్తి హైకోర్టులో పిటషన్ వేశారని అందులో భాగంగా ఈ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో ఆక్రమణల స్థలాలు స్వాధీనం విషయం మున్సిపల్ అధికారులకు, మండల పరిధిలోని ఆక్రమణ స్థలాలు స్వాధీనం తహసీల్దార్, ఎమ్పీడీవోలకు అప్పగించారు.